ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 11.03.2026 | సంపుటి :12 సంచిక : 231 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# యుద్ధం ఉగ్రరూపం

**ఊహించని దాడులు చేస్తాం: అమెరికా**
**ఢీకొట్టే అంటున్న ఇరాన్**
**ఇజ్రాయెల్, సౌదీ, కువైట్‌లపై ప్రతిదాడి**


- దీర్ఘకాల యుద్ధానికి సిద్ధమని ప్రకటన
- చమురు నిక్షేపాల వైపు వచ్చిన 2 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ రక్షణశాఖ ప్రకటన
- 6 డ్రోన్లను తమ నేషనల్ గార్డ్ కూల్చివేసిందని కువైట్ ప్రభుత్వం ప్రకటన
- యుద్ధం వేళ.. పుతిన్‌కు ట్రంప్ ఫోన్ కాల్



**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో 11వ రోజు భీకరయుద్ధం జరుగుతోంది. ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ 33వ విడత డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. అమెరికాకు చెందిన రెండు అత్యాధునిక రీపర్ డ్రోన్లను ధ్వంసం చేసిన వీడియోను ఇరాన్ పంచుకుంది. అటు తుర్కియోలోకి ప్రవేశించిన ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్‌ను నాటో కూల్చివేసింది. బహ్రెయిన్‌లో ఇరాన్ భారీ డ్రోన్ దాడి చేసింది. 19 వందల మందికి పైగా ఇరాన్ సైనికులు చనిపోయినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆరు విమానాశ్రయాలపై దాడి చేసినట్లు పేర్కొంది. అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- ఇరాన్ నాయకుల మధ్య మాటల యుద్ధం ముదిరింది. మంగళవారం ఇరాన్ ఉన్నతాధికారి ఒకరు ట్రంప్‌కు తీవ్ర హెచ్చరికలు

మిగతా 2లో..

## ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుంది



- ఇంధన ధరలు దిగి వస్తాయి
- ట్రంప్ సంచలన ప్రకటన
- ఇరాన్ హెచ్చరికలతో వెనక్కి తగ్గిన అమెరికా అధ్యక్షుడు

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్‌పై దాడిని, మధ్యప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది'

మిగతా 2లో..

# గుది బండ

## దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్లకు కొరత

- హోటల్స్,పరిశ్రమలకు గ్యాస్ సరఫరా నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు
- ఇప్పటికే మూతపడ్డ 20శాతం హోటళ్లు
- గ్యాస్ దొరకకపోతే మూసివేత తప్పదన్న యాజమాన్యాలు
- ఇరాన్ యుద్ధ ప్రభావంతో నిత్యావసరాలపైనా మోత
- ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఎల్పీజీ కొరత ఏర్పడింది. గ్యాస్ కంపెనీలు ఎల్పీజీ సిలిండర్ల ధరను భారీగా పెంచేశాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లతో పాటు డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధర పెరిగింది. డొమస్టిక్ సిలిండర్లపై 60 రూపాయలు.. కమర్షియల్ సిలిండర్లపై 115 రూపాయలు పెరిగింది. అంతేకాదు.. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా నిలిచిపోయింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవటంతో బెంగళూరు, చెన్నై, ముంబైలలోని హోటళ్లు, రెస్టారెంట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నగరాల్లోని దాదాపు 20 శాతం హోటళ్లు మూతపడ్డాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయి లో 20శాతం హోటళ్లు, రెస్టారంట్లు మూతపడ్డాయని హెటల్ హోటల్ అండ్ రెస్టారంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. 'ది బెంగళూరు హోటల్స్ అసోసియేషన్' ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'గ్యాస్ సరఫరా నిలిచిపోవటంతో.. హోటల్స్ మూతపడనున్నాయి. భోజనం కోసం హోటల్స్‌పై ఆధారపడిన సాధారణ ప్రజలు, విద్యార్థులు, మెడికల్ ప్రొఫెషనల్స్ ఇబ్బందులు పడకతప్పదు. గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు మా హోటల్ ఇండస్ట్రీ ఇబ్బందులు పడక తప్పదు. ఈ విషయంలో కేంద్రం త్వరగా సరైన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంది. చెన్నై హోటల్స్ అసోసియేషన్ కూడా ఓ ప్రకటన

మిగతా 2లో..



## ఎల్పీజీ ఉత్పత్తిని పెంచండి

- 10శాతం పెంచాలని గ్యాస్ కంపెనీలకు కేంద్రం ఆదేశం
- కొరత నివారణకు పెట్రో కంపెనీలతో కమిటీ ఏర్పాటు
- చమురు సంస్థలపై నిత్యావసర సరకుల చట్టం అమలు
- కేంద్రమంత్రులతో ప్రధాని మోడీ అత్యవసర భేటీ
- పెట్రో, గ్యాస్ నిల్వలు, సరఫరాలపై సమీక్ష

2లో..

## తెలంగాణలో బంద్ దిశగా హోటళ్లు

- సిలిండర్ల సరఫరా నిలిపివేయడమే కారణం
- కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెట్రోలియం కంపెనీల నియంత్రణ
- హోటళ్లకు సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని
- డీలర్లకు కేంద్రం ఆదేశాలతో ఆందోళనలో వ్యాపారులు
- హోటల్స్ నిర్వహించలేమని బంద్ పాటించే యోచన

2లో..



ఆరు గ్యారంటీల అమలుపై అసెంబ్లీలో

# ప్రైవేట్ బిల్లు

**కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, అరాచకాలపై రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నిలదీస్తాం: కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేస్తున్న మోసం, అరాచకాలపై రాబోయే బడ్జెట్ సమావేశాల్లో నిలదీస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన వ్యవధి 60 శాతం పూర్తవుతోందన్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ ప్రాధాన్యాలు, హామీల విషయంలో, చిత్తశుద్ధి బయటపడుతుందని చెప్పారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలపై ప్రశ్నిస్తామని, బీఆర్ఎస్ తరఫున ప్రైవేట్ బిల్లు పెడతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అసెంబ్లీ నడపడం ఇష్టం లేదన్న కేటీఆర్ పేదల ఇళ్లపై


మిగతా 2లో..

# అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించం

**బెంగాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి**

- ఈసీ ఆదేశాల మేరకే ఉద్యోగులు పనిచేయాలి
- ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్





**కోల్‌కతా(జనంసాక్షి):** ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారంనాడు మాటాడారు. పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 61,000 బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత, అవకతవకల నిరోధానికి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ అమలు చేస్తామని తెలిపారు. రాజ్యాంగం ప్రకారమే ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించామని, పూర్తిగా పారదర్శకతంగా జరిగిందని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన తర్వాత ఎన్నికల కమిషన్ సమీక్షా సమావేశం జరుపుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో హింస మరియు బెదిరింపులకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఇసి రెండు రోజుల పాటు సమీక్ష సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని చట్ట అమలు సంస్థలు భయం లేదా పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఓటింగ్ శాతం అధికంగా ఉందని, ఓటర్లు మరియు ప్రజలు రాజ్యాంగాన్ని గౌరవిస్తారని అన్నారు. శాంతియుతంగా, స్వేచ్ఛాయుతమైన వాతవారణంలో పోలింగ్ జరిగేలా చూడాలని

మిగతా 2లో..

# రాహుల్‌ని మాట్లాడనివ్వడం లేదు

**లోక్‌సభ ప్రతిపక్ష నేత ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు!**
**రేయింబవళ్లు నెహ్రూను విమర్శించేవారు నేడు ఆయనను ప్రశంసిస్తున్నారు**

- అమెరికా ముందు భారత ప్రభుత్వం తలవంచింది
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం
- జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ, చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు.

మిగతా 2లో..

# గ్రామపంచాయతీలకు శాశ్వత భవనాలు

- తెలంగాణ టూరిజాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలి
- అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్(జనంసాక్షి):** రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతుల తో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్ లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్ లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎం ఓ యు

మిగతా 2లో..



# సుప్రీం కోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ బహిరంగ క్షమాపణలు

- న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం
- పుస్తకాన్ని అందుబాటులో లేకుండా చేశామని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం సుప్రీంకోర్టుకి బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయవ్యవస్థలో 'అవినీతి'గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడంపై సుప్రీంకోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సిఇఆర్‌టిని మందలించిన సంగతి తెలిసిందే. ఈ అధ్యాయంపై సుమోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. దీంతో ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ , సభ్యులు పుస్తకంలో ప్రకటించిన అధ్యాయానికి బేషరతుగా, తగిన అర్హతతో కూడిన క్షమాపణలు

మిగతా 2లో..

రూ. 8.8 లక్షల కోట్లతో

# 6 భారీ ప్రాజెక్టులు

- దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- అంతర్జాతీయ విమానాశ్రయంగా మధురై ఎయిర్‌పోర్టు
- జల్ జీవన్ మిషన్ పొడింపునకు మరో రూ.8.7 లక్షల కోట్లు
- రూ.2,905 కోట్లతో సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ ఫోర్‌లేన్ రోడ్డు
- జెవార్ విమానాశ్రయం-ఫరీదాబాద్ మధ్య 6 లైన్ల ఎలివేటెడ్ రోడ్డు
- కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ. 8.8 లక్షల కోట్ల విలువైన ఆరు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇక జల్ జీవన్ మిషన్ పొడింపు కోసం మరో రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్ పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ మధ్య రూ. 2,905 కోట్లతో నాలుగు లైన్ల రహదారి, రూ. 3,839 కోట్లతో బద్నావర్-థాండియా-తిమర్వానీ మధ్య 5 లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. రూ. 3,631 కోట్లతో

మిగతా 2లో..



ఫోన్ ట్యాపింగ్ కేసు..

## ప్రభాకర్‌రావుకు అరెస్టు నుంచి మినహాయింపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు అరెస్టు నుంచి మినహాయింపు లభించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు సహకరించాల్సిందేనని ప్రభాకర్‌రావును జస్టిస్ నాగరత్నతో కూడిన ధర్మాసనం

మిగతా 2లో..

# రూ. 8.8 లక్షల కోట్లతో ఆరు భారీ ప్రాజెక్టులు

జెవార్ విమానాశ్ర యం-ఫరీదాబాద్ సెక్షన్‌ను కలిపే 6 లైన్ల ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే కాకుండా, సామాన్యుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచనున్నాయి. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం 'జల జీవన్ మిషన్ 2.0' ప్రారంభం. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. 2019లో ప్రారంభమైన మొదటి దశలో ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందగా, ఇప్పుడు రెండో దశ ద్వారా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అదనంగా లక్షల కోట్ల రూపాయల కేంద్ర సాయాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడులోని ఆధ్యాత్మిక, చారిత్రక నగరమైన మధురైకి కేంద్రం అంతర్జాతీయ స్థాయి గుర్తింపునిచ్చింది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయం దక్షిణ తమిళనాడు అభివృద్ధికి సరికొత్త రెక్కలు తొడిగింది. దీనివల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అంతేకాకుండా, మధురై చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక, విద్యా , వైద్య హబ్‌లకు అంతర్జాతీయ స్థాయి అనుసంధానం లభించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ౹÷ళిశవ్యాప్తంగా రైళ్ల రద్దీని తగ్గించి, రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించింది. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని సాయింతియా-పాకూర్ , సంత్రాగచి-ఖరగ్‌పూర్ విభాగాల్లో నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ అదనపు లైన్ల వల్ల కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, బొగ్గు , ఇతర సరుకు రవాణా కూడా వేగవంతం కానుంది. ఇది భారతీయ రైల్వేల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంలో ఒక మైలురాయిగా నిలవనుంది. రవాణా రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో మధ్యప్రదేశ్‌లో కొత్తగా ఫోర్ లేన్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-752డి పరిధిలో బద్నావర్ నుండి తిమర్వానీ వరకు 80 కిలోమీటర్ల మేర నిర్మించబోయే ఈ రహదారి ఉజ్జయిని నగరాన్ని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేతో నేరుగా అనుసంధానిస్తుంది. దీనితో పాటు, ఉత్తరప్రదేశ్‌లోని జేవార్ విమానాశ్రయాన్ని ఫరీదాబాద్‌తో కలిపే ఎలివేటెడ్ రోడ్డు ప్రాజెక్టును కూడా ఆమోదించారు. ఈ నిర్ణయాలన్నీ కలిపి దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తాయని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించం

ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చిన సీఈసీకి మంగళవారంనాడు కూడా నిరసనల సెగ తప్పలేదు. మంగళవారం ఉదయం దక్షిణెళిశ్వర్ కాళి ఆలయాన్ని సందర్శించేందుకు ఆయన వచ్చినప్పుడు కొందరు నల్లజెండాలతో నిరసన తెలుపుతూ 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి సీఈసీ రాక సందర్భంగా నేతాజి సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం బయట కూడా ఇలాంటి నిరసన ప్రదర్శనలు చేటుచేసుకున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం విడుదల చేసిన ఓటర్ల తుదిజాబితా నుంచి పక్షపాత ధోరణితో పెద్దఎత్తున పేర్లు తొలగించారని నిరసన ప్రదర్శకులు ఆరోపిస్తున్నారు.

## ప్రభాకర్‌రావుకు అరెస్టు నుంచి మినహాయింపు

ఆదేశించింది. సాక్ష్యాలు, ఆధారాలు ట్యాంపర్ చేసినా, సాక్షులను ప్రభావితం చేసినా ముందస్తు బెయిల్ రద్దవుతుందని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని పేర్కొంది.

## సుప్రీం కోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ బహిరంగ క్షమాపణలు

చెబుతున్నాం. మొత్తం పుస్తకం ఉపసంహ రించబడింది. అందుబాటులో లేదని పేర్కొంది. ఈ కారణంగా కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. సభ్యుల అవగాహనకు అభినందిస్తున్నాం అని పేర్కొంది. విద్యా సమాచారంలో ఖచ్చితత్వం, సున్నితత్వం మరియు బాధ్యతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఎన్‌సిఇఆర్‌టి కట్టుబడి ఉందని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ పుస్తకంపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు బ్లాంకెట్ బ్యాన్ విధించిన రెండు వారాల తర్వాత ఈ వివాదంపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. సోమవారం బహిరంగ క్షమాపణలు చెప్పింది. పుస్తకం మొత్తాన్ని ఉపసంహరించుకున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ పుస్తకాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం జరిగింది. అది ఇప్పుడు అందుబాటులో లేదు' అని స్పష్టం చేసింది. పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ పాఠ్యాంశాన్ని న్యాయ వ్యవస్థపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించ నని తేల్చి చెప్పారు. బుక్‌పై నిషేధం విధించారు. అన్ని కాపీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. ఆన్‌లైన్ ద్వారా పుస్తకం మొత్తం లేదా దాని భాగాలను షేర్ చేయటంపై కూడా చీఫ్ జస్టిస్ నిషేధం విధించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీఈఆర్‌టీ ఛైర్మన్‌కు నోటీసులు జారీ చేశారు.

## ఆరు గ్యారంటీల అమలుపై అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు

బుల్డోజర్లు నడుపుతున్నట్లే అసెంబ్లీలో కూడా బుల్ డోజ్ చేయాలని చూస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి మాటకే జీరో వ్యాల్యూ ఉందని, ఏం చేస్తున్నారో ఆయనకే అర్థం కావడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వంద రోజుల్లోనే చట్టబద్ధంగా అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలకు డబ్బులు లేవంటున్న సీఎం మూసీ ప్రాజెక్టును మాత్రం లక్షన్నర కోట్లతో ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు.ఈ నెల బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గోల్కొండ రిసార్ట్స్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. శాసనసభ నిబంధనలు, బడ్జెట్ అంశాలు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజాసమస్యలపై స్పందించాల్సిన తీరు, తదితరాలపై అవగాహన కల్పించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున ప్రశ్నించాల్సిన విషయాలు, పార్టీ పరంగా లేవనెత్తాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై సెషన్‌లో చర్చించినట్లు కేటీఆర్ తెలిపారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ లేరు, కమిటీలు లేవని కేటీఆర్ ప్రభుత్వంపై విమర్శించారు. మార్చి పదో తేదీ వచ్చినా కూడా రైతుబంధుకు దిక్కు లేదని, ముచ్చటగా మూడోసారి ఎగ్గొట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. తెలంగాణలో రాహుల్ బంధు పథకం తీసుకొచ్చారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సమస్యలతో పాటు హామీలు, కట్టని వడ్డీలు కట్టినట్లు చెబుతున్న అంకెల గారడీ, ప్రభుత్వ పెద్దల అవినీతి, అక్రమాలపై కూడా సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. మూసీకి తాము వ్యతిరేకం కాదన్న ఆయన ప్రజలకు మంచి పునరావాసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డే ఎకానమీ నాశనం చేసి నైట్ ఎకానమీ డెవలప్‌మెంట్ ఏంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కట్టినట్లు నిరుపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు.

# యుద్ధం ఉగ్రరూపం

జారీ చేశారు. 'త్యాగాలకు సిద్ధపడే ఇరాన్ నీ బెదిరింపులకు భయపడదు' అని ఘాటు స్పందించారు. ట్రంప్ కంటే హేమాహేమీలే ఇరాన్‌ను ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఇరాన్‌ను అంతం చేయాలని చేస్తే నీకే ఆ గతి పడుతుందని జాగ్రత్తగా ఉండు అంటూ హెచ్చరికలు జారీ చేయడం సంచలనంగా మారింది.

ఇరాక్‌లోని యూఏఈ కాన్సులేట్‌పై డ్రోన్ దాడి

ఇరాక్‌లోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కాన్సులేట్ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధంలో అనవసరంగా తాము చిక్కుకొన్నట్లు యూఏఈ వ్యాఖ్యానించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరగడం గమనార్హం. కుర్దిష్ ప్రాంతంలో ఉన్న ఈ కాన్సులేట్ మంగళవారం జరిగిన దాడిలో స్వల్పంగా దెబ్బతిందని అధికారులు పేర్కొన్నారు. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేశారు. తాజా దాడిని యూఏఈ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది ప్రాంతీయ భద్రతకు, స్థిరత్వానికి తీవ్ర ముప్పుగా పేర్కొంది. ఇలా దౌత్య కార్యాలయాలను, ప్రాంగణాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. యూఏఈ ప్రభుత్వం ఈ దాడిని ఖండించినప్పటికీ.. డ్రోన్ దాడి ఎవరు చేశారనే విషయాన్ని వెల్లడించలేదు. ఇక, ఇరాక్‌లోని అమెరికా ఎయిర్‌బేస్ లక్ష్యంగా దాడి చేసినట్లు ఐఆర్‌జీపీ పేర్కొంది. అమెరికా సైనిక స్థావరంపై ఐదు క్షిపణులను ప్రయోగించినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది.అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంలో తమ దేశాన్ని లక్ష్యంగా చేసుకోవడంపై యూఏఈ అసంతృప్తి వ్యక్తంచేసింది. అనవసరంగా తమను మధ్యలోకి లాగుతున్నారని వ్యాఖ్యానించింది. ఇరాన్‌పై దాడుల్లో పాల్గొనడం లేదని.. యుద్ధంలోకి తాము రావాలనుకోవడం లేదని పేర్కొంది. ఈ వ్యాఖ్యలు చేసిన కొన్ని గంటల్లోనే ఇరాక్‌లోని ఆ దేశ కాన్సులేట్ లక్ష్యంగా దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక, పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు యూఏఈ సిద్ధమైంది. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా ఈ ప్రాంతానికి తమ క్షిపణులు, విమానాలను పంపుతున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ పేర్కొన్నారు. బోయింగ్ సంస్థ రూపొందించిన ఇ-7ం వెడ్జ్‌టైల్ అనే విమానాన్ని కూడా పంపుతున్నట్లు తెలిపారు. ఇది నాలుగు వారాలపాటు గల్ఫ్‌దేశాల గగనతలాన్ని



పర్యవేక్షిస్తుందని వెల్లడించారు.

అమెరికాకు రక్షణ కవచాల కొరత!

"మేం ఆయుధాల కొరతను ఎదుర్కోవడం లేదు. ఎప్పుడూ లేనంతగా మా దగ్గర నిల్వలు ఉన్నాయి" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం చెబుతున్నా.. రక్షణ నిపుణులు మాత్రం ఇందుకు భిన్నంగా స్పందిస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధం మూడు నుంచి నాలుగు వారాలు దాటి కొనసాగితే ఆయుధాల కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20 వేల నుంచి 50 వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒకొక్క ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థికపరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు. పోరు మొదలైన 100 గంటల్లోనే 2 వేలకు పైగా స్మార్ట్ బాంబులను అగ్రరాజ్యం ప్రయోగించింది. వీటి ఖరీదే.. 3.7 బిలియన్ డాలర్లు. అంతేకాదు.. వందల సంఖ్యలో ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులను అడ్డుకోవడానికి అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఇంటర్‌సెప్టర్లను అగ్రరాజ్యం వినియోగించాల్సి వస్తోంది. అత్యంత ఖరీదైన గగనతల రక్షణ వ్యవస్థలతో(పేట్రియాటిక్, థాడ్) ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో వీటి నిల్వలు భారీగా తరిగిపోతున్నాయని వార్తలొస్తున్నాయి.

రాడార్ వ్యవస్థలే లక్ష్యం

అమెరికా క్షిపణులను, వైమానిక దాడులను అడ్డుకోవడం కష్టమని ఇరాన్‌కు తెలుసు. అందుకే గగనతలంలో అగ్రరాజ్యానికి కళ్లు, చెవులుగా పనిచేసే రాడార్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంది. సౌదీ అరేబియా, జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈల్లో ఈ వ్యవస్థలు ఉన్నాయి. వీటిపై గురిపెట్టి.. ఇరాన్ డ్రోన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జోర్డాన్‌లో అమెరికా స్థావరంలోని దాదాపు 300 మిలియన్ డాలర్ల విలువైన థాడ్ రక్షణ వ్యవస్థ ధ్వంసమైంది. ఈ రాడార్ లేకపోతే క్షిపణులు ఎక్కడ నుంచి వస్తున్నాయో గుర్తించడం, అడ్డుకోవడం కష్టమవుతుంది. కువైట్‌లోనూ మూడు రాడార్ వ్యవస్థలకు ఇరాన్ డ్రోన్లు నష్టం కలిగించాయి. సౌదీ అరేబియాలోని అమెరికా స్థావరమైన ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌లో కీలక రాడార్ వ్యవస్థను ఈ డ్రోన్లు దెబ్బతీశాయి.ఆయుధ నిల్వల విషయంలో అమెరికా అప్రమత్తంగా ఉండాలని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) ఇటీవల అమెరికాను హెచ్చరించింది. ఆ నివేదిక ఏం చెప్పిందంటే..

2025 డిసెంబరు నాటికి అమెరికా దగ్గర థాడ్ క్షిపణులు 534, ఎస్-3లు 414 ఉన్నాయి.గతేడాది ఇరాన్‌పై జరిగిన 12 రోజుల యుద్ధంలో థాడ్ నిల్వల్లో అమెరికా 20 నుంచి 50 శాతం ఖర్చు చేసేసింది.ఇంటర్‌సెప్టర్ క్షిపణుల తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. ఏడాదికి 700 క్షిపణులు తయారు చేసే సామర్థ్యం అమెరికా సంస్థలకు ఉంది.సాధారణ మందుగుండు సామగ్రి విషయంలో కొరత లేకపోయినా.. థాడ్, పేట్రియాట్, సీఎం-3 లాంటి అత్యాధునిక ఆయుధ వ్యవస్థల విషయంలో అమెరికా ఇబ్బందులు ఎదుర్కోనుంది.

పుతిన్‌కు ట్రంప్ ఫోన్ కాల్

ఇరాన్ యుద్ధంపై రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్‌లో చర్చలు జరిపినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఇరాన్‌తో యుద్ధం, ప్రపంచ చమురు సరఫరాలో అనిశ్చితి, ఉక్రెయిన్, రష్యా, అమెరికా త్రిముఖ చర్చల గురించి ఇరువురు నేతలు దాదాపు గంటసేపు మాట్లాడుకున్నట్లు తెలిపింది. యుద్ధం కారణంగా తమ మిత్ర దేశమైన ఇరాన్ పెద్ద మొత్తంలో నష్టపోతుండడంపై రష్యా అధ్యక్షుడు ఆందోళన వ్యక్తంచేసినట్లు పేర్కొంది.పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం ముగింపునకు తీసుకోవాల్సిన దౌత్య చర్యలపై కొన్ని ప్రతిపాదనలను పుతిన్.. ట్రంప్ ముందు ఉంచినట్లు రష్యా విదేశాంగ సలహాదారు యూరి ఉషాకోవ్ తెలిపారు. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని త్వరగా ముగించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ట్రంప్‌నకు సూచించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంపై అమెరికా ప్రతినిధులతో జరుగుతోన్న ద్వైపాక్షిక చర్చల పైనా వారు మాట్లాడుకొన్నట్లు ఉషాకోవ్ పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ నూతన సుప్రీంతో చర్చలు జరిపిన పుతిన్ టెహ్రాన్‌కు తాము సంపూర్ణ మద్దతిస్తామని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్‌కు శివ ప్రతాప్ శుక్లా

### నూతన గవర్నర్‌కు స్వాగతం పలికిన సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.

# ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుంది

అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్‌పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

అందుకే ఇరాన్ నౌకలను ముంచేస్తున్నాం: ట్రంప్

ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటివరకు 5వేల లక్ష్యాలను ఛేదించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. తమ దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందన్నారు. మూడున్నర రోజుల్లో ఆ దేశానికి చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను యూఎస్ మిలిటరీ ముంచేసిందంటూ వెల్లడించారు. ఈ సందర్భంగా సైనిక అధికారులతో జరిగిన సంభాషణను ప్రస్తావించారు."ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోంది. 46 నౌకలను ముంచేశామంటే నమ్మగలరా..? ఈ విషయంలో మన సైన్యంతీరు నాకు అంతగా నచ్చలేదు. దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడాను. ఆ నౌకలు ఎలాంటివని అడిగాను. అవి అగ్రశ్రేణి నౌకలని చెప్పారు. 'మరి అలాంటప్పుడు స్వాధీనం చేసుకొని మనం వాడుకోవచ్చు కదా..! ఎందుకు ముంచేశారు..?' అని ప్రశ్నించాను. వాటిని ముంచడం సరదాగా ఉందని, అలా చేయడమే సురక్షితమని సమాధానం ఇచ్చారు. నాక్కూడా అది నిజమేనని అనిపించింది. ఇక మన సైన్యం ఇప్పుడు పశ్చిమాసియాకు విహారయాత్రకు వెళ్లింది. కొంత చెడును వదిలిస్తోంది. ఆ యాత్ర కొద్దికాలమే ఉంటుంది. అది మీరు కూడా చూస్తారు. శత్రువును పూర్తిగా ఓడించేవరకు మన మిలిటరీ వెనకడుగు వేయదు" అనిపేర్కొన్నారు.

## తెలంగాణలో బంద్ దిశగా హోటళ్లు

హైదరాబాద్(జనంసాక్షి):పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల యుద్ధ ప్రభావం, హర్మూజ్ సంధిలో చమురు నౌకల రాకపోకలపై చిక్కులు మన దేశంలోని హోటళ్ల పరిశ్రమపై పడింది. దీంతో వెంటనే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెట్రోలియం కంపెనీలు నియంత్రణ చర్యలకు పూనుకున్నాయి. హోటళ్లకు సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని ఆయా సంస్థలు తమ డీలర్లకు ఆదేశాలు జారీ చేశాయి. ఆస్పత్రులు, హాస్టళ్లకు మాత్రమే కమర్షియల్ సిలిండర్లు సరఫరా చేయాలని పెట్రోలియం యాజమాన్యాలు స్పష్టంగా పేర్కొన్నాయి.కమర్షియల్ గ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా హోటల్ పరిశ్రమ ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. ముంబై, బెంగళూరు, చెన్నై సహా పలు ప్రధాన నగరాల్లోని హోటళ్లకు ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు గ్యాస్ ఇబ్బందులను తెచ్చిపెట్టింది. గ్యాస్ కొరతతో ఇప్పటికే దేశవ్యాప్తంగా చిన్న చిన్న హోటళ్లు మూతబడుతున్నాయి. గ్యాస్ వినియోగదారులు తప్పకుండా ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించాయి. అలా చేసుకోని గృహ వినియోగదారులకు సైతం ఇక నుంచి గ్యాస్ బుకింగ్ నిలిచిపోనుంది. ఇటీవల గృహ వినియోగ సిలిండర్ బుకింగ్ వ్యవధిని 20 నుంతి 25 రోజులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే.గ్యాస్? కొరతపై స్పందించిన డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ : తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. మన రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎల్పీజీ కొరత వచ్చే అవకాశం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదురవకుండా మాత్రమే కేంద్రం అప్రమత్తమైందని తెలిపారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు సిలిండర్లను నిలుపుదల చేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి.డిస్ట్రిబ్యూటర్ల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ల సరఫరా దాదాపు ఆగిపోయింది. హాస్టళ్లకు, ఆస్పత్రులు లాంటి అత్యవసర విభాగాలకు ఎస్మా నుంచి మినహాయింపును ఇచ్చారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని విభాగాలకు పరిమితులు విధించారు. యుద్ధం కారణంగా సరిపడినంత గ్యాస్ సరఫరా లేకపోవడంపై ఉన్నత స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న గ్యాస్ ఏయే రంగాలకు సరఫరా చేయాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. విడుదల చేసింది. ఆ ప్రకటనలో .. 'పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే డిస్టిబ్యూటర్లు గ్యాస్ సిలిండర్ల సప్లైని పూర్తిగా ఆపేశారు. స్టాక్ లేదని అంటున్నారు. దీని ఫలితంగా చాలా హోటళ్లు బలవంతంగా మూసేయాల్సి వస్తోంది' అని పేర్కొంది. 'ది నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'.. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై స్పందించింది. ఈ మేరకు సోమవారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'రెస్టారెంట్ ఇండస్ట్రీకి కమర్షి యల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై ఎటువంటి నిషేధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, క్షేత్రస్థాయి లో పరిస్థితి భిన్నంగా ఉంది. సప్లయర్లు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు. ఇది రెస్టారెంట్ ఇండస్ట్రీపై, ఆహార సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది' అని రాసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కలుగజేసుకోవాలని కోరింది. ఒక్కో వాణిజ్య సిలిం డర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. అలాగే చమురు సంస్థలపై నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది

**ఇరాన్ యుద్ద ప్రభావంతో ధరల మోత**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు

# గుది'బండ'

సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది (ఈ౹సబిత్గి÷తిళి౹స ÷ఔసతిఇ౹బ ఎనిటతిజీ). అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30 లక్షల టన్నుల యూరియా, 25.13 లక్షల టన్నుల డీఏపీ, 55.87 లక్షల టన్నుల ఎన్‌పీకేఎస్ నిల్వలున్నాయని పేర్కొంది.

## ఎల్పీజీ ఉత్పత్తిని పెంచండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం శాఖ రంగంలోకి దిగింది. గ్యాస్ ఉత్పత్తిని తక్షణమే పెంచాలని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఇంధన కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కనీసం 10శాతం గ్యాస్ ఉ త్పత్తిని పెంచాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాల వల్ల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలను అధిగమించి, దేశీయ అవసరాలకు తగినంత స్టాక్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం సూచించింది. సామాన్య ప్రజలకు వంట గ్యాస్ ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఇరాన్ యుద్ధం భారత్‌లో చమురు ఆందోళనలు రేకెత్తిస్తోంది. దేశ ప్రజలకు ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చలు జరిపారు. ఎల్‌పీజీ ఉత్పత్తులు, సరఫరాపై సమీక్ష జరిపారు. ఇరాన్ యుద్ధం సామాన్యులపై ప్రభావం చూపకూడదని ప్రధాని మోదీ మంత్రులకు తెలిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు పరిశ్రమల నుంచి గ్యాస్‌ను మళ్లించడం ద్వారా ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇరవై ఒక్క రోజుల తర్వాత బుకింగ్‌లు జరిగేవి, ఇప్పుడు25 రోజులకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలానే ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత కలగకుండా కేంద్రం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దాదాపు రెండున్నర లేదా మూడు రోజుల్లో వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరిగేది, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సమయం పడుతుందని వర్గాలు తెలిపాయి. అన్ని శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. దేశంలో ఎల్పీజీ కొరత లేదని, సరఫరాను స్థిరీకరించామని కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా దేశంలో పలు హోటళ్లు, రెస్టారంట్లు మూతపడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని 10శాతం మేర పెంచాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరతను నిరోధించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఎల్పీజీ సరఫరా విషయంలో సమస్యలను అర్థం చేసుకునేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ రెస్టారంట్ అసోసియేషన్లతో మాట్లాడుతాయి. ఇందుకోసం ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఓ కమిటీ ఇప్పటికే ఏర్పాటైంది. హోటళ్లు, రెస్టారంట్ల అవసరాలకు తగ్గట్టుగా కమిటీ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే కొన్నిరోజుల వ్యవధిలోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 10 శాతం మేర పెరిగింది. ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ కన్‌సైన్‌మెంట్ వివిధ వనరుల నుంచి వస్తోంది. కొత్త కన్‌సైన్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం గతంలో సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొన్నాం కానీ.. ఇప్పుడు అలాంటివి ఏమీ లేవు. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణకు ముందువలే భారత రిఫనరీలు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయి. మన ముడిచమురు దిగుమతుల్లో 70 శాతం హర్మూజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర వనరుల నుంచి సమకూరుతున్నాయి. ఇక సంక్షోభం తర్వాత ఇతర దేశాల కంటే మనమే మెరుగ్గా మనం కోలుకుంటాం. అంతేగాకుండా శుద్ధిచేసిన చమురు ఎగుమతులను నియంత్రించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## రాహుల్‌ని మాట్లాడనివ్వడం లేదు

డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు' అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

**రేయింబవళ్లు నెహ్రూను విమర్శించేవారు నేడు ఆయనను ప్రశంసిస్తున్నారు**

కేంద్ర ప్రభుత్వం స్పీకర్ ఓం బిర్లాపై ఒత్తిడి తెచ్చి ఆయన స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగించిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. అందుకే ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ సభలో లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవని విమర్శించారు. అందువల్లే ప్రజల దృష్టిని మళ్లించడానికి కేంద్రం ప్రభుత్వం సభలో అసంబద్ధమైన అంశాలను లేవనెత్తుతోందని పేర్కొన్నారు.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ వేళ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఉదహరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూను రేయింబవళ్లు విమర్శించే వారు ఇప్పుడు ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తున్నారని ఎద్దేవా చేశారు.తాను నవ్వుతున్నానని రిజిజు చెబుతున్నారని, అందుకే రేయింబవళ్లు తనను విమర్శిస్తున్నారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. తమ వాదన కోసం రిజిజు నెహ్రూ వ్యాఖ్యలను ఉటంకించారని తాను తెలియజేస్తున్నానన్నారు. "వారు (రిజిజును ఉద్దేశించి) అకస్మాత్తుగా నెహ్రూను గౌరవించడం ప్రారంభించారు. నెహ్రూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం కోసం అలాంటి ప్రసంగం చేశారు " అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

# హోమ్ వర్క్ చేయలేదని లెక్చరర్ వీరంగం

- గదిలో బంధించి కేబుల్ వైర్ తో దాడి
- విద్యార్థులకు తీవ్ర గాయాలు





**హత్నూర, మార్చి 10 (జనం సాక్షి) :** విద్యార్థులు హోమ్ వర్క్ చేయలేదని ఓ లెక్చరర్ మృగంలా మారాడు.కట్టలు తెంచుకున్న ఆవేశంతో ఊగిపోతూ విద్యార్థులపై విరుచుకుపడ్డారు.కేబుల్ వైర్ తో ఇష్టం వచ్చినట్లు కొట్టి విద్యార్థుల రక్తం కళ్ళ చూశాడు.ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ గ్రామ శివారులో గల ఓ ప్రైవేట్ కళాశాలలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది.బాధిత విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థులు హోమ్ వర్క్ చేయలేదన్న కోపంతో గురువున్న విచక్షణ లేకుండా లెక్చరర్ కోపంతో నిప్పులు గక్కుతూ విద్యార్థులపై దాడికి దిగాడు.విద్యార్తులను గదిలో బంధించి కసాయిలా మారాడు. కేబుల్ వైర్ తో విద్యార్థుల చర్మం చిట్లిపోయేలా,గాయాలై రక్తం చిందేలా గొడ్డును బాదినట్టు బాది రాక్షసానందం పొందాడు. కొట్టొద్దని కాళ్ళా వేళ్ళా బతిమిలాడినా వినిపించుకోకుండా దాడికి పాల్పడ్డాడు. కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# ఆంధ్రభూమి రిటైర్డు ఉద్యోగుల ఔదార్యం

- రామకృష్ణమాచార్యుల సతీమణి పద్మప్రియకు రూ.80 వేలు అందజేత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీనియర్ జర్నలిస్టు దివంగత కందాళం రామకృష్ణమాచార్యుల సతీమణి పద్మప్రియకు ఆంధ్రభూమి రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ రూ.80 వేల రుపాయల చెక్‌ను అందజేసింది. హైదరాబాద్ నారపల్లిలో సోమవారం రామకృష్ణమా చార్యుల వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రభూమి దక్కన్ క్రానికల్ ఎంప్లాయిస్ అండ్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెల్జాల చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ వట్టి విజయప్రసాద్, జాయింట్ సెక్రటరీ మద్దూరి స్వామినాథ్, పూర్వ ఉద్యోగి కోవెల సంతోష్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై రిటైర్డు ఉద్యోగుల నుంచి సమీకరించిన మొత్తాన్ని పద్మప్రియకు అందజేశారు. రామకృష్ణమాచార్యుల సహ ఉద్యోగులుగా ఆయనపై అభిమానంతో తాము సమీకరించిన డబ్బులు మీ వైద్యఖర్చులకు ఉపయోగపడుతాయని చెప్పినప్పుడు ఆమె భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. రెండు చేతులు జోడించి తన పట్ల సానుభూతి కనబరిచిన ప్రతి ఒక్కరికీ తన తరఫున కృతజ్ఞతలు తెలియజేయాల్సిందిగా కోరారు. ఒక సత్ సంకల్పం కోసం స్పందించిన ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది.

# బీసీల ఉద్యమ గొంతుక.. బీసీ రచయితల సమాఖ్య

- రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీల ఉద్యమ గొంతుక.. బీసీ రచయితల సమాఖ్య అని రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం అన్నారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం, బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటంలో అవసరమైన భావజాల వ్యాప్తి కోసం బీసీ రచయితల సమాఖ్య ఏర్పాటయిందని, ఈ సాహిత్య సంస్థ ఆవిర్భావం 01-02-2026 జరిగి 04-02- 2026 నాడు పత్రికాముఖంగా ప్రకటించామని తెలిపారు. బీసీలకు ప్రభుత్వం ప్రకటించిన 42% రిజర్వేషన్ల సాధన, బీసీల రాజ్యాధికార సాధన, తరతరాలుగా బీసీలు భారతీయ సమాజానికి సాహిత్య, సాంస్కృతిక, కళా రంగంలో అందిస్తూ వస్తున్న ఘనమైన సేవలను ప్రపంచానికి చాటడం, బీసీ యోధుల చరిత్రను తవ్విపోయడం, బీసీ సాహిత్యానికి కొత్తచూపునిస్తూ.. సాహిత్యంలోని పలు ప్రక్రియలైన కథ, కవిత్వం, పాట, నవల, వ్యాసం, నాటకం.. మొదలైన అన్ని రంగాలలో బీసీల భావోద్వేగాలు ప్రకటితమై, అది బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటానికి ఉపయుక్తమయ్యేలాగా సాహిత్యాన్ని, కళలను సుసంపన్నం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఏ రాజకీయ విశ్వాసాలను కలిగి ఉన్నవారైనా, ఏ జెండాలకు జై కొట్టే వారైనా.. ఏయే రంగాల్లో పని చేస్తున్న వారైనా..వివక్షకు గురవుతున్న బీసీ జాతినంతా ఏకం చేయడమే కార్యాచరణ అని, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న వివిధ బిసి జేఏసీ లకు నిరంతరం మద్దతు తెలుపుతూ, వాటితో మమేకమవుతూ, బీసీ రాజ్యాధికారాన్ని సాధించడమే అంతిమ లక్ష్యంగా బీసీ రచయితల సమాఖ్య పోరాడుతుందని తెలిపారు. త్వరలోనే సమాఖ్య లక్ష్యాలను ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి ఒక మహాసభను నిర్వహిస్తామని, బిసి రచయితల సమాఖ్య రాష్ట్ర, వివిధ జిల్లాల అడహాక్ కమిటీలను ఇప్పుడు ప్రకటించామని తెలిపారు. ఆదిలాబాద్‌కు ఉదారి నారాయణ, హైదరాబాద్‌కు పిన్నంశెట్టి కిషన్, రంగారెడ్డికు డా. ఉప్పల పద్మ, హనుమకొండకు రాజేష్ ఖన్నా, జగిత్యాలకు బోగ అశోక్, జనగామకు కృష్ణ , జయశంకర్ భూపాలపల్లికు శ్రీధర్ గౌడ్, జోగులాంబ గద్వాలకు అవనిశ్రీ, జనగాంకు గుడికందుల కృష్ణ, కరీంనగర్‌కు శ్రీమంతుల సదాశ్రీ, ఖమ్మంకు చింతకాయల ఆంజనేయులు, కొత్తగూడెంకు రాగ రాజేశ్వరి, కొమరం భీం ఆసిఫాబాద్‌కు నల్లగొండ సురేష్, మహబూబాబాద్‌కు డా. తండా హరీష్, మహబూబ్ నగర్ డా. భీంపల్లి శ్రీకాంత్, మంచిర్యాలకు డా. గోపగాని రవీందర్, మెదక్‌కు తౌడబోయిన తిరుపతి, మేడ్చల్ మల్కాజిగిరికు కృష్ణగౌడ్, సంగారెడ్డికు ఏ.చంద్రమోహన్, ములుగుకు తాడిచెర్ల రవి, నాగర్కర్నూల్‌కు కమలేకర్ నాగేశ్వరరావు, నిజామాబాద్‌కు చుందూరు జగన్మోహన్, కామారెడ్డికు అల్లి మోహన్ రాజ్, నల్గొండకు డా.తండు కృష్ణ కౌండిన్య, నిర్మల్‌కు డా. కృష్ణంరాజు, పెద్దపల్లికు ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, రాజన్న- సిరిసిల్ల ఎలుగొండ రవి, సిద్దిపేటకు పెందోట వెంకటేశ్వర్లు, సూర్యాపేటకు వేముల వెంకటేశ్వర్లు, వరంగల్‌కు గొట్టెముక్కుల యోచన, నారాయణపేటకు కె వీరయ్య, వికారాబాద్‌కు జి.శ్రీనివాస్, యాదాద్రి-భువనగిరికు బాసరాజు యాదగిరిలను నియమించామని తెలిపారు.

# ఆకునూరు అభివృద్ధికి మంత్రి సీతక్క హామీ



**చేర్యాల (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామ అభివృద్ధి,గ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ప్రగతి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి కావలసిన పలు అభివృద్ధి పనులు సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,కమ్యూనిటీ హాల్స్, బీటీ రోడ్డు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. చేర్యాల మండలంలో మేజర్ గ్రామంగా ఎరుగాంచిన ఆకునూరుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో అన్ని గ్రామలకంటే ఆకునూరు గ్రామం వెనుకబాటుకు గురవుతోందని తక్షణమే స్పందించి అభివృద్ధి పనులు కేటాయించాలని కోరడంతో స్పందించిన మంత్రి, గ్రామ సమస్యల పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి పల్లవి - భాస్కర్, ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి బోయిని రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల రాజు గౌడ్ ఉన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందజేత

- 10వ విడత మొబైల్ ఫోన్ల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేసినబాధితులు
- సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : సైబరాబాద్ కమిషనర్



**హైదరాబాద్, మార్చి10 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం10వ విడత దొంగిలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు స్వయంగా అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించి, యజమానులకు అందజేసే క్రమంలో భాగంగా 10వ దశలో 1,016 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి యొక్క విలువ సుమారు 3,04,80,000 ఈ రికవరీ ప్రక్రియలో సీసీఎస్ శంషాబాద్ పోలీసులు 265, సీసీఎస్ శేరిలింగంపల్లి పరిధిలో 255, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పరిధిలో 181, సీసీఎస్ కూకట్‌పల్లి పరిధిలో 160 మరియు సీసీఎస్ రాజేంద్రనగర్ పరిధిలో 155 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫోన్లను సులభంగా ట్రాక్ చేస్తున్నామని, ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ నేడు ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధికి, వ్యక్తిగత అవసరాలకు కీలక సాధనంగా మారిందని, పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి యజమానులకు అప్పగించి వారిలో మళ్లీ ఆనందాన్ని నింపడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి పథకాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు తెలంగాణ వ్యాప్తంగా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఆపరేషన్ ద్వారా సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రీజ్ చేసిన బ్యాంక్ ఖాతాల నుండి బాధితులకు వారి సొమ్ము తిరిగి అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటి టీమ్ మరియు పోలీసు అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా క్రైమ్స్ డీసీపీ ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించడంతో పాటు బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. మొబైల్ ఫోన్లకు బలమైన పాస్‌వర్డ్ లు లేదా బయోమెట్రిక్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు తమ అనుభవాలను స్నేహితులు, బంధువులకు వివరించి వారిని కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు అత్యాధునిక సాంకేతికతతో ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారని, ప్రజలు అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు అవి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే యూపీఐ పేమెంట్స్ ద్వారా బ్యాంక్ ఖాతాల నుండి నగదు విత్‌డ్రా చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బాధితుల అకౌంట్ల భద్రత కోసం గతంలో ఫ్రీజ్ చేసిన ఖాతాలను పరిశీలించి, సైబర్ నేరాలతో సంబంధం లేని సాధారణ వ్యక్తులు కు సంబంధినీచి ఈ రోజు 103 బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేశామని ఆయన వెల్లడించారు. ఫోన్ పోయిన వెంటనే అప్రమత్తమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, తద్వారా ఆర్థిక నష్టాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని తిరిగి పొందిన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. అల్వాల్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌కు రెండు నెలల క్రితం తన పిల్లలతో వెళ్లిన ఓ మహిళ తన బ్యాగ్‌తో పాటు మొబైల్ ఫోన్ పోయిందని తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఫోన్‌కు కాల్ చేసినప్పుడల్లా స్విచ్ ఆఫ్ రావడంతో తిరిగి దొరుకుతుందో లేదో అని ఆందోళన చెందానని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను తిరిగి అందజేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.మరో బాధితుడు తన మొబైల్ ఫోన్ పోయి చాలా కాలం అయిపోయిందని, ఇక అది దొరకదని భావించానని తెలిపారు. అయితే పోలీసులు అకస్మాత్తుగా ఫోన్ చేసి తన ఫోన్ దొరికిందని చెప్పడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని చెప్పారు.

కరీంనగర్‌కు చెందిన మరో వ్యక్తి తన కూతురిని చూడటానికి నార్సింగ్ ప్రాంతానికి వచ్చినప్పుడు రోడ్డుపై నడుస్తుండగా జేబులో నుంచి మొబైల్ ఫోన్ పడిపోయిందని తెలిపారు. ఆ ఫోన్‌లో తన బ్యాంక్ ఖాతా వివరాలు మరియు ఇతర ముఖ్యమైన సమాచారం ఉండటంతో ఎవరైనా దుర్వినియోగం చేస్తారేమోనని భయపడ్డామని చెప్పారు. అయితే సైబరాబాద్ పోలీసులు కృషి చేసి తన ఫోన్‌ను తిరిగి అందజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. విశాఖపట్నానికి చెందిన వ్యక్తి లోన్ యాప్ మోసానికి గురయ్యానని తెలిపారు. చిన్న మొత్తంలో లోన్ తీసుకున్న తర్వాత తన వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని చెప్పారు. డబ్బులు చెల్లించకపోతే తన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టేస్తామని బెదిరించారని తెలిపారు. తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సమస్య నుంచి బయటపడగలిగానని, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమం లో క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, క్రైమ్స్ ఏసీపీ వై. నాగేశ్వర్ రావు, ఇన్‌స్పెక్టర్లు బి. భూపాల్ గౌడ్, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ కుకట్‌పల్లి, కె. రవి కుమార్, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ షంషాబాద్, పి. దాలి నాయుడు, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ కుత్బుల్లాపూర్, ఎ. రవి కుమార్, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ కుకట్‌పల్లి, పి. రాజేష్, ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ రాజేంద్రనగర్, ఐటి ఇన్స్పెక్టర్ నరసింహ తదితరలు పాల్గొన్నారు.

# 10ర యుద్ధ వ్యతిరేక, వాణిజ్య ఒప్పంద వ్యతిరేక దినంగా పాటించండి

- ప్రపంచం తిరిగి వలస రాజ్యంగా అవతరించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైతులు, ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధానికి వ్యతిరేకంగా, అలాగే స్వేచ్ఛా వాణిజ్యంపై ఇండో-యుఎస్ మధ్యంతర ఒప్పందానికి వ్యతిరేకంగా మార్చి 10, 2026న జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతాలలోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, వ్యాపారులు, విద్యార్థులు, యువత, మహిళలు ,వేదికలు, సంస్థలతో కలిసి ఉమ్మడి నిరసనల నిర్వహిస్తారు. అమెరికా,ఇజ్రాయెల్ ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం మొత్తం మధ్యప్రాచ్యాన్ని సాయుధ సంఘర్షణలోకి, మొత్తం ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిందని, సార్వభౌమ దేశమైన ఇరాన్ అధిపతి అయతుల్లా ఖమేనీ, అనేక మంది సీనియర్ నాయకులు, బాలికలు సహా వేలాది మంది అమాయక ప్రాణాలను లక్ష్యంగా చేసుకుని హత్య చేయడాన్ని, పాఠశాలలు, ఆసుపత్రులపై బాంబు దాడి చేయడాన్ని, 85 మంది సైనికులను బలిగొన్న హిందూ మహాసముద్రంలో ఇరానియన్ నౌక ఐరిస్ దేనాను టార్పెడో చేయడాన్ని కూడా ఖండించింది. ట్రంప్ పరిపాలన నేతృత్వంలో, ఈ యుద్ధానికి ముందు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఏడాది పొడవునా ఏకపక్ష వాణిజ్య సుంకాలు, దోపిడీ వాణిజ్య పరిస్థితులు విధించబడ్డాయి. ఈ సుంకాలు ఖూూ తన భారీ రుణ నిధులు, వాణిజ్యంలో లోటులను పరిష్కరించడానికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని పెట్రో-డాలర్ ఆధిపత్య ఆర్థిక నియంత్రణను కొనసాగించడానికి చేసిన ప్రయత్నంమని పేర్కొంది. నేడు అమెరికా ప్రపంచ శాంతికి, శ్రామిక ప్రజలకు అతిపెద్ద శత్రువు, గల్ఫ్‌లో ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, భారత ప్రజలకు కొత్త కష్టాలను తెస్తుంది. 5 కోట్లకు పైగా ఆధారపడిన 90 లక్షలకు పైగా భారతీయ పౌరులు, భారతదేశంలో కంటే మెరుగైన జీతంతో గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్నారు. వారి భద్రతా స్థలాలకు ముప్పు ఉంది. మన ముడి చమురు దిగుమతుల్లో 55% వారి భూభాగం నుండే వస్తున్నందున గల్ఫ్ దేశాలు భారతదేశానికి ముఖ్యమైనవి. గల్ఫ్ దేశాలు భారతదేశం నుండి 60 లక్షల టన్నులకు పైగా బాస్మతి బియ్యాన్ని, అలాగే గేదె మాంసం, సముద్ర ఉత్పత్తులు, చక్కెర మరియు తాజా కూరగాయలు , పండ్లను పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటాయి. ఈ ఎగుమతులు భారతదేశంలోని లక్షలాది మంది రైతులు, కార్మికులు మరియు మీాఫీజు లకు జీవనోపాధిని అందిస్తాయి. ఈ విధానపరమైన దాడుల పరంపరను మరియు యుద్ధాన్ని అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని తిరిగి వలసరాజ్యం చేసే ప్రక్రియలో భాగంగా ాఖవీ భావిస్తుంది. అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరస చేయాలని ాఖవీ అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్ ,పశ్య పద్మ, బి రాము, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, పెద్దారపు రమేష్,ఆర్ వెంకట్ రాములు, కాంతయ్య నాగిరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ రైతాంగానికి నీటి నష్టపరిహారం ఇవ్వాలి

- పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్
- కృష్ణానది నీటిలో తెలంగాణలో తొలిహక్కుదారులు ఇక్కడి ప్రజలు, రైతులు



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :** 'మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణా తీరంలోనే పెరిగింది. కానీ కృష్ణానది నీటికి నోచుకోలేదు. ఇక్కడ కురిసిన నీరు వందశాతం కృష్ణలో కలుస్తుంది. అంటే ఈ నేల వందశాతం కృష్ణా పరీవాహక ప్రదేశం. అయినా నిత్యం క్షామం వలసలు. అరకొర నీటిని మాట్లాడుతూ హక్కు నీటిని దోచుకునిపోతూ పాలకులే వంచనకు పాల్పడుతున్నారు' పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'జిల్లా ప్రజాప్రతినిధులు అధికార భజనపరులే కానీ జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని అడగలేకపోతున్నారు. ఈ కారణంగా రైతులు క్షామానికి బలవుతున్నారు. సాగునీటికి, కనీస అవసరాలకు, కలిగిన వారి ఆడంబరాల ప్రభావానికి అప్పుల పాలవుతున్నారు. గౌరవంగా బతికిన మనుషులు గనుక అప్పులు ఎగవేయలేక, మరో మార్గంలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా కాలువల నీటికోసం, కాలువల కింది సేద్యంవంటి సేద్యం కోసం జిల్లా రైతాంగం వివిధ రూపాల్లో చేస్తున్న పోరాటాలు కఠినదశకు, నిర్దయకు, స్పందనా రాహిత్యానికి మారుపేరైన పాలకులను కరిగించడం లేదు.

ఎన్నికల్లో గెలవటం కోసం, అధికారం కోసం సాగునీటి లిఫ్టు పథకాల హామీలు ఇస్తూ గెలిచి కాలక్షేపం చేస్తూ మరో ఎన్నికలవైపు సాగుతున్నారు. ఈ కారణంగానే 1980ల దశాబ్దం హామీలతో, 1990ల దశాబ్దం శంకుస్థాప డ్రామాలతో 2000ల దశాబ్దం పనుల ప్రారంభంతో గడిచిపోయి 2025 ముగిసినా ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి కాలేదు. 1950 దశకంలో పనులు పూర్తయిన ఆర్‌డీఎస్ నీరు కూడా రాకుండాపోయింది. ఈవారం నీటిపారుదల మంత్రి జిల్లా ప్రాజెక్టుల విషయంలో జరిపిన సమీక్షా సమావేశం మరోసారి తేలిపోయింది. సరికొత్త గడువులు ప్రకటించారు. సమీక్షల్లో చిత్తశుద్ధి లేదు. ఈ పరిస్థితిలో రైతాంగానికి జరుగుతున్న అన్యాయ నివారణ కోసం నీటి నష్టపరిహారం డిమాండ్ చేస్తున్నాం.

కృష్ణానది నీటిలో తెలంగాణలో తొలిహక్కుదారులు మహబూబ్‌నగర్ ప్రజలు, రైతులు. ఇంతకాలం రైతుల కడుపు కొడుతూ నీటిని దిగువకు తరలించారు. లిఫ్టుచేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదు కనుక ఇలా జరిగిందన్నారు. లిఫ్టుల జ్ఞానం అందిన తర్వాత దశాబ్దాల కాలం వృథా చేస్తున్నారు. అందువల్ల వెంటనే నికర జలాలు భీమా 1, 2, కోయిల్‌సాగర్ లిఫ్టుల కింద సాగు కావాల్సిన మూడున్నర లక్షల ఎకరాల భూములకు, వరద జలాల కల్వకుర్తి, నెట్టెంపాడు లిఫ్టుల కింద ఆరున్నర లక్షల ఎకరాల భూములకు, ఆర్డీఎస్ కింద లక్ష ఎకరాలకు, గట్టు లిఫ్టు కింద 50వేల ఎకరాలకు, పాలమూరు - రంగారెడ్డి లిఫ్టు కింద 12 లక్షల ముప్పై వేల ఎకరాలకు కాలువ కింది పంటతో పోల్చి వెంటనే నీటి నష్టపరిహారం చెల్లించాలి' అని రాఘవచారి డిమాండ్ చేశారు.

# విశ్వ విజేత భారత్‌కు అభినందనలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మూడో సారి టీ20 ప్రపంచకప్ గెలిచి విశ్వ విజేతగా నిలచిన భారత క్రికెట్ జట్టుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందనలు తెలియజేవారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను నిలబెడుతూ సూర్య కుమార్ యాదవ్ సేన సాధించిన విజయం చరిత్రలో నిలచిపోతుందని, ఈ విజయం ప్రపంచ వేదికపై భారత్ ఖ్యాతిని మరింతగా పెంచిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీం ఇండియా గెలుపు.. యావత్ భారతావనికి ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ప్రపంచకప్ సాధించి పెట్టిన భారత క్రికెటర్లకు పేరుపేరునా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ క్రికెట్‌లో భారత్ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# సీఎం ప్రజావాణిలో 345 దరఖాస్తులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 345 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 127, రెవెన్యూ శాఖకు సంబంధించి 50, ఇందిరమ్మ ఇండ్ల కోసం 90, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పక్కాగా రైతుల భూ హక్కుల నమోదు

### భూభారతి రీ సర్వేపై అదనపు కలెక్టర్

**మెదక్, మార్చి10 (జనంసాక్షి) :** రైతుల భూ హక్కులను పక్కాగా నమోదు చేసి భూ వివాదాలకు ముగింపు పలికే లక్ష్యంతో భూ రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
11 మార్చి 2026

# కోరలు చాస్తున్న సామ్రాజ్యవాదం



2026 ఫిబ్రవరి 14న మ్యూనిచ్ భద్రతా సదస్సులో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన ప్రసంగం కేవలం తన సొంత వ్యక్తి గత ఉపన్యాసం మాత్రమే కాదు, అది ఈ ప్రపంచానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున చేసిన ఒక స్పష్టమైన హెచ్చరిక ప్రకటన కూడా. ఈ ప్రపంచ వ్యవస్థను సంపూర్ణంగా మార్చేస్తామన్న స్పష్టమైన నిర్ణయ ప్రకటనకు సంకేతం. కోల్డ్ వార్ ముగిసి మూడున్నర దశాబ్దాలు దాటినా, మళ్లీ ఆ భావజాలపు పొగమంచు చెదరి, సామ్రాజ్యవాదపు ముఖం నిక్కచ్చిగా కనిపిస్తోంది. రూబియో ప్రసంగం, దాని చుట్టూ జరుగుతున్న ప్రపంచ పరిణామాలు మనల్ని కొన్ని ప్రాథమిక ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరాన్ని సృష్టిస్తున్నాయి.

**చారిత్రక సందర్భం: గోడ నుండి గుత్తాధిపత్యం వరకు:**
రూబియో తన ప్రసంగాన్ని 1963 నాటి మ్యూనిచ్ సదస్సు, బెర్లిన్ గోడ, క్యూబా క్షిపణి సంక్షోభంతో మొదలుపెట్టారు. ఆయన దృష్టిలో, సోవియట్ యూనియన్ పతనం ఒక 'మహా విషాదం' మాత్రమే కాదు. పశ్చిమ దేశాల ఉమ్మడి'విజయం' కూడా. కానీ, ఈ విజయోత్సాహంలో ఆయన మరో చారిత్రక సత్యాన్ని చెప్పటం బహుశా మర్చిపోయారు. రెండో ప్రపంచ యుద్ధానంతరమే ప్రపంచంలోని అనేక దేశాలు వలస పాలన నుండి విముక్తి పొందాయి. భారతదేశంతో సహా డజన్ల కొద్దీ దేశాలకు స్వాతంత్ర్యం వచ్చింది. అంటే, పశ్చిమ దేశాల 'కుంచించుకుపోవడం' అనేది వారి బలహీనత వలన కాదు, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఐక్య పోరాటాల వల్ల జరిగిన చారిత్రక అనివార్య పరిస్థితి. ఇప్పుడు రూబియో మాట్లాడుతున్నది మళ్లీ ఆ 'కుంచించుకుపోయిన' పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని పునఃస్థాపించాలనే ఆకాంక్షను తిరిగతోడాలి అనేదే అమెరికా అలాగే ఈనాటి నాటో యూరప్ దేశాల లక్ష్యం కూడా.

**ఆధునిక సామ్రాజ్యవాద ముఖచిత్రం:**
రూబియో ప్రసంగం కేవలం మాటలతో ఆగలేదు. ఆ మాటల నేపథ్యంలో అమెరికా చేస్తున్న దురాగతాలు సజీవ సాక్ష్యాలుగా నేటి ప్రపంచంలో అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, సైన్యిక వ్యూహాలుగా నిలుస్తున్నాయి. అందుకు ఇటీవల వేగంగా జరుగుతున్న పరిణామాలే సాక్ష్యం.

**ప్రత్యక్ష దాడులు, కిడ్నాపింగ్‌లు:**
వెనిజులా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అమెరికాకు తరలించడం, ఇరాన్‌పై దాడి చేసి అయతుల్లా ఖమేనీతో సహా పలువురిని హతమార్చడం- ఇవి అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి సూత్రాలకు తీవ్రమైన సవాళ్లుగా నిలిచాయి. ఇవి ఇప్పుడు రూబియో మాట్లాడిన 'కొత్త ప్రపంచ క్రమానికి' ఉదాహరణలుగా ఈ పరిణామాలను చూడాలి.

**ప్రాదేశిక ప్రాంతాల ఆక్రమణ వాంఛ:**
పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్, కెనడాలను తిరిగి యధాతథంగా కబళించాలన్న ట్రంప్ వ్యాఖ్యలు ఇప్పుడు రూబియో మాటలకు పునాదిని వేశాయి. ఇది 19వ శతాబ్దపు సామ్రాజ్యవాదం 21వ శతాబ్దంలో తిరిగి రావడానికి చేస్తున్న ప్రయత్నమే తప్ప వేరే కాదు.

**భావజాల సిద్ధాంతాల సంఘర్షణ:**
రూబియో ప్రసంగంలోని మరో కీలక అంశం- పాశ్చాత్య నాగరికత, క్రైస్తవ విశ్వాసం, ఉమ్మడి సంస్కృతి, ప్రజాస్వామ్య వ్యవస్థల గురించి చేసిన ప్రస్తావన. ఇది కేవలం సాంస్కృతిక గర్వం కాదు. ఇది ప్రపంచాన్ని 'మేము' (పాశ్చాత్యం) మరియు మిగతావారు గా విభజించి, ఒక కొత్త భావజాలపు యుద్ధానికి రంగాన్ని సిద్ధం చేయడమే.

**యూరప్‌కు సందేశం -అమెరికాతో కలిసి ఉమ్మడి భాగస్వామ్యంతో చేసే ప్రయత్నం :**
"ఐరోపా బలంగా ఉండాలి. మన విధి మీతో ముడిపడి ఉంది" అని రూబియో అన్నారు, అందులో ఎంత నిజం ఉంది? అమెరికా కోరుకుంటున్నది సమాన భాగస్వామ్యమా? లేక తన ఆధిపత్యానికి యూరప్‌ను ఒక సాధనంగా మార్చుకోవడమా? ఉక్రెయిన్ యుద్ధంలో యూరప్‌ను ముందు నిలిపి, అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలను (ఎక్కువ ధరకు ఎల్ఎన్‌జీ అమ్మకం, ఆయుధాల విక్రయం) చక్కదిద్దుకుంది. ఇప్పుడు మళ్లీ అదే దారిలో యూరప్‌ను నడిపించే ప్రయత్నమే ఈ ప్రసంగం యొక్క ప్రధాన లక్ష్యం.

**చైనా అలాగే గ్లోబల్ సౌత్‌కు - ప్రపంచ దేశాలకు హెచ్చరిక:**
రూబియో పరోక్షంగా చైనాను టార్గెట్ చేసినా, ఈ ప్రసంగం యొక్క ప్రభావం ప్రతి దేశంపై పడుతుంది. ఐక్యరాజ్యసమితి అనేది 'ఓ చేతగాని ఆశయాల సంస్థ' అని ఆరోపిస్తూ, దాని స్థానంలో పశ్చిమ దేశాలే ప్రపంచానికి పోలీసులుగా వ్యవహరించాలి అన్నదే ఈ ప్రసంగం యొక్క సారాంశం. ఇది బ్రిక్స్, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ వంటి బహుళ ధ్రువ ప్రపంచాన్ని నమ్మే దేశాలకు ఓ పెద్ద హెచ్చరికల సవాలును విసిరింది. అమెరికా-యూరప్ కలిసి ఈ ప్రపంచాన్ని ఏకం పక్షంగా పాలించాలనుకోవడం, మిగతా దేశాలు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోయే ప్రమాదాన్ని సృష్టిస్తోంది.

**చారిత్రక పరిణామాలకు సాక్షిగా ఉండటంతో పాటు భవిష్యత్తు నిర్మాత వరకు : భారత్ పాత్ర**
భారతదేశానికి ఇది కేవలం ఒక విదేశీ వార్త కాదు. 1947లో బ్రిటిష్ సామ్రాజ్యపు పట్టు నుండి విముక్తి పొందిన దేశంగా, సామ్రాజ్యవాదం యొక్క నిజ స్వరూపం ఏమిటో మనకు అనుభవాల సాక్షిగా బాగా తెలుసు. శ్రీనగర్‌లో ఇరాన్ పై దాడిని నిరసిస్తూ ప్రజలు వీధుల్లోకి రావడం ఈ చారిత్రక స్పృహకు నిదర్శనం. కానీ అమెరికా విధానాలను సమర్థించే కొన్ని బీజేపీ, ఆరెస్సెస్ స్వరాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు భారత్‌లో లోతైన చర్చకు దారితీయాలి.
మన విదేశాంగ విధానం 2014 వరకు చారిత్రకంగా 'స్వయంప్రతిపత్తి'పై ఆధారపడి ఉంది. కానీ నేడు బీజేపీ/ ఆరెస్సెస్ ప్రభుత్వం అమెరికా చేతిలో పావుగా మారినట్లు కనిపిస్తోంది. అయితే ఈ బహిరంగ సామ్రాజ్యవాద ప్రయత్నం మన దేశ ఆర్థిక, రాజకీయ స్వయంప్రతిపత్తికి ఓ సవాల్ విసురుతోంది. మనం ఏటు వైపు నిలబడతాము? ఒక ధ్రువం చేసే ఆధిపత్యం చేసే నియంతృత్వ ప్రపంచంతోనా? లేక అన్ని దేశాలకు సమాన గౌరవం, సార్వభౌమాధికారం ఉండే బహుళ ధ్రువ ప్రపంచంతోనా? ఈ ప్రశ్నకు సమాధానమే భారత్ యొక్క భవిష్యత్తు దిశను నిర్ణయిస్తుంది.
మార్కో రూబియో మ్యూనిచ్‌లో చేసిన ప్రసంగం ఒక చారిత్రక హెచ్చరిక. ఇది అమెరికా, పశ్చిమ దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేస్తున్న చివరి ప్రయత్నం కావచ్చు. ప్రపంచం ఇప్పుడు ఒక కీలకమైన దశలో ఉంది. గత శతాబ్దపు సామ్రాజ్యవాదం మళ్లీ కోరలు చాస్తోంది. దీన్ని ఎదుర్కోవడానికి ఐక్యరాజ్యసమితి వంటి బహుళపక్ష వేదికలను బలోపేతం చేసుకోవడం, గ్లోబల్ సౌత్ దేశాలు ఒక్కటి కావడం, మరియు అన్నింటికంటే ముఖ్యంగా- ప్రజలు మేల్కొని ఉండడం అత్యవసరం. చరిత్ర పునరావృతం కాకూడదంటే, దాని పాఠాలను మరచిపోకూడదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ఇంటి వెలుగు... ఆమె!

తూర్పున...
సూర్యుడు మేల్కొనక ముందే...
తానొక నిత్య చైతన్యమై,
నిరంతర శ్రామికురాలై,
నిశ్శబ్దంగా నిద్రలేచే...
ప్రాతఃకాల కిరణం ఆమె!
అమ్మగా...
అనురాగపు అమృతాన్ని పంచుతూ,
భార్యగా...
బాధ్యతల భారాలను మోస్తూ,
ఇల్లాలిగా...
ఈ ఇంటిని నందనవనంగా మలుస్తూ,
అలుపెరుగని ప్రయాణంలో...
అక్షయ పాత్ర... ఆమె!
నాలుగు గోడల మధ్యే...
ఆమె లోకం అనుకోకండి;
ఆ నాలుగు గోడలకే ప్రాణం పోసే...
ప్రేమ సామ్రాజ్య అధినేత్రి ఆమె!
వంటింటి సామ్రాజ్యానికి...
ఆమె కేవలం అన్నపూర్ణ మాత్రమే కాదు;
కుటుంబ సంతోషంలో తనను తాను
వెతుక్కునే...
నిరంతర త్యాగమూర్తి... ఆమె!
చిన్న చిన్న కోరికలను
చిరునవ్వుతో దాచుకొని...
పెద్ద బాధ్యతలను
భుజాన వేసుకొని...
కష్టాల చీకటిలో
ధైర్యపు దివ్వెయై నిలిచే...
నిలువెత్తు విశ్వాసం... ఆమె!
డిగ్రీలు ఉండవచ్చు... ఉండకపోవచ్చు,
కానీ సంస్కారంలో మేటి ఆమె!
సంపాదన ఉండొచ్చు...
ఉండకపోవచ్చు,
కానీ సేవలో సాటిలేనిది... ఆమె!
ఇల్లు ఒక దేవాలయమైతే...
ఆ దేవాలయాన్ని వెలిగించే...
మంగళ జ్యోతి... ఈ గృహిణి!
అందుకే...
మన ఇంటి వెలుగు... ఆమె!

నసుబోలు రాజశేఖర్,
తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా,

## పాలు ప్రాణావసరమా? అలవాటేనా?



పాలు మన జీవితంలో పవిత్రమైన ఆహారంగా, బలానికి మూలంగా భావించబడుతున్నాయి. చిన్నప్పటి నుంచి అమ్మ పాలతో పెరిగి, పెద్దయ్యాక కూడా రోజువారీ ఆహారంలో పాలు భాగమైపోయాయి. "పాలు తాగితే బలం వస్తుంది, ఎముకలు గట్టిపడతాయి, బుద్ధి పెరుగుతుంది" అని మన పెద్దలు చెప్పిన మాటలు మన మెదడులో నాటుకుపోయాయి. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు, పోషకాహార నిపుణులు ఈ నమ్మకాలను ప్రశ్నిస్తున్నారు. పాలు నిజంగా ప్రాణావసరమా? లేక సాంస్కృతిక అలవాటు, వ్యాపార ప్రచారాల ప్రభావమా? ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), FSSAI పరిశోధనలు, హార్వర్డ్ అధ్యయనాలు ఈ ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నాయి. పాలు ఒక మంచి ఆహార ఎంపిక అయినా, అది ఏకైక మార్గం కాదు. వైవిధ్యమైన ఆహారం మన ఆరోగ్యానికి నిజమైన బలం.
పాలు మన శరీరానికి కొంత మేలు చేస్తాయని నిజం. కానీ పాలు లేకుండా కూడా ఆరోగ్యంగా జీవించవచ్చు. పాలలో కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు ఉన్నాయన్నది సరైనదే. అయితే ఈ పోషకాలు కేవలం పాల ద్వారానే లభిస్తాయని అనుకోవడం పూర్తిగా తప్పు. రాగి జావ, నువ్వులు, ఆకుకూరలు, శెనగలు, రాజ్మా, పప్పుధాన్యాలు, సోయా వంటి ఆహారాల్లో పాల కంటే ఎక్కువ పోషకాలు ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది మంది (ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో) పాలు తాగకుండానే ఆరోగ్యంగా జీవిస్తున్నారు. "పాలు తాగితేనే బుద్ధి పెరుగుతుంది, ఎముకలు గట్టిపడతాయి" అన్న మాటల వెనుక శాస్త్రీయత కంటే సామాజిక అలవాట్లు, డైరీ ఇండస్ట్రీ ప్రచారాల ప్రభావమే ఎక్కువ. పాలు తాగకుండానే మనకు కావలసిన పోషకాలను ఇతర ఆహారాల నుండి పొందవచ్చు. ఉదాహరణకు, కాల్షియం పాల కంటే రాగి, ఆకుకూరల్లో ఎక్కువ; ప్రోటీన్ పప్పుధాన్యాలు, శెనగల్లో అది అధికం.
ప్రపంచంలో 65-70% మందికి పాలు జీర్ణం కావడం కష్టం. దీన్ని 'లాక్టోస్ ఇంటాలరెన్స్' అంటారు- ఇది జన్యుపరమైన లక్షణం, బలహీనత కాదు. పాలు తాగిన తర్వాత కడుపు నొప్పి, గ్యాస్, వికారం వస్తే అది శరీరం సహజ సంకేతం. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ సమస్య 90% వరకు ఉంది. పాలు అరగకపోవడం మన జన్యువులలోని వైవిధ్యం-అది ఆందోళనకరం కాదు. మన శరీరానికి ఏది పడుతుందో గుర్తించి, ఆహార అలవాట్లను మార్చుకోవడమే ముఖ్యం. పాలు అరగకపోవడం గురించి భయపడాల్సిన అవసరం లేదు; అది మన శరీరతత్వంలోని సహజ భాగం.
పాలు స్వచ్ఛంగా ఉన్నాయా అనేది పెద్ద ప్రశ్న. భారత ఆహార భద్రతా ప్రాధికార సంస్థ సర్వేల్లో వేల సంఖ్యలో నమూనాల్లో కల్తీ బయటపడింది. సుమారు 5.7% నమూనాల్లో 'అఫ్లాటాక్సిన్ ఎం1' (క్యాన్సర్ కారకం), అధిక మోతాదు యాంటీబయాటిక్స్ కనుగొన్నారు. ఇవి తక్షణ ప్రభావం చూపకపోయినా, దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. పాల దిగుబడి పెంచడానికి పశువులకు ఇచ్చే 'ఆక్సిటోసిన్' ఇంజెక్షన్లు పశువుల ఆయుర్దాయాన్ని తగ్గిస్తాయి. ప్రభుత్వం ఈ హార్మోన్‌ను నిషేధించింది కానీ మార్కెట్‌లో ఇప్పటికీ దొరుకుతున్నాయి. ఈ హార్మోన్ మన జీర్ణవ్యవస్థలో విచ్ఛిన్నమైపోతుందని, రక్తంలోకి చేరదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ కల్తీ సమస్య తీవ్రంగానే ఉంది.
ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) హెచ్చరికలు ఆందోళనకరం. ప్రతి సంవత్సరం 60 కోట్ల మంది కలుషిత ఆహారం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్నారు; 4.2 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జీర్ణక్రియ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటివి దీర్ఘకాల ప్రభావం చూపుతాయి. సోషల్ మీడియాలో "పాలు వల్ల 87% క్యాన్సర్" అన్న తప్పుడు వార్తలు వ్యాప్తి చెందుతున్నాయి-ఔనూ ఇలాంటివి ప్రకటించలేదు. ప్రభుత్వం, ఆరోగ్య సంస్థలు ఇచ్చే శాస్త్రీయ సమాచారాన్ని మాత్రమే నమ్మాలి. హార్వర్డ్ అధ్యయనాలు పాలు ఎక్కువ తాగే దేశాల్లో ఎముకల విరగడం సమస్య ఎక్కువగా ఉందని చెబుతున్నాయి. ఎముకల బలానికి కాల్షియం మాత్రమే కాదు-విటమిన్ డి, విటమిన్ కె, శారీరక వ్యాయామం, సూర్యరశ్మి కూడా అవసరం. పాలు ఒక్కటే సరిపోదు. భారతీయ భోజనంలో పెరుగు ప్రాముఖ్యత వేరు-ఘాటి కూరల తర్వాత ముద్ద పెరుగు కడుపును చల్లబరుస్తుంది. కానీ పాలు కల్తీ అయితే పెరుగు, పన్నీరు, నెయ్యి కూడా కల్తీ అవుతాయి. పాలు సురక్షితం కానప్పుడు వాటి ఉత్పత్తులు కూడా సురక్షితం కావు. పాలు పడని వారు ఇతర సహజ ప్రత్యామ్నాయాలు (చల్లని ఆహారాలు) ఎంచుకోవచ్చు. పాలు పూర్తిగా మానివేయాలని అర్థం కాదు. కానీ "పాలు లేకపోతే ఆరోగ్యం లేదు" అన్న అతిశయోక్తిని పక్కనపెట్టి, వాటిపై అతిగా ఆధారపడకూడదు. రోజువారీ భోజనంలో రకరకాల పండ్లు, కూరగాయ లు, తృణధాన్యాలకు చోటిస్తూ క్రమంగా పాలు తగ్గించుకోవాలి. ప్రభుత్వం తాజా హెచ్చరికలు, శాస్త్రీయ పరిశోధనలు ఇదే చెబుతున్నాయి. పాలు తాగాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం-కానీ ఆ నిర్ణయం తీసుకునే ముందు అది మీ శరీరానికి సరిపడుతుందా? మీరు తాగుతున్న పాలు స్వచ్ఛమైన వేనా? అని ఆలోచించి అడుగువేయండి. విజ్ఞతతో కూడిన ఆహార అలవాట్లే మన ఆరోగ్యానికి ముఖ్యమైనవి.

రచన: డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

## వెలుగుమట్లలో వినిపిస్తున్న
# మా భూమి గర్జన



భారతదేశ చరిత్ర, సంస్కృతి భూమితోనే ముడిపడి ఉంది. ఈ నేలపై జరిగిన ఎన్నో యుద్ధాలు, ఉద్యమాలు భూమి కోసం జరిగినవే. ప్రాచీన ఇతిహాసమైన మహాభారతంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన మహాయుద్ధం భూమి కోసమే జరిగింది. అలాగే తెలంగాణ చరిత్రలో ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారక్కల యుద్ధం కూడా భూమి, స్వాభిమానం, జీవనాధారం కోసం జరిగిన పోరాటమే. ఈ క్రమంలో తెలంగాణలో అణగారిన వర్గాలకు దేశంలో భూమి, సంపద, రాజ్యం కోసం ఒక బహుజన నాయకుడు బయలుదేరాడు. అతడే బీసీ ఎస్సీ ఎస్టీల విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్. ఈ దేశ ప్రజలు భూమినీ స్వీయ అస్తిత్వానికి, ఆత్మగౌరానికి, ఆర్థిక భద్రతకు ప్రతీకగా చూస్తారు.
తెలంగాణ ప్రాంతం భారతదేశ చరిత్రలో భూమి-బుక్తి-విముక్తి పోరాటాలకు కేంద్రబిందువుగా నిలిచింది. ఒకవైపు భూమీ కోసం పోరాటం, భూదాన ఉద్యమం ఇక్కడినుంచే జరిగింది. ఆ భూదాన్ ఉద్యమం ఫలితంగా అక్కడక్కడ కొంత మంది పేదలకు భూములిచ్చారు. కానీ పేదల కోసం ఇవ్వబడిన ఆ భూదాన్ భూములు నేడు మళ్లీ ఆక్రమణలకు గురవుతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో, వెలుగుమట్ల ప్రాంతంలో జరిగిన సంఘటనలు ఇందుకు నిదర్శనం. పేదలకు ఇచ్చిన భూదాన్ భూములను కొంతమంది ఆధిపత్య వర్గాలు ఆక్రమించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఆ భూములపై పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం వల్ల తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెలుగుమట్ల గ్రామంలో 62 ఎకరాల భూమి భూదాన్ బోర్డు పరిధిలోని భూమి. ఇందులో ప్రస్తుతం ఉన్న 31 ఎకరాల్లో పేదలు ఇల్లు కట్టుకున్నారు. అక్రమ కట్టడాల పేరుతో దాదాపు వెయ్యి ఇళ్లు నేలమట్టం చేశారు. 1950 లో ఏర్పడ్డ భూదాన్ బోర్డ్ పరిధిలోని భూములకు చట్టప్రకారం ప్రభుత్వం యజమాని కాదు. ఇదీ పేదలకే చెందాలి. ప్రభుత్వ చర్య వలన నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో వాతావరణం రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలు ఒక్కసారిగా నిరాశ్రయులుగా మారారు.

**భూమి పంపిణీలో తీవ్ర అసమానతలు.**
ఎవరికైనా భూమి ఉంటే వారు స్వతంత్రంగా జీవించగలరు. అందుకే ఈ దేశంలో భూ పంపిణీ సామాజిక న్యాయంతో ముడిపడి ఉంటుంది. కానీ ఇప్పటికీ ఈ దేశంలో భూమి సమానంగా పంపిణీ జరగలేదు. కొంతమంది ఆధిపత్య వర్గాలు తరతరాలుగా భూమిని సంపాదించగా, మరికొన్ని వర్గాలు భూమి లేని కూలీలుగా మిగిలిపోయాయి. నేటికీ దేశంలో అత్యధిక బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు చిన్న రైతులుగా, కౌలు రైతులుగా, రైతు కూలీలుగా జీవిస్తున్నారు. భారతదేశంలో, తెలంగాణలో భూమి పంపిణీ తీవ్ర అసమానంగా ఉంది. తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 2025 శాతంలేని ఓసీలకు సుమారు 35 నుంచి 40శాతం భూమినీ కలిగి ఉన్నారు. గిరిజనులకు మినహా బీసీ, ఎస్సీలకు తమ జనాభా స్థాయిలో భూమి లేకపోవడం గమనార్హం. భూమి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైనదని స్పష్టమవుతుంది. ఇప్పటికీ మెజార్టీ అట్టడుగు ప్రజలు భూమిలే నిరుపేదలుగా, వ్యవసాయ కూలీలుగా, వలస కార్మికులుగా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. దళిత కుటుంబాలలో సగానికి పైగా కుటుంబాలకు స్వంత భూమి లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. నాటి భూదాన్ ఉద్యమం నుంచి గత ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ వల్ల జరిగిన లబ్ధి అంతంత మాత్రమే. చారిత్రకంగా భూమి కోసం ఎన్నో పోరాటాలు జరిగిన తెలంగాణ నేలపై వెలుగుమట్ల భూదాన్ భూమి సమస్యపై సమాజంలోని ఆందోళన మొదలైనది. పేదల హక్కుల కోసం పోరాడామని చెప్పుకునే కమ్యూనిస్టు నాయకులు కూడా ఈ విషయంలో బహిరంగంగా స్పందించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిస్థితుల్లో పేదల పక్షాన గళమెత్తిన వ్యక్తి డాక్టర్ విశారదన్ మహారాజ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంయుక్తంగా వెలుగుమట్ల భూదాన భూములపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారు నిరవధిక దీక్ష చేపట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.
భూదాన్ ఉద్యమం బూటకమా?
78 వసంతాల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికి పేదల భూమి దున్నడం మాత్రమే తప్పా, ఆ భూమి యజమాన్యం మాత్రం వారి చేతుల్లో లేదనీ రుజువవుతుంది. అసలు భూదాన్ - నిజమా? బూటకమా? ఒకప్పుడు భూదాన్ పేరుతో భూములు పేదలకు ఇస్తామని చెప్పారు. మరి ఇప్పుడు వెలుగుమట్లలో పేదలకు ఇచ్చిన భూములు నిజంగా వారి చేతుల్లో ఉన్నాయా? లేదా కాగితాల మీద మాత్రమే ఇచ్చారా? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇప్పటికి రాష్ట్రంలో దళిత, గిరిజనులకు ఇచ్చిన అసైన్ భూముల విషయంలో పలు వివాదాలు నెలకొన్నాయి. అ భూములను ఆధిపత్య వర్గాలు ఆక్రమించుకోవడం, వాటి కోసం అణగారిన వర్గాల పోరాటం ఒక సామాజిక ఘర్షణకు దారితీస్తుంది. ఆనాడు గాంధీ భూమి విషయంలో అత్యధికంగా భూమీ ఉన్న వాళ్ళ నుంచి భూమిలేని నిరుపేదలకు దానంగా ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో గాంధీ అనుచరుడు ఆచార్య వినోబాభావే ఈ భూదానోద్యమానికి శ్రీకారం చుట్టాడు. కానీ ఇది విజయవంతం కాలేకపోయింది. అంబేద్కర్ మాత్రం రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా నిరుపేదలకు భూమిని పంచాలన్నాడు. అనంతరం భూ గరిష్ట పరిమితి చట్టాలు చేసినప్పటికీ, అట్టడుగు వర్గాలకు భూమి చెందలేదు. అంతేకాక ఇప్పటికీ వారికి జనాభా ప్రకారం సంపద, రాజ్యంలో వాటా లేదు. ఈ క్రమంలో దేశంలో సమస్త భూమి, సంపద, రాజకీయాల్లో బీసీ ఎస్సీ ఎస్టీల వాటా కోసం "మా భూమి" పేరుతో డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల రథయాత్రకు పిలుపునిచ్చాడు. ఇదీ దేశ స్వాతంత్రం ఉద్యమం, తెలంగాణ ఉద్యమం తర్వాత జరుగుతున్న మహత్తర బహుజన పోరాటం. ఈ పోరాటం ఇప్పుడు వెలుగుమట్ల భూదాన్ బాధితుల పక్షాన న్యాయం కోసం నిలబడింది. వారికి అండగా డాక్టర్ విశారదన్ మహారాజ్, కల్వకుంట్ల కవిత నిలబడ్డారు. కావున పౌర సమాజం, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వారికి మద్దతుగా నిలవాలి. నిజంగా పేదలకు భూములు చెందాలంటే ప్రభుత్వమే చట్టపరంగా పట్టాలివ్వాలి. ఇది ప్రభుత్వాల నైతిక బాధ్యత కూడా. లేదంటే ఈ భూగర్జనలు, భూ పోరాటాలు ఆగవు.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# విజయీభవ



**(పదవ తరగతి పరీక్షల సందర్భంగా)**

జీవితం అనే ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు ఉంటాయి. అందులో పదవ తరగతి (టెూజ) అనేది అత్యంత కీలకమైన మలుపు. ఇది కేవలం ఒక పరీక్ష కాదు, మీ కలల సౌధానికి పునాది. ఇది కేవలం మార్కుల పట్టిక కాదు, మీ భవిష్యత్తుకు పునాది. పరీక్షలంటే భయం వద్దు, అది మీ ప్రతిభను నిరూపించుకోవడానికి దొరికిన ఒక అద్భుతమైన అవకాశం. సరైన ప్రణాళిక, పట్టుదల ఉంటే ఆకాశమే హద్దుగా రాణించవచ్చు. చాలా మంది విద్యార్థులు ఈ సమయంలో ఒత్తిడికి లోనవుతుంటారు, కానీ సరైన ప్రణాళిక, పట్టుదల ఉంటే ఈ అడ్డంకిని అధిగమించడం చాలా సులభం.

**మానసిక సంసిద్ధత :**
యుద్ధానికి ముందే విజయాన్ని ఊహించండి. పరీక్షలకు తయారీ పుస్తకాలతో కాదు, మీ మనస్సుతో మొదలవుతుంది. సానుకూల దృక్పథం: "నేను చేయగలను" "నేను సాధించగలను" అనే నమ్మకాన్ని పెంచుకోండి. మీ మీద మీకు నమ్మకం ఉన్నప్పుడే ఏదైనా సాధ్యమవుతుంది. భయాన్ని వీడండి అపుడే మీకు విజయం అనేది లభిస్తుంది. "నేను సాధించగలను" అనే నమ్మకం మీకు సగం విజయాన్ని అందిస్తుంది. పరీక్షలంటే భయం వద్దు, అది మీ ప్రతిభను నిరూపించుకోవడానికి దొరికిన ఒక గొప్ప అవకాశం అని భావించండి. భయం మీ జ్ఞాపకశక్తిని తగ్గిస్తుంది. భయపడితే మీరు చదివినది కూడా మరిచిపోయి పరీక్షలలో సరిగా రాయలేకపోవచ్చు. మీ మీద మీకు నమ్మకం ఉంటే ఎలాంటి విజయాన్ని అయినా సాధించవచ్చు.
ఒత్తిడిని జయించండి: ఒత్తిడి కలగడం సహజం. కానీ దాన్ని మీ ఆరోగ్యంపై ప్రభావాన్ని పడనివ్వకండి. ఒత్తిడి ఎక్కువైతే అది మన జ్ఞాపకశక్తిపై ప్రభావాన్ని చూపించి చదివినది మరిచిపోయే అవకాశం ఉంటుంది. రోజూ 10 నిమిషాలు ధ్యానం లేదా ప్రాణాయామం చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

**సమయ పాలన ( టైం మేనేజ్మెంట్):**
పరీక్షలలో విజయం సాధించడానికి మీ చేతిలో ఉన్న ఆయుధం సమయం. సమయం అందరికీ సమానంగానే ఉంటుంది, కానీ దాన్ని ఎలా వాడుకుంటామన్నదే విజేతలను నిర్ణయిస్తుంది. ప్రపంచంలో అత్యంత ధనవంతుడికైనా, సగటు విద్యార్థికైనా రోజుకు ఉండేది 24 గంటలే. స్టేట్ టాపర్‌గా నిలిచే విద్యార్థికి, సగటు మార్కులతో పాస్ అయ్యే విద్యార్థికి మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం 'సమయ వినియోగం'. విజేతలు కాలాన్ని వృధా చేయరు, వారు కాలాన్ని ఒక పెట్టుబడిగా భావిస్తారు. కాలాన్ని అర్థం చేసుకున్న వాడు జీవితాన్ని వ్యర్థం చేసుకోడు. సాగిపోయే కాలం మీకోసం ఆగిపోదు. కరిగిపోయే ప్రతిక్షణం నీకోసం పెరిగిపోదు. అందుకే కాలం వెంట పరిగెత్తు... విజయాలను సాధించు... అంటాడు మహాత్ముడు. ఈ ప్రపంచం లో మహోన్నత విజయాలు సాధించిన వారందరూ కూడా సమయాన్ని సరైన రీతిలో వినియోగించుకున్న వారే.
**టైమ్ టేబుల్:** మీకు కష్టంగా ఉన్న సబ్జెక్టులకు ఎక్కువ సమయం, సులభమైన వాటికి తక్కువ సమయం కేటాయిస్తూ ఒక షెడ్యూల్ రూపొందించుకోండి.
**ముందస్తు ప్రణాళిక:** ఉదయాన్నే నిద్రలేవడం వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది. కష్టమైన సబ్జెక్టులను (ఉదాహరణకు గణితం లేదా సైన్స్) ఉదయం పూట చదవండి. సబ్జెక్టుల వారీగా వ్యూహాలు చేయండి. పదవ తరగతిలో ప్రతి సబ్జెక్టుకు ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది.
**నోట్స్ మేకింగ్:** స్మార్ట్ స్టడీ పద్ధతి అనగా పుస్తకంలోని ప్రతి అక్షరాన్ని చదవడం కంటే, ముఖ్యమైన పాయింట్లను నోట్స్ రాసుకోవడం ఉత్తమం.
**మైండ్ మ్యాప్స్:** ఒక పెద్ద పాఠాన్ని చిన్న చార్ట్ రూపంలో గీసుకోండి. ఇది రివిజన్ సమయంలో అద్భుతంగా పనిచేస్తుంది.
**కీ వర్డ్స్:** ప్రతి సమాధానంలో ఉండాల్సిన కీలక పదాలను హైలైట్ చేయండి.
**పాత ప్రశ్నపత్రాలు:** గత 5 ఏళ్ల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. దీనివల్ల ప్రశ్నల సరళి (Exam Pattern) అర్థమవుతుంది.
**రివిజన్:** చదవడం ఒక ఎత్తయితే, గుర్తున్నదా లేదా అని నెమరువేసుకోవడం మరో ఎత్తు. వారానికి ఒకసారి చదివినవన్నీ రివిజన్ చేయండి.
**హ్యాండ్‌రైటింగ్:** అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోండి. సమాధానాల మధ్య ఖాళీ వదులుతూ, ముఖ్యమైన పాయింట్ల కింద అండర్ లైన్ చేయండి.
**జ్ఞాపకశక్తిని పెంచుకునే మార్గాలు:** చదివింది మర్చిపోకుండా ఉండాలంటే ఈ సూత్రాలు పాటించండి:
SQ3= **పద్ధతి:** (సర్వే), (ప్రశ్న), (చదవడం), (మననం), (పునశ్చరణ).
**ఫ్లాష్ కార్డ్స్:** ముఖ్యమైన పాయింట్లు చిన్న కార్డుల మీద రాసుకోండి.
**గ్రూప్ స్టడీ:** మీ స్నేహితులకు మీకు వచ్చిన అంశాన్ని వివరించండి. ఇతరులకు చెబితే మీకు బాగా గుర్తుంది.
**సందేహాల నివృత్తి:** ఏ చిన్న సందేహం ఉన్నా వెనుకాడకుండా మీ ఉపాధ్యాయులను లేదా స్నేహితులను అడిగి తెలుసుకోండి.
**సోషల్ మీడియాకు దూరం:** పరీక్షలు ముగిసే వరకు స్మార్ట్‌ఫోన్, టీవీలకు స్వస్తి చెప్పండి. ఆ సమయాన్ని మీ భవిష్యత్తు కోసం పెట్టుబడిగా పెట్టండి.
**ఆరోగ్యమే మహాభాగ్యం:**
పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకండి. చదువు ఎంత ముఖ్యమో, మీ ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం.
**నిద్ర:** కనీసం 6-7 గంటల నిద్ర తప్పనిసరి. నిద్ర లేకపోతే మెదడు సమాచారాన్ని నిక్షిప్తం చేసుకోలేదు. నిద్ర లేకపోతే మెదడుమొద్దుబారుతుంది.
**ఆహారం:** తేలికపాటి ఆహారం తీసుకోండి. పండ్లు, ఆకుకూరలు మరియు తగినంత నీరు త్రాగండి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి.
**ఆహారం:** జంక్ ఫుడ్ మానేసి, పండ్లు, కూరగాయలు తీసుకోండి. నీరు ఎక్కువగా తాగండి.
**విశ్రాంతి:** ప్రతి గంట చదువు తర్వాత 5-10 నిమిషాలు విరామం తీసుకోండి.

**మీ విజయం మీ చేతుల్లోనే..**
10వ తరగతి పరీక్షలు అనేవి నిన్ను భయపెట్టే భూతాలు కావు, నిన్ను ఉన్నత శిఖరాలకు చేర్చే మెట్లు. నీలో అపారమైన శక్తి ఉంది. ఓటమి గురించి ఆలోచించకు, నీ శ్రమ మీద నమ్మకం ఉంచు. ఈ కొన్ని రోజులు నువ్వు పడే కష్టం, నీ జీవితాంతం నీకు గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. నీ గెలుపు కోసం నీ తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. వారి కళ్లలో ఆనందాన్ని చూడటమే నీ లక్ష్యం కావాలి. నువ్వు తప్పకుండా విజయం సాధిస్తావు. ఓటమి ఎదురైనా కుంగిపోవద్దు, అది విజయానికి పునాది రాయి.
పదవ తరగతి ఫలితాలు మీ జీవితాన్ని శాసించవు, కానీ మీ క్రమశిక్షణను తెలియజేస్తాయి. నువ్వు తప్పకుండా విజయం సాధిస్తావు. ఆల్ ది బెస్ట్.



పోగు అశోక్
సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్.

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మార్చి 10 (జనం సాక్షి) :** ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారికి మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్,భూ భారతి దరఖాస్తులు,సర్టిఫికెట్ల జారీ,జనాభా గణన, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాల పురోగతిపై అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సేవలను ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందించేలా తహసీల్దార్లు సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వేగవంతం చేసి కనీసం 85% పురోగతి సాధించాలన్నారు. ఫార్మ్ 6, 7, 8లోని అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలన్నారు.మంజూరీలు



పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కుల,ఆదాయ,ఎఫ్ –లైన్ పిటిషన్‌లు,ఇతర ధ్రువీకరణ పత్రాల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు.సర్వేయర్ల నుండి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, సర్వేయర్లు తమ పనిని సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. తహసీల్దార్లు సర్వేయర్ల పనిని సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు. జనాభా గణన–2027 పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజల వినతులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు జిల్లా ప్రజావాణికి రాకుండా మండల స్థాయిలోనే సమస్యలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈనెల 12న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు రూపొందించిన 99 రోజుల కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం అమలు చేయాలని, ప్రజాప్రతినిధులకు ముందుగానే ఆహ్వానాలు పంపించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఆర్డీఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమానికి కృషి



**గద్వాల నడిగడ్డ, మార్చి 10 (జనం సాక్షి) :** పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గేదెల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన మినీ డైరీ పథకానికి ఎంపికైన 44 మంది రైతులు గేదెలు కొనుగోలు చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళుతున్న సందర్భంగా మంగళవారం ఐడిఓసి ఆవరణలో వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు గేదెల కొనుగోలుకు రూ.2 లక్షలకు గాను 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, మిగిలిన 40 శాతం బ్యాంకు లోన్ పొందడం జరుగుతుందన్నారు. ఉత్తరప్రదేశ్లోని అయోధ్య సమీపంలో మంచి పాల ఉత్పత్తిని ఇచ్చే గేదెలు ఉండడంతో పాడి రైతులను అక్కడికి పంపిస్తున్నట్లు తెలిపారు. గేదెల కొనుగోలుకు సంబంధిత శాఖల పలువురు అధికారులు కూడా రైతుల వెంట అక్కడికి వెళ్లి సహకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని సుషిత, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో అభివృద్ధి పనులను చేపట్టాలి

● ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్



**మహేశ్వరం, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కేవలం పారిశుధ్యం ఒకటే కాదని అన్ని రంగాలలో అభివృద్ధి పనులను చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, సిరిగిరిపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఉన్న విద్యార్థులు సరియైన సమాధానం చెప్పకపోవడంతో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్నప్పటికీ విద్యార్థులకు సరైన విద్యను అందించడం లేదన్నారు. విద్యపై గ్రామ సర్పంచ్ బాధ్యత తీసుకొని పర్యవేక్షించాలన్నారు. మండల స్థాయి అధికారులు అంతా ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,మహేశ్వరం ఎంపీవో రవీందర్ రెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ నరేష్,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టండి

**శేరిలింగంపల్లి, మార్చి 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి జర్నలిస్ట్ కాలనీ ఫేజ్ త్రీలో అభివృద్ధి పనులను చేపట్టాలని జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మాండభేరి గోపరాజు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం గోపరాజు ఆధ్వర్యంలో కాలనీ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఎప్పుడో కాలనీ ఏర్పడినప్పుడు వేసిన కరెంట్ స్తంభాలు మార్చాల్సిన అవసరం ఉందని, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను సైతం సత్వరమే చేపట్టి పూర్తి చేయాల్సిందిగా గాంధీని కోరడమైనది అన్నారు. దీనిపై స్పందించిన పిఎసి చైర్మన్ మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభాలను వేయాలని సంబంధిత డిఈ కి ఫోన్ ద్వారా మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ఎండాకాలం ఇప్పటికే తన ప్రభావం చూపిస్తుందని, మండిపోతున్న ఎండలకు నేటి అవసరం అధికంగా ఉంటున్నందున నిర్ణీతస్థాయిలో వాటర్ సరఫరాకు, పలు సందర్భాలలో అదనపు సరఫరా మంజూరుకు చర్యలు తీసుకుంటానని అరికపూడి తెలియజేశారు. కాలనీలో డ్రెయినేజీ



వ్యవస్థను అభివృద్ధిని ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా మెరుగుపరుస్తానని ఈ సందర్భంగా గాంధీ భరోసాను వ్యక్తం చేశారు. కాలనీలో అంతర్గత రహదారులు, శానిటేషన్, వీధి దీపాలగురించి తదితర సమస్యలను గాంధీ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్థానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎం. వేణుగోపాల్, ప్రభాకర్, హనుమంతరావు, పెద్దిరాజు, సైదారెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక సావిత్రి భాయి పూలే

**చేర్యాల, మార్చి 10 (జనంసాక్షి) :** నేటి మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక సావిత్రి భాయి పూలే అని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలో అంగడి బజారు సమీపంలో సీపీఐ నాయకులు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త, స్త్రీ విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి త్యాగనిరతిని, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతి మహిళ అలవర్చుకోవాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తున్నారంటే అది సావిత్రిభాయి ఆనాడు వేసిన సాహసోపేతమైన పోరాటంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు



ఈరి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు సుంకోజు రజిత, బింగి పోషయ్య, వెలుగల మల్లయ్య, అందె యాదవ్వ, మల్లవ్వ, కవిత, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంసీ పరిధిలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి



**శేరిలింగంపల్లి, మార్చి 10 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో ముందుకు సాగాలని కార్పొరేషన్ కమిషనర్ సృజన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని వివిధ ఉన్నత స్థాయి అధికారులతో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానంగా కార్పొరేషన్ పరిధిలోని పట్టణ ప్రణాళికా అంశాలపై కీలకమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని కమిషనర్ వెల్లడించారు. భవన నిర్మాణ అనుమతులు, అనధికార నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులు, జంక్షన్ మెరుగుదలలు, ఆక్రమణల తొలగింపు, రోడ్డు విస్తరణ పనులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మరియు ఫిర్యాదుల పరిష్కారం వంటి ముఖ్యమైన అంశాలపై అధికారులతో కూలంకష చర్చను చేపట్టి తగిన ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని మరియు సిఎంసి పరిధిలోని అన్ని విభాగాల మధ్య సరైన సమన్వయం కొనసాగాలని, సమస్య ఎలాంటిదైనా దానిని సంబంధిత వ్యక్తులకు చేరవేసి సకాలంలో పరిష్కారం అయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని, నాకెందుకులే అని నిర్లక్ష్య ధోరణి కనిపించకూడదని కమిషనర్ సృజన గట్టిగా హెచ్చరించారు. వివిధ పనులకు సంబంధించిన ఆమోదాలను వేగవంతం చేయడం మరియు క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయడంపై ప్రతి అధికారి ప్రత్యేక దృష్టిని సారించి నిర్ణీత కాలంలో దానిని పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపారు. పట్టణ ప్రణాళికకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని కూడా అన్ని విభాగాల అధికారులకు ఆమె సూచించారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలి



**తాండూరు, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండలం దేవనూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకొని పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా 10 ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.రీటైర్డ్ ఉపాధ్యాయులు కిషన్ రావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు 10 పరీక్షలు రాసేముందు భయం వీడాలని సూచించారు. ఏకాగ్రతతో చదవాలన్నారు. అదేవిధంగా చదివిన పాఠశాలకు గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు అల్ దీ బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయం



**చేవెళ్ల, మార్చి 10 (జనంసాక్షి) :** మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా చేవెళ్లలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, యువ నాయకులు డా.వైభవ్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు అశోక్ పాల్గొని ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాజిక సంస్కర్త, మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు అని అన్నారు. మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేష్, గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డి, పిసరి శ్రీకాంత్ రెడ్డి, అల్లాడ అభిశేఖర్ రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి. రమేష్ బాబు



**మల్దకల్, మార్చి 10 (జనంసాక్షి) :** సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి.రమేష్ బాబు సూచించారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంక్ లావాదేవీలు, పొదుపు, సైబర్ నేరాలు, ఓటిపి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించారు. పిల్లల భవిష్యత్ కోసం పొదుపు తప్పనిసరి అన్నారు. అనవసరపు ఖర్చులు తగ్గించి టీజీబీలో అందుబాటులో ఉన్న పొదుపు, తదితర పాలసీలను ఎంపిక చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్వో రీజినల్ ఆఫీసర్ సిహెచ్ చెన్నకేశవులు,ఫీల్డ్ ఆఫీసర్ కె. రాహుల్,గ్రామ ఉపసర్పంచ్ కర్రెన్న,గ్రామ పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి,గ్రామ పెద్దలు, గ్రామ మహిళలు, సంఘము సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి




**చేవెళ్ల, మార్చి 10 (జనం సాక్షి) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన వార్డు సమీపంలోని సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్ లో న్యూ ఈడెన్ గ్రూప్ స్కూల్స్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన క్రిడాపోటీల ముగింపులో చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. సెల్ ఫోన్లు, టీవీ, సినిమాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అత్తెల్లి శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ రేహనా, సుకన్య, డైరెక్టర్లు గాలయ్య, సుజాత, రఘుపతి రెడ్డి,నర్సింహులు గౌడ్, మహేందర్ రెడ్డి, నిరంజన్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది

**ఉప్పల్, మార్చి 10 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈస్ట్ కళ్యాణపురిలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిల్కానగర్ డివిజన్ పరిధిలోని చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో ఆమె భారీ కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రంగంలోనూ ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని అన్నారు. మహిళల అభ్యున్నతికి ప్రతి ఒక్క మహిళ తన వంతు పాత్ర పోషించాలని, ఒకరికి ఒకరు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా




ప్రతి ఒక్కరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చైల్డ్ వికాస్ ఫౌండేషన్ సంస్థను మహిళలతో ముందుకు తీసుకెళ్తున్న చైర్మన్ పుష్పా రెడ్డి, మేనేజర్ రమేష్ మరియు ఆ సంస్థలో పనిచేస్తున్న మహిళలను ఆమె అభినందించారు. ఈ సంస్థలో సుమారు 90 శాతం మంది మహిళలే పని చేస్తూ సంస్థను విజయవంతంగా నడిపిస్తున్నారని పేర్కొంటూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టైలరింగ్ శిక్షణ పొందిన సుమారు 100 మంది మహిళలకు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం చైల్డ్ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ పుష్పా రెడ్డి మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ను మహిళలతో కలిసి శాలువాతో సత్కరించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి సుమారు రూ.126 కోట్ల నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఒక మహిళగా ఆమె ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచారని, వారి సేవలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో ఆమె ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోనె ఫిలిప్స్, సబ్ ఇన్స్పెక్టర్ డా.వి శ్యామల, సుప్రీంకోర్టు అడ్వకేట్ దాసరి గ్లోరీ ఆనంద, రచయిత్రి మరియు సామాజిక కార్యకర్త డాక్టర్ గూగు శ్యామల, సుజాత బుర్ల, శారద ఫౌండేషన్ సోషల్ ఆక్టివిస్ట్, డాక్టర్ అనిత తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి నియోజక వర్గంలోని విద్యా రంగ అభివృద్ధిపై సంక్షేమశాఖ అధికారులు టీజీ ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్స్, ఆర్‌సిఓలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సంగారెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన కొత్త తరగతి గదులు, భవనాలు, కాంపౌండ్ వాల్స్ ,మరుగుదొడ్లు, ఆర్.ఓ. త్రాగునీటి ప్లాంట్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.

**ఏప్రిల్ 10 లోపు ప్రతిపాదనలు సమర్పించాలి**

వచ్చే నెల 10వ తేదీ లోపు సంబంధిత శాఖలు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పరిశ్రమల



సహకారం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధులతో , ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతుల నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అద్దె భవనాల్లో నడుస్తున్న వసతి గృహాలను సొంత భవనాల్లోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలోని మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలలు, కళాశాలల్లో తగిన భద్రతా చర్యలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న కళాశాలలు, వసతి గృహాల వివరాలను సేకరించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

**విద్యా అభివృద్ధికి పరిశ్రమల సహకారం**

టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా అభివృద్ధికి పరిశ్రమల సహకారం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధులను వినియోగించి కొత్త హాస్టల్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా సురక్షితమైన వసతి గృహాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించటానికి అధికారులు కృషిచేయాలని తెలిపారు. జిల్లాలో విద్యనభ్యసించేందుకు ఇతర ప్రాంతాల నుండి కూడా అనేక మంది విద్యార్థులు సంగారెడ్డికి వస్తున్నారని, అందువల్ల విద్యాసంస్థల వద్ద తగిన మౌలిక వసతులు, వసతి సదుపాయాలు కల్పించడం అత్యవసరమని తెలిపారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ బాలశౌరి, సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, పంచాయతీరాజ్ ఎస్సీ జగదీష్, ఈ డబ్ల్యూ ఐ డి సి రాజు, శ్రీనివాస్ రెడ్డి,, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయాలి



**సంగారెడ్డి టౌన్, మార్చి 10 (జనం సాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐ కేంద్రాలను బలోపేతం చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించడం, కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సేతు ప్రాజెక్టు కింద ఐదు ఐటీఐలను హబ్ అండ్ స్పోక్స్ విధానంలో అభివృద్ధి చేసి పరిశ్రమల సహకారంతో ఐదేళ్లపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి ఏర్పాటు చేసి ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. ఈ సమీక్షలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రాజా, ఐటిఐ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, సీఎం సేతు కన్సల్టెంట్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలి



**వెల్దండ, మార్చి 10 (జనంసాక్షి) :** పశు పోషకులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రాజేష్, సర్పంచ్ తిరుగుడు మంజుల రాజు యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలో గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందని సూచించారు. కావున ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగ పర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీదేవి జంగయ్య, వెటర్నరీ అసిస్టెంట్ నరసింహ, ఆఫీస్ సబార్డినేట్ శ్రీను, గోపాల మిత్ర మొగులయ్య, సాయిబాబు, రైతులు లింగయ్య, తానయ్య, మల్లయ్య, గోరటి మల్లయ్య, తగుళ్ళ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫైల్స్ క్లియరెన్స్ వేగవంతంగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, మార్చి 10 (జనం సాక్షి) :** ఫైల్ క్లియరెన్స్ వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ సెక్షన్ లను ఆమె పరిశీలించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వివిధ జిల్లా శాఖల కార్యాలయాలతోపాటు జిల. స్వచ్ఛత.. పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని అన్నారు. ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని రికార్డులు, ఫైళు నిబంధనల ప్రకారం భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

# ప్రజాపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలి

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి) :** ప్రజాపాలనను ప్రజలకు మరింత చేరువచేసేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మార్చి 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి సీఎస్ రామక్రిష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఛైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు,



వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా మార్చి 12న నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి సంబంధించి విభాగాల వారీగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతి అధికారుల నుండి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత మరియు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**భూత్పూర్, మార్చి 10 (జనం సాక్షి) :** భూత్పూర్ మున్సిపాలిటీ లో రైతులకు స్ప్రింక్లర్ సెట్ లు,ప్లాస్టిక్ క్రెట్స్ పంపిణీ చేసిన దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు.మంగళవారం దేవర కద్ర నియోజకవర్గం లో భూత్పూర్ రైతు వేదిక వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట్ మండలాల రైతులకు స్పింక్లర్స్,



భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రైతులకు హార్టికల్చర్ ఇక్విమెంట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రైతులకు వరి ధాన్యంపై 500 బోనాస్ ఇస్తున్నామని, అదేవిధంగా గత ప్రభుత్వం నిలిపివేసిన వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించిందని, పంట బీమా పథకాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేస్తే, పంటల బీమా పథకాన్ని సైతం పునరుద్ధరించి,ముఖ్య మంత్రి రైతాంగానికి అండగా నిలిచారని అన్నారు. రైతుబంధు నెపంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పనిముట్లు, స్పింక్లర్స్ ఇస్తున్నామని, రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలుస్తున్నామన్నారు. నిరంతరం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు. ఉద్యాన శాఖ డి.డి.వేణు గోపాల్ మాట్లాడుతూ ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకంలో భాగంగా స్ప్రింక్లర్ సెట్లు 86 మంది రైతులకు సబ్సిడీ పై అందచేశారు. వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం లో రైతులకు ప్లాస్టిక్ క్రెట్స్ (టమాటా బాక్సులు), వర్మి కంపోస్ట్ తయారు చేసుకొనే బెడ్లను కూడా ఆయన రైతులకు పంపిణి చేసారు. రైతులతో వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం పై సుదీర్ఘ చర్చ చేసారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళి,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇసుక పంపిణీ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి

● ప్రతి ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
● ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ బాదావత్ సంతోష్
● రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులతో సమీక్ష



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రజల అవసరాలు మరియు ప్రభుత్వ పనుల కోసం అవసరమైన ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకుని పొందే విధంగా చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అధికారులకు ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రజల అవసరాలకు, అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూడా ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇసుక పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ అవసరాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ట్రాక్టర్ యాజమాన్యాలు తమ వాహనాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుంటే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జీపీఎస్ కలిగి మైనింగ్ శాఖ వద్ద రిజిస్టర్ అయిన వాహనాల ద్వారానే ఇసుక రవాణాకు అనుమతించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 18 ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పర్యవేక్షణలో ఉండేలా చూడాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లోడింగ్ నిర్వహించాలని సూచించారు.అక్రమంగా ఇసుక తరలించే వాహనాలు పట్టుబడితే రూ.20 వేల వరకు జరిమానా విధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మరిన్ని ఇసుక రీచ్‌లు ప్రారంభించేందుకు తహసీల్దార్లు ఆన్‌లైన్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సి సెక్షన్ తహసీల్దార్ రవికుమార్, వంగూర్, ఉప్పునుంతల, కల్వకుర్తి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరాలి




**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందరికీ చేరాలని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి అన్నారు.ఆయన మరో అదనపు శ్రీనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సి ఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 12న ప్రారంభమయ్యే శిక్షణ తరగతులకు గాయత్రీ ఫంక్షన్ హాల్ సిద్ధం చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మార్చి 12వ తేదీన స్థానిక ప్రజా ప్రతిని ధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా మని, ప్రతి ప్రజా ప్రతినిధికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.ప్రోటోకాల్ ప్రకారం వివిఐపి, వి.ఐ.పి. లకు ఆహ్వానం అందేలా జాగ్రత్తలు పాటిం చినట్లు అన్నారు.శిక్షణ కార్యక్రమానికి వచ్చే ప్రజా ప్రతినిధులకు అవసరమైన ఆహారం, ఇతర ఏర్పాట్లు కూడా కల్పించామని,ఆడియో,వీడియో వ్యవస్థ సరిగ్గా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు.శిక్షణ కార్యక్రమంలో ఉదయం సెషన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ,10 థీమ్స్ లో వివిధ శాఖల ద్వారా చేపట్టే పనులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తామని,లంచ్ అనంతరం పిఆర్ చట్టం, మున్సిపల్ చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ వీడియో సమా వేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిఎస్పీ లింగయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండానే ఎగరాలి

● వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన సంస్థ గతంగా బలోపేతం అవ్వాలని, ఇందులో గ్రామ అధ్యక్షులతోపాటు బూత్ కన్వీనర్ల పాత్ర చాలా ప్రధానంగా ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం, పెద్దమందడి మండలాల్లో ఏర్పాటుచేసిన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.పార్లమెంట్ లీడర్ ఆఫ్ అపోజిషన్ రాహుల్ గాంధీ ని బావి భారత ప్రధాని గా చేసింతవరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్విరామంగా శ్రమించాలని అందుకు ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న గ్రామ మండల స్థాయి కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని వారన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా నాయకులుగా పార్టీ తరఫున ఏర్పాటు చేసే వివిధ విభాగంలో ఉండే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ పార్టీపరమైన ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని, పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని వారు సూచించారు.పార్టీ నాయకులుగా కార్యకర్తలుగా గ్రామ అధ్యక్షులుగా మండలాధ్యక్షులుగా వివిధ ఆర్గనైజేషన్ లో ఉండి పార్టీ కార్యక్రమాల పట్ల మనకెందుకులే అనే ధోరణిని విడనాడాలని, మనకెందుకులే అనుకునే వారెవరు కూడా రాజకీయంగా రాణించలేరని, అలాంటి వారి సహవాసంలో మనం ఉండకూడదన్నారు.నాకేంటి అనే ధోరణి వదిలేసి నేనున్నాగా అంటూ పార్టీ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని అందరం కలిసి ముందుకెళ్తే గ్రామాల్లో మనకు ఎదురుపడే వారే లేరని ప్రతిపక్షాలన్నింటికీ పాతర వేయవచ్చునని వారన్నారు.గ్రామాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ కోసం పనిచేసే వారికి మొదటి ప్రాధాన్యత మొదటి ప్రాధాన్యత ఉంటుందని వారు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వెనకబడి పోతున్నామని ప్రభుత్వం చేసే పనులను గ్రామంలోని ప్రతి గడపకు చేరవేయాల్సిన బాధ్యత మనకుందని వారు సూచించారు. ఈ సందర్భంగా వారు ఖిల్లా ఘణపురం మండలం, పెద్దమందడి గ్రామ అధ్యక్షులకు సంబంధించినటువంటి ఆశావాహుల పేర్లను వారు సేకరించారు.అధ్యక్ష పదవి కోసం ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు దరఖాస్తు చేసుకోవడంతో దరఖాస్తుదారుల వివరాల పూర్వాపరాలను పరిశీలించి కమిటీని త్వరలోనే ప్రకటించినట్లు వారు తెలిపారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జర్నల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షులు



రాజేంద్రప్రసాద్ యాదవ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సోలిపురం రవీందర్ రెడ్డి, వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాలకృష్ణ, మండలాధ్యక్షులు విజయ్ కుమార్, పెంటయ్య యాదవ్, సాయి చరణ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, క్యామ వెంకటయ్య, వెంకట్రావు, ఐ సత్య రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య , న్యాయవాది తిరుపతయ్య, నందిమల్ల త్రినాథ్, మొగిలి సత్య రెడ్డి, చీర్ల జనార్దన్, టైలర్ రవి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ఆరోగ్యంగా ఉంటేనే మంచి సేవలందిస్తారు

● ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అధికారులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తారని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో మెడికవర్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ఈ మెగా ఆరోగ్య శిబిరం ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో మెడికవర్, ప్రభుత్వ వైద్య బృందం రక్తపోటు, షుగర్, గుండె, కంటి సంబంధిత పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగులకు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, టిజిఓ కార్యదర్శి సునీల్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు డా.మధుసూదన్, ఫణి కుమార్, డా వెంకన్న, సంతోష్, శ్రీనివాసరావు, స్వాతి టీజీఓ ప్రతినిధులు, మెడికవర్, ప్రభుత్వ వైద్యులు డా శ్రీదేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరంలో నిర్వహించనున్న అంత్య పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో అంత్య పుష్కరాల ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య, ప్రణాళిక శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంత్య పుష్కరాలకు చేపట్టిన అన్ని పనులు ఏప్రిల్ 30 లోగా మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఘాట్ల వద్ద పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు, భక్తులు సురక్షితంగా స్నానం చేసేలా ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య శాఖ అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్ సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పనుల పురోగతిని తరచూ పరిశీలిస్తూ సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, ఆర్ అండ్ బి, విద్యుత్తు, మిషన్ భగీరథ, వైద్య, ప్రణాళిక, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి సహకరించండి

● బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మార్చ్ 10 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధిలో ఎంతో వెనకబడి పోయిందని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పలు అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరుకు సహకారం అందించాలన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన రోడ్లు, మౌళిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్యే వివరించిన సమస్యలను సావదానంగా విన్న మంత్రి జూపల్లి కృష్ణారావు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహించిన కలెక్టర్ హరిత



**కౌటాల మార్చి 10 (జనంసాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళ వారం కౌటాల మండల కేంద్రంలో వివిధ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కౌటాల మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేయగా అక్కడ డాక్టర్ లేక కేవలం సిబ్బంది మాత్రమే ఉన్నారు. డాక్టర్ పవన్ కళ్యాణ్ రిజైన్ చేయగా కేవలం సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. కలెక్టర్ హాస్పిటల్ లోని రిజిస్టర్ లు పరిశీలించారు. పలువురు సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో పాటు రిజిస్టర్ లో హాజరు పట్టిక లో ఖాళీగా ఉండడంతో ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నించారు. డాక్టర్ లేకపోవడంతో ఆయుష్ డాక్టర్ వారంలో మూడు రోజులు వస్తున్నట్లు చెప్పగా, ఆయుష్ అటెండర్ విధులకు రాకపోవడంతో గైర్హాజరు వేసింది. అక్కడే డేటా ఎంట్రీ గది మూసి ఉండడంతో దాన్ని తెరిచి చూడగా సిస్టమ్ ,ప్రింటర్ పై దస్ట్ పేరుకుపోయి ఉండడంతో ఇది చూస్తే మీ పని తీరు అర్థం అవుతోందని తమాషాలు చేయొద్దని ఘాటుగా మందలించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరి హాస్టల్ లో తనిఖీ చేసి పదో తరగతి స్టూడెంట్స్ తో మాట్లాడారు. గైర్హాజరు అయిన స్టూడెంట్స్ ఎందుకు అయ్యారని ఆరా తీశారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు, టీచర్లకు సూచించారు. నాలుగు రోజుల్లో పరీక్షలు ఉన్నందున భయపడకుండా ప్రశాంతంగా చదువులపై దృష్టి పెట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పై, ప్రహరీ గోడ నిర్మాణం పై ఆరా తీశారు. పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పరిశీలించారు. బీసీ హాస్టల్ (బాలురు)ను తనిఖీ చేసి స్టోర్ రూము, వంటగది, పిల్లల గదులు పరిశీలించారు. పిల్లలకు హైజీనిక్ భోజనం అందించాలని వార్డెన్ కి సూచించారు.

### ప్రాణహిత నదిని పరిశీలించిన కలెక్టర్

ప్రాణహిత నది పరిశీలించిన కలెక్టర్, కె. హరిత కౌటాల మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ హరిత గారు తుమిడి హెట్టి వద్ద ప్రాణహిత నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. మహారాష్ట్ర, తెలంగాణ నదుల కలయికతో ప్రాణహితగా ఏర్పడుతున్న విషయాన్ని ఎంపీడీవో ప్రసాద్ వివరించారు. నీటి లభ్యత, వానాకాలం వరద పరిస్థితి గురించి ఆరా తీశారు. ఎండాకాలం నేపథ్యంలో నదిలో నీళ్లు ఉంటాయా అనే వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి ప్రసాద్, తహసిల్దార్ ప్రమోద్ కుమార్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం, అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల సంక్షేమ, అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కలముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరా జుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్ పర్సన్ అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంకుల నిర్వహణతో పాటు ఇందిరా శక్తి క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, ఇతర అనేక వ్యాపారాలలో ప్రోత్సహిస్తూ మహిళలను ముందంజలో ఉంచే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కుటుంబానికి పెద్దగా మహిళను గుర్తిస్తూ కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని, తద్వారా జిల్లాలో 3 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని, రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలు పుట్టినప్పటి నుండి పెరిగే వరకు కుటుంబంలో మహిళల పాత్ర కీలకమైనదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఐ కె పి, మెప్మా ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని, ఆరోగ్య మహిళ పథకం ద్వారా మహిళలలో నెలకొన్న దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ దిశగా పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని, తాత్కాలిక ఉపశమనం కాకుండా పూర్తి స్థాయిలో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 15 సంవత్సరాల వయసు కలిగిన బాలికలకు ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తుందని, భవిష్యత్తులో క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

● ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు/వెంకటాపూర్,మార్చి10(జనం సాక్షి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా,పారదర్శకంగా నిర్వహించాలన్నారు.పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.హాజరు వివరాలు,సీసీ కెమెరా పని తీరు,త్రాగు నీరు,వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసు కున్నారు.పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు.మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఆకస్మిక తనిఖీ

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి):** ధర్మ కంచ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష నిర్వహణ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్..

కేంద్రంలో హాజరైన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్త య్యే వరకు సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాద ని స్పష్టం చేశారు.


## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు/వెంకటాపూర్,మార్చి10(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని మొదటి విడతలో మంజూరు అయిన లబ్ధిదారులు తమ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 99 రోజులు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.వెంకటాపూర్ మండల కేంద్రంలో నల్లగుంట,ఎల్లారెడ్డి పల్లె గ్రామాలలోని నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను,గ్రామాల్లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపూర్,నల్లగుంట, ఎల్లారెడ్డిపల్లె గ్రామాల్లో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని వాటిలో ఎన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలినవి ఏ ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ ను లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇప్పించి ఇండ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయా అని ఆరా తీశారు.ఏ కారణాల చేత ఇండ్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉన్నాయి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.వివిధ దశలో మిగిలి ఉన్న నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తే చివరి బిల్లు కూడా వస్తుందని త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండుగ వరకు గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించక పోతే రద్దు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇల్లు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పరిశుభ్రత ద్వారా అనేక రకాల సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అన్నారు.పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛమైన పరిసరాల నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి సూర్యనారాయణ, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ,రామప్ప ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ మిల్కురి ఐలయ్య, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డికి అభినందనలు



**నిర్మల్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# అధికారులకు మూడు రోజుల శిక్షణ




**హన్మకొండ ప్రతినిధి మార్చి 10 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా నిర్వహించబడనున్న జనాభా గణన–2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయి జనాభా గణన అధికారులతో పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ప్రధాన జనాభా గణన అధికారి చాహత్ బాజ్ పాయి మంగళవారం ప్రారంభించారు.దేశంలో నిర్వహించబడుతున్న 16వ జనాభా గణన ఇదే కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనాభా గణన కావడం విశేషమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. జిల్లాలో అలాగే వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలు, బాధ్యతలపై అధికారులకు ఈ శిక్షణలో సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జనాభా గణన విభాగం హైదరాబాద్‌కు చెందిన సంయుక్త సంచాలకులు డి. సుబ్బరాజు, గణాంక అధికారి ఎస్. సతీష్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి, డీఎఫ్ఓ, ఆర్డీఓలు, వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంక్ మిత్రకు సన్మానం



**వరంగల్ ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి):** బ్యాంకు వినియోగదారులకు సేవలు అందించే బ్యాంక్ మిత్రలు బ్యాంక్ ఖాతాదారులకు ఎంత చురుగ్గా సేవలను అందిస్తే గుర్తింపు లభిస్తుందని టీజీబీ మేనేజర్ జె.సిద్ధార్థ అన్నారు. మంగళవారం గిర్నిబావిలో గల టీజీబీ మందపల్లి శాఖ పరిధిలోని ఆయా గ్రామాలలో బ్యాంక్ సేవలను చురుగ్గా అందిస్తున్న ఐరిక్స్ – టీజీబీ బ్యాంక్ మిత్రలను గుర్తించిన మేనేజర్ సిద్ధార్థ శాలువాలతో సన్మానించి 2026 సంవత్సరం ఎస్ బి ఐ లైఫ్ డైరీలను ప్రధానం చేశారు.

## చిల్పూర్ దేవస్థానం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావు

● వరుసగా మూడుసార్లు ఎన్నికైన శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్పూర్ మార్చి 10 ( జనం సాక్షి ) :** రెండవ తిరుపతి గా పేరుగాంచిన చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా వరుసగా మూడు సార్లు పొట్లపల్లి శ్రీధర్ రావు ను దేవలయశాఖ కమీషనర్ ప్రకటించారు. ఈ సంద ర్భంగా పొట్లపల్లి శ్రీధర్ రావు కు దేవాలయం అధికారులు, ప్రజాప్రతినిధులు , నాయకులు, పలువురు నేతలు శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొట్లపల్లి శ్రీధర్ రావు మాట్లా డుతూ స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి డాక్టర్ కడియం కావ్య, సంబంధిత మంత్రుల సహకారంతో దేవలాయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. తనకు కృతజ్ఞతలు తెలిపిన ప్రతి ఒక్కరి కి ధన్యవాదాలు తెలిపారు.

# పొగాకుపై రఘునందన్ మాచన 22 ఏళ్ల నిశ్శబ్ద పోరాటం

- **దేశ స్థాయిలో టుబాకో కంట్రోల్ హీరోగా మాచన రఘునందన్**
- **రాష్ట్రపతి భవన్ నుంచి హాలో యే రఘునందన్ మాచన హై అనే పిలుపు**

**కొండమల్లేపల్లి, మార్చి 10 (జనంసాక్షి) :** మన చుట్టూ ఉన్న వ్యక్తులు ఆరోగ్యకరమైన ఉల్లాసమైన జీవితాన్ని కొనసాగించాలనుకుంటే ధూమపానం మానేయమని కోరండని ధూమపానం అనేక ప్రమాదకరమైన అనారోగ్యాలకు కారణం కావచ్చు అని వెంటనే ధూమపాణ అలవాటును మానేయాలని నో స్మోకింగ్ డే అనేది ధూమపానం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచడంలో సహాయపడే కీలకమైన సందర్భం అని రఘునందన్ మాచన తెలిపారు. మార్చి 11 నేషనల్ నో స్మోకింగ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం. పొగాకు వ్యసనం సమాజాన్ని క్రమంగా కుదేలు చేస్తున్న నేపథ్యంలో ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి తన నిస్వార్థ కృషితో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయనే మాచన రఘునందన్. ఆయన చేసిన సేవలకుగాను టుబాకో నియంత్రణలో అత్యున్నత గౌరవమైన టుబాకో కంట్రోల్ హీరో అవార్డు ఆయనను వరించింది.

### 22 ఏళ్లుగా సాగుతున్న నిశ్శబ్ద పోరాటం

దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్ పోర్ట్, బహిరంగ ప్రదేశాల్లో నో స్మోకింగ్ ప్లీజ్ అని వినయంగా చెప్పడం ఆయన అలవాటు. 22 సంవత్సరాలుగా ఆయన ఈ



మాటను వేలాది మందికి చెబుతూ పొగాకు వ్యసనం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కృషి దేశవ్యాప్తంగా వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తల దృష్టిని మాత్రమే గాక అటు సుప్రీంకోర్టును ఇటు రాష్ట్రపతి భవన్ ను సైతం ఆకర్షించింది.

### వైద్యుడు కాదు కానీ సమాజానికి వైద్యుడే..

వైద్యులు చెబుతున్న మాట ఒకటే మేము రోగులకు చికిత్స చేస్తున్నాము కానీ రఘునందన్ మాత్రం సమాజానికి చికిత్స చేస్తున్నారని వైద్య వృత్తికి సంబంధం లేకపోయినా సమాజ ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆయన చేస్తున్న కృషి అసాధారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు.

### అత్యున్నత గౌరవం

పొగాకు నియంత్రణపై విశేషంగా పనిచేసే వ్యక్తులకు రిసోర్స్ సెంటర్ ఫర్ టొబాకో కంట్రోల్ (ఆర్సిటిసి) సంస్థ ప్రతి సంవత్సరం టుబాకో కంట్రోల్ హీరో అవార్డు అందిస్తుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన 15 మందిలో మాచన రఘునందన్ మాత్రమే వైద్యేతర వ్యక్తి. అలాగే దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తిగా అయన నిలిచారు.

### సాధారణ ఉద్యోగి అసాధారణ సేవ

ప్రస్తుతం ప్రభుత్వంలో డిప్యూటీ తహసీల్దార్ గా పనిచేస్తున్న రఘునందన్ విలాసవంతమైన జీవితం గురించి ఆలోచించకుండా సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. పొగాకు వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడం యువతను దూరం చేయడం ఆయన జీవిత లక్ష్యంగా మారిందని అన్నారు.

### నిశ్శబ్ద విప్లవం

రఘునందన్ చేస్తున్న ఈ కృషి ఒక నిశ్శబ్ద విప్లవంగా చెప్పవచ్చు. ఎలాంటి ప్రచారం లేకుండా హడావుడి లేకుండా సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్న నిజమైన హీరో ఆయన.

### ప్రేరణగా నిలిచిన వ్యక్తిత్వం

మాచన రఘునందన్ అనే పేరు ఇకపై కేవలం ఒక అధికారి పేరు మాత్రమే కాదు. పొగాకు మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడిన ఒక ప్రేరణాత్మక వ్యక్తిత్వంగా చరిత్రలో నిలిచే పేరు. ఆయన పొందిన హీరో అవార్డు కేవలం ఒక గౌరవం కాదు నిస్వార్థ సేవకు లభించిన కిరీటం అని సమాజం ఆయనను గౌరవిస్తుంది. సరళంగా శ్వాస తీసుకొని పొగ లేని జీవితాన్ని జరుపుకుందామని అయన పిలుపునిచ్చారు.

## రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్‌హౌసింగ్ కాలనీ పరిశీలన



**హుజూర్‌నగర్, మార్చి 10 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల రెండవ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఇందిరమ్మ ఇండ్ల బ్లాకులు, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి పెండింగ్ లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ, పిడి హార్టికల్చర్ నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, ఈఈ మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల నాగలక్ష్మీకి భారతనారి శక్తి సామాజికవేత్త అవార్డు అందజేత



**హుజూర్‌నగర్ రూరల్, మార్చి 10 (జనంసాక్షి) :** మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మాడుగల నాగలక్ష్మికి 2026 యువ ఆర్ట్స్ థియేటర్స్ వారు మంగళవారం హైదరాబాద్ త్యాగరాయ కళావేదికలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాడుగుల నాగలక్ష్మి మాట్లాడుతూ కౌమర దశలో ఉన్న బాల బాలికలకు, మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు, ఉపాధి హామీ పథకం లో భాగంగా మహిళా కూలీలకు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచినందుకు ఈ అవార్డు కు ఎంపిక చేయటం, కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదగా ఈ అవార్డును తీసుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డు ఎంపిక పట్ల నాయకులు, గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు అభినందనలు తెలిపారు.

## ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి రూరల్, మార్చి 10 (జనంసాక్షి) :** భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపురం గ్రామస్తులు సోమవారం సాయంత్రం వడపర్తి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురై ఒకే కుటుంబానికి చెందిన తల్లి ఇద్దరు కుమారులు మృతి చెందడంతో గ్రామమంతా విషాద ఛాయలు అలముకోవడం జరిగింది.గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటరెడ్డి నేతృతంలో మృతి చెందిన మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి దహన సంస్కారాల కొరకు ఏర్పాట్లు చేయడం జరిగింది. భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి మృతి చెందిన మృతదేహాలను సందర్శించి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో చిన్న కుమారుడిని, తండ్రిని ఓదార్చే ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా మేము సర్పంచ్ అండగా ఉంటామని మనోధైర్యం చెబుతూ ఒక లక్ష రూపాయలు వెంటనే ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎడ్ల సత్తిరెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మాజీ ఎంపిటిసి ఉడుత శారదా ఆంజనేయులు,రావుల నందు,మల్లేష్,వార్డు మెంబర్ జిన్న నర్సింహ,మాజీ సర్పంచ్ పిన్నం రాజు, నకిరేకంటి నర్సింహ,దొంకేన శేఖర్,హరిశంకర్, రాందాస్ మోర నర్షి రెడ్డి, రాం రెడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి సొంత నియోజకవర్గంలోనే జ్వరాల విలయం

- **దాచారంలో మురికి కూపాలు రోగాల పంజా**
- **అధికారుల నిర్లక్ష్యం మంత్రి కి చెడ్డపేరు తెచ్చేలా ఉందన్న విమర్శలు**

**మాడుగులపల్లి, మార్చి 10 (జనం సాక్షి) :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ నియోజకవర్గంలో, ఆయన ఇలాకాలోని మాడుగులపల్లి మండలం దాచారం గ్రామం నేడు రోగాల కోరల్లో చిక్కుకుంది. ఒకవైపు మంత్రి జిల్లా అభివృద్ధి కోసం శ్రమిస్తుంటే, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్య లోపం, మురుగు నీరు నిలకడ, కలుషిత తాగునీరు వెరసి దాచారం గ్రామం నేడు రోగాల రాజధానిగా మారింది. ప్రతి ఇంట్లో ఒకరు మంచాన గ్రామం మధ్యలో ఉన్న కుంటలు గుర్రపుడెక్కతో నిండి దోమలకు ఆవాసంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు వీధుల్లోనే నిలుస్తోంది. దీనివల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు గ్రామాన్ని చుట్టుముట్టాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ జ్వరపీడితులు ఉండటం ఇక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతోంది.

### మంత్రి ఇలాకాలో ఇదేం తీరు..?

సొంత నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ కనీసం అటువైపు చూడకపోవడం గమనార్హం. మంత్రి నియోజకవర్గంలో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసినప్పుడు అపరిశుభ్ర పదార్థాలు బయటపడటం, ఇప్పుడు జ్వరాలు విజృంభించడం చూస్తుంటే ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా



పోయింది.

### మంత్రి స్పందించాలి

యుద్ధ ప్రాతిపదికన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, మురుగు నీటిని బయటకు పంపి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి




- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి మహిళ సాటి మహిళకు అండగా నిలబడాలని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని, ప్రతి మహిళ జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్న వారేనని తెలిపారు. మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, ఉద్యోగం, వ్యాపారం వంటి ప్రతి రంగంలో ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.మహిళ సాధికారత దేశ అభివృద్ధికి పునాది అని తెలిపారు.కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో మహిళల పాత్ర అపారమని, మహిళలకు మరిన్ని విస్తృతంగా అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతి మరింత వేగంగా సాగుతుందని అన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తలు, యువ మహిళలు స్టార్టప్‌లు ప్రారంభిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు.మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నాయని అన్నారు.మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని, మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, కోదాడ డిప్యూటీ చైర్ పర్సన్ మల్లీశ్వరి, డిప్యూటీ సీఈఓ శిరీష, పంచాయతీరాజ్ ఈఈ రమాదేవి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, డిఎంహెచ్వో వెంకటరమణ, డిటిఓ రవికుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వేణారెడ్డి సేవలు అభినందనీయం




**సూర్యాపేట, మార్చి 10 (జనంసాక్షి) :** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల వేణారెడ్డి రైతులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మార్కెట్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేధిత లక్ష్మాదితో కలిసి వేణారెడ్డితో పాటు డైరెక్టర్లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంతో పాటు తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల నుండి వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పాలకవర్గం ఉత్తమమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా కొప్పుల వేణారెడ్డి పదవి చేపట్టిన వెంటనే ఐదు రూపాయలకు అన్నపూర్ణ భోజనంతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఉచితంగా ప్రతిరోజు అల్పాహారం కూడా పంపిణీ చేయించడం హర్షనీయం అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ముక్రం, డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

**బూర్గంపహాడ్, మార్చి 10 (జనంసాక్షి) :** గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాల, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని, వారి ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థుల సౌకర్యాలపై ఆరాతీసి భోజన నాణ్యత, పాఠశాల నిర్వహణ, పరిశుభ్రతను పర్యవేక్షించారు. ఆరుబయట ఉన్న ఐస్క్రీమ్ బండిని గమనించిన కలెక్టర్ అక్కడకు స్వయంగా వెళ్లి ఐస్క్రీమ్‌ల గడువు తేదీలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యత లేని, గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయించరాదని స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతిగృహాల్లో బయటి నుంచి వచ్చే ఆహారపదార్థాలు అనుమతించవద్దని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాలలో ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకుని రుచి చూశారు. విద్యార్థులకు నిర్ణీత సమయంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, భోజన విషయంలో నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యంపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. పఠనా సామర్థ్యం మరింత పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు రోజుకు మూడుసార్లు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఉదయం విద్యార్థులకు రాగిజావ, పల్లిపట్టు ఇవ్వాలని, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ



అవర్స్ నిర్వహించాలని, ఆ సమయంలో వారికి స్నాక్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్, ఎంఈవో యదు సింహరాజు, రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలల నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో రోల్ మోడల్‌గా నిలవాలి

**దేవరకొండ, మార్చి 10 (జనం సాక్షి) :** దేవరకొండ మండలంలోని కట్టకొమ్ము తండా గ్రామపంచాయతీ పరిధిలోని జాల్ తండాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి,తండాలో ఉన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కట్టాకొమ్ము తండా రోల్ మోడల్ గా నిలవాలని పిలుపునిచ్చారు.తండా పరిసరాల పరిశుభ్రతతో పాటు తండా సమస్యల పరిష్కారానికి అధికారులు,గ్రామస్తులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. దేవరకొండ పట్టణంలో పార్కు ఏర్పాటు చేయడం కోసం పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు, స్థానిక నాయకులు,ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# చల్లారిన చమురు

## 10వేల బడ్జెట్ సెగ్మెంట్‌లో పోకో నుంచి కొత్తఫోన్



**న్యూఢిల్లీ:**ఎంట్రీ లెవల్‌లో స్మార్ట్‌ఫోన్ కొనాలనుకునే వారి కోసం షావోమీ సబ్ బ్రాండ్ పోకో కొత్త ఫోన్ తీసుకొచ్చింది. తన సీ- సిరీస్‌లో ఖనీఇనీ అ85లీ 5ఉ పేరిట దేశీయ మార్కెట్లోకి కొత్త స్మార్ట్‌ఫోన్ విడుదల చేసింది. 6,300ఎంఏహెచ్ బ్యాటరీ, 15చి వైర్డ్ ఛార్జింగ్, 7.5చి వైర్డ్ రివర్స్ ఛార్జింగ్‌తో సపోర్టు చేస్తుంది. ఆండ్రాయిడ్ 16 ఆధారంగా హైపర్ ఓఎస్ 3తో ఇది పనిచేస్తుంది.పోకో స్మార్ట్‌ఫోన్‌లో 6.9 అంగుళాల డిస్‌ప్లే ఇచ్చారు. 120 రిఫ్రెష్‌రేటు, 240ఊళి టచ్ శాంప్లింగ్ రేటు, 800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో పనిచేస్తుంది. ఎఖ52 రేటింగ్ ఉంది. 32 ఎంపీ ప్రధాన కెమెరా, 8ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. 6,300ఎంఏహెచ్ బ్యాటరీ రెండు రోజుల వరకు బ్యాటరీ బ్యాకప్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. మైక్రో ఎస్టీ కార్డ్ ద్వారా 2ః స్టోరేజీని పెంచుకోవచ్చు. ఈ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+64జీబీ వేరియంట్ ధర రూ.10,999, 4జీబీ+128జీబీ ధర రూ.11,999గా కంపెనీ నిర్ణయించింది. మార్చి 14 నుంచి ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయాలకు రానుంది. బ్లాక్, గోల్డ్, గ్రీన్ రంగుల్లో లభిస్తుంది.

## మినిమమ్ బ్యాలెన్స్ లేనందుకు.. రూ.11 వేల కోట్ల వసూలు..

**న్యూఢిల్లీ:**కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి గడిచిన ప్రైవేటు రంగ బ్యాంకులు రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8వేల కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.ప్రైవేటురంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.3800 కోట్లు ఛార్జీల రూపంలో ఖాతాదారుల నుంచి వసూలు చేసిందని మంత్రి తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1200 కోట్లు చొప్పున వసూలు చేశాయన్నారు.ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అత్యధికంగా రూ.1500 కోట్లు వసూలు చేయగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1200 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.1100 కోట్లు చొప్పున వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.కనీస నిల్వలపై 2020 మార్చి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛార్జీలు వసూలు చేయడం లేదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా గతేడాది నుంచి ఈ ఛార్జీలను తొలగించాయి. కరెంట్ ఖాతాల విషయంలో కొన్ని మార్పులు చేశాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం ఇప్పటికీ కనీస నిల్వలు లేకపోతే ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

### స్టాక్ మార్కెట్ ఖుష్.. సెన్సెక్స్ 640 పాయింట్లు పైకి



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండ్రోజుల వరుస భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. ఇరాన్‌తో యుద్ధానికి త్వరలో ముగింపు పలుకుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మదుపర్లకు ఊరటనిచ్చాయి. దీనికితోడు చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఆంక్షలను సడలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్ బలోపేతం చేసింది. దీంతో నిన్న 100 డాలర్ల ఎగువన ట్రేడైన బ్యారెల్ చమురు ధర.. 90 డాలర్ల దిగువకు చేరింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 24,200 మార్కును దాటింది.సెన్సెక్స్ ఉదయం 78,375.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,566.16) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 78,526.25 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.82 పాయింట్ల లాభంతో 78,205.98 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 233.55 పాయింట్ల లాభంతో 24,261.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.83గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.36 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5,176.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు**

దేశీయ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి చమురు సెగతో నిన్న భారీ నష్టాలను చవిచూసిన సూచీలు.. నేటి ట్రేడింగ్‌లో కోలుకున్నాయి. ఇంధన ధరలను నియంత్రించే చర్యల్లో భాగంగా చమురుపై ఉన్న కొన్ని రకాల ఆంక్షలను తొలగించనున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అలాగే యుద్ధం ముగింపు గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు, కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. దాంతో ప్రీఓపెనింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 800 పాయింట్లు మేర ఎగబాకింది.ఉదయం 9.38 గంటల సమయంలో సెన్సెక్స్ 322 పాయింట్ల లాభంతో 77,888 వద్ద ఉండగా.. నిఫ్టీ 91 పాయింట్లు పుంజుకొని, 24,119 వద్ద ట్రేడవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.93గా ఉంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, రిలయన్స్, ఇన్ఫోసిస్, హిందాల్కో, టెక్ మహీంద్రా స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి.బ్రెంట్ క్రూడ్ సోమవారం ఒక బ్యారెల్‌కు 119 డాలర్ల వరకు పెరగ్గా.. తాజాగా 89 డాలర్లకు పడిపోయింది. చమురు ధరలు తగ్గడంతో ఇండిగో, స్పైస్‌జెట్ షేర్లు 8 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఆసియా మార్కెట్లు కూడా లాభాల్లోనే ట్రేడవుతున్నాయి. ఇదిలాఉంటే.. ఈ అస్థిర పరిస్థితుల్లో మదుపరులు ప్రశాంతంగా ఉండాలని, దేశ ఆర్థిక వ్యవస్థకున్న బలమైన పునాదులు మార్కెట్ ఊగిసలాటలను ఎదుర్కోవడంలో సహకరిస్తాయని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు.


## 9200 ఎంఏహెచ్‌తో బ్యాటరీతో షావోమీ కొత్త ప్యాడ్ 8

**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ షావోమీ దేశీయ మార్కెట్‌లోకి కొత్త ప్యాడ్‌ను లాంచ్ చేసింది. 9200ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ప్యాడ్ 8 ను విడుదల చేసింది. 11.2 అంగుళాల 3.2ఐ ఎల్‌సీడీ డిస్‌ప్లే అమర్చారు. 144ఊళి రిఫ్రెష్ రేట్‌తో పనిచేస్తుంది. 800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. డాల్బీ డిస్‌ప్లే విజన్, హెచ్‌డీఆర్10, డీసీఐ-పీ3కు సపోర్టు చేస్తుంది. గ్రాఫైట్ గ్రే, టైటానియం బ్లూ రంగుల్లో లభిస్తుంది. 45చి టర్బో ఛార్జింగ్‌తో వస్తోంది. షావోమీ ఫోకస్ పెన్ ప్రో, కీబోర్డును అనుసంధానం చేసుకునే వెసులుబాటుతో ఈ ప్యాడ్‌ను తీసుకురావడం విశేషం.షావోమీ ప్యాడ్ 8కు వెనకవైపు 13ఓఖ ప్రధాన కెమెరా, 8ఓఖ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ప్రాసెసర్ అమర్చారు. ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3తో పనిచేస్తుంది. దీని బరువు 485 గ్రాములు. ఈ ప్యాడ్ 5.75ఎఎ థిక్‌నెస్ కలిగిఉంది. మెటల్ బాడీ, మెటల్ ఫ్రేమ్‌ను ఇచ్చారు. సైడ్ ఫింగర్ ప్రింట్ మౌంట్ అమర్చారు. 6.0 బ్లూటూత్ వెర్షన్‌తో పనిచేస్తుంది. ఇక ధర విషయానికొస్తే.. ఈ ప్యాడ్‌ను మూడు వేరియంట్లలో తీసుకొచ్చారు. 8జీబీ +128 జీబీ ధర రూ.33,999, 12ఉః + 256ఉః ధర రూ.35,999గా నిర్ణయించారు. దీంతో స్టోరేజీతో నానో టెక్చ్సర్ డిస్‌ప్లే వేరియంట్ ధరను రూ.38,999గా కంపెనీ నిర్ణయించింది. దీంతోపాటు క్రియేటర్ ఎడిషన్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధరను ?41,999గా నిర్ణయించింది. ఇదే మోడల్ నానో టెక్చ్సర్ డిస్‌ప్లే ధరను రూ.43,999గా పేర్కొంది. మార్చి17 నుంచి అమెజాన్, షావోమీ వెబ్‌పోర్టల్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఎస్‌బీఐ బ్యాంకు కార్డులతో కొనుగోలు చేసేవారికి రూ.3 వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. మార్చి 17 నుంచి 31వ తేదీల మధ్య కొనుగోలు చేసేవారికి ఏడాది పాటు అదనపు వారెంటీ ఇస్తామని కంపెనీ పేర్కొంది.ప్యాడ్ 8తో పాటు కవర్ కూడా కొనుగోలు చేయాలంటే రూ.1499 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాడ్8 కీబోర్డు ధర రూ.4,999, షావోమీ ఫోకస్ పెన్ ప్రో ధరను రూ.5,999గా నిర్ణయించారు. ప్యాడ్ 8 ఫోకస్ కీబోర్డు ధరను రూ.8,999గా కంపెనీ పేర్కొంది. ఈ యాక్సెసరీలు సైతం మార్చి 17 నుంచి లభ్యమవుతాయి.

## ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా

**న్యూఢిల్లీ:**ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా తాత్కాలికంగా ఆ బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్త సీఈవో నియమితులయ్యేవరకు ఆయన ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. కొత్త సీఈవో ఎవరనేది త్వరలోనే ప్రకటన చేస్తామని కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాది డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మూడు నెలల తర్వాత ఇండిగో సీఈవో నుంచి రాజీనామా ప్రకటన రావడం గమనార్హం.






# చైనా ఎఫ్‌డీఐలకు పచ్చజెండా

### కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్!



**న్యూఢిల్లీ:**భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చైనా సహా మిగిలిన అన్ని దేశాల ఎఫ్‌డీఐల విషయంలో ఉన్ననిబం ధనలను సరళతరం చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృ త్వంలో మంగళవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమా వేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి.గల్వాన్ లోయలో 2020లో భారత్- చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ కారణంగా ఆ దేశంతో సంబంధాలు క్షీణించాయి. దీంతో టిక్ టాక్, వియ్‌చాట్ వంటి 200 యాప్‌లను భారత్ నిషేధించింది. ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలనూ భారత్ తిరస్కరించింది. ఆ దేశం నుంచి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలనూ కఠినతరం చేసింది. ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని 2020లో ప్రెస్ నోట్ 3ని ప్రభుత్వం జారీ చేసింది. భారత్‌తో సరిహద్దులను పంచుకునే దేశాలన్నింటికీ ఈ ప్రెస్ నోట్ 3 వర్తిస్తుందని తెలిపింది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ లాంటి దేశాలు ఇందులో ఉన్నాయి.ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే చైనా ఎఫ్‌డీఐల అంశం ప్రస్తావనకు వచ్చింది. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చైనా పెట్టుబడుల గురించి ప్రస్తావన ఉంది. చైనా ఎఫ్‌డీఐలతో దేశీయంగా తయారీని పెంచవచ్చని, తద్వారా ఇక్కడి నుంచి విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చని పేర్కొంది. అమెరికా, యూరప్‌లు చైనాకు ప్రత్యామ్నాయాన్ని చూస్తున్న వేళ.. ఆ ప్రయోజనాన్ని పొందొచ్చని పేర్కొంది. చైనా పెట్టుబడులను ఆహ్వానించి ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడం మెరుగైన ఆలోచనగా సర్వే అభిప్రాయపడింది. కాబట్టి చైనా ఎఫ్‌డీఐలను ప్రోత్సహించాలని పేర్కొంది. నిబంధనలు కఠినం కావడంతో చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ మధ్య చైనా నుంచి కేవలం 2.51 బిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. దేశంలోకి వచ్చే మొత్తం ఎఫ్‌డీఐల్లో చైనా 23వ స్థానంలో ఉంది.

## ప్రాథమిక ఖాతాలకు కనీస నిల్వ అక్కర్లేదు

**జరిమానాలు ఉండవు:ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ:**ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) కింద ప్రారంభించిన ఖాతాలతో సహా, సుమారు 72 కోట్ల ప్రాథమిక పొదుపు డిపాజిట్ ఖాతాలకు కనీస నిల్వ నిబంధన లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కనీస నిల్వ పాటించకపోయినా, వీటికి జరిమానా ఉండబోదని సోమవారం లోక్‌సభకు లిఖిత పూర్వకంగా వెల్లడించారు. అందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే బ్యాంకులు సున్నా-నిల్వ ఖాతా సౌకర్యాన్ని అందిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. డిపాజిట్, నగదు ఉపసంహరణ, ఏటీఎం సేవలకూ ఛార్జీలు ఉండవని వివరించారు.బ్యాంకులు తమ బోర్డు అనుమతించిన విధానాలకు, ఆర్‌బీఐ మార్గదర్శకాలకు లోబడి.. ఇతర సాధారణ ఖాతాదార్లు కనీస నిల్వ నిర్వహించకపోతే రుసుములు వసూలు చేసేందుకు వీలుందని మంత్రి తెలిపారు. ఆయా సేవలు అందించేందుకు అయ్యే ఖర్చుల ఆధారంగా హేతుబద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ బ్యాంకులు కనీస నిల్వలు లేని పొదుపు, కరెంటు ఖాతాదారుల నుంచి రూ.8,092.83 కోట్లను రుసుములుగా వసూలు చేశాయి. ఈ మొత్తం ఆ బ్యాంకుల ఆదాయంలో 0.23 శాతమేనని మంత్రి తెలిపారు. బ్యాంకులు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి కాకుండా, వ్యయం తట్టుకోవడానికే ఈ రుసుములు వసూలు చేస్తున్నాయని వివరించారు.

కొత్త బాండ్ల జారీ

రాబోయే చెల్లింపుల ఒత్తిడిని తగ్గించుకునేందుకు కేంద్రం, ఆర్‌బీఐ నిర్వహించిన స్విచ్ వేలం ద్వారా రూ.6,309 కోట్ల ప్రభుత్వ సెక్యూరిటీలను తిరిగి కొనుగోలు చేసింది. వీటికి బదులుగా రూ.6,431.79 కోట్ల విలువైన దీర్ఘకాలిక బాండ్లను జారీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.5.47 లక్షల కోట్ల బాండ్ల గడువు ముగియనుండటంతో రుణాల నిర్వహణను సమర్థంగా నిర్వహించేందుకు ఈ విధానాన్ని వాడుతోంది. ఇందులో భాగంగా 2026, 2027లో గడువు ముగిసే బాండ్లను వెనక్కి తీసుకుని, 2033, 2039, 2062 గడువుల్లో ఉండే కొత్త బాండ్లను జారీ చేసింది. ఫిబ్రవరి నుంచి ఇది నాలుగో స్విచ్ వేలం కాగా, గత మూడు వేలాల్లో రూ.98,591.70 కోట్ల బాండ్లను ఆర్‌బీఐ కొనుగోలు చేసింది.

బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.50,000 కోట్లు : ఆర్‌బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకింగ్ వ్యవస్థలోకి సోమవారం రూ.50,000 కోట్లు విడుదల చేసింది. ముందస్తు పన్ను, వస్తు సేవల పన్ను చెల్లింపుల నేపథ్యంలో ఈ నెలాఖరులో బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి భారీగా నగదు బయటకు వెళ్లే ఆస్కారం ఉంది. దీన్ని ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ ముందుగానే ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.2.41- 3.02 లక్షల కోట్ల వరకు మిగులు ఉన్నట్లు అంచనా. ఆర్‌బీఐ కొనుగోలు చేసిన ప్రభుత్వ సెక్యూరిటీల్లో పలు రకాల బాండ్లు ఉన్నాయి. వీటిలో 6.33 - 6.19% వడ్డీ ఉన్నవి ఉన్నాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, 2026లో ఇప్పటివరకూ ఆర్‌బీఐ రూ.2.50 లక్షల కోట్లను బ్యాంకింగ్ వ్యవస్థలోకి చొప్పించింది.

## విమానయాన సంస్థలపై డీజీసీఏ పర్యవేక్షణ పెంపు



**న్యూఢిల్లీ:**విమానయాన సంస్థలు నిబంధనలను పాటిస్తున్నాయని నిర్ధారించడానికి, కీలకమైన కార్యకలాపాలపై వారం, 15 రోజులకోసారి పర్యవేక్షణ పెంచినట్లు పౌరవిమానయాన శాఖ తెలిపింది. రోస్టర్ పనితీరు, సిబ్బంది లభ్యత, బఫర్‌పై స్పష్టత, ఫ్లయిట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) పర్యవేక్షణకు ప్రతి రెండు నెలలకు ఒకసారి విమానయాన సంస్థల కార్యాలయాలను డీజీసీఏ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేస్తున్నట్లు వివరించింది. 2025 డిసెంబరులో ఇండిగో విమానసేవల్లో తలెత్తిన అంతరాయాలకు కారణాలు, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలపై రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మురళీధర్ మోహోల్ సమాధానమిచ్చారు. కార్యకలాపాలకు ఉన్న వనరులను ఎక్కువగా వినియోగించడం, నిబంధనల అమలుకు తగినంత సన్నద్ధత లేకపోవడం, సిస్టమ్ సాఫ్ట్‌వేర్ సపోర్ట్‌లో లోపాలు, యాజమాన్య వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వంటివి ఇండిగో అంతరాయాలకు ప్రాథమిక కారణాలని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటీకరణ తర్వాత ఎయిరిండియా సిబ్బంది తీరు మెరుగైందని పౌరవిమానయాన శాఖ సోమవారం రాజ్యసభకు తెలిపింది.


## ఉద్రిక్తతల వేళ దుబాయ్‌లో భారత వ్యాపారుల మానవత్వం

న్యూఢిల్లీ:ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య ఘర్షణలతో పలువురు భారతీయులు పశ్చిమాసియా దేశాల్లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఇలాంటి క్లిష్ట సమయంలో దుబాయ్‌లో చిక్కుకొన్న వారికి సహాయం చేసేందుకు భారత సంతతి వ్యాపారవేత్త యోగేశ్ దోషి ముందుకువచ్చారు. 64 నివాసాలు ఉన్న తన అపార్ట్‌మెంట్‌లో వసతి కల్పిస్తున్నారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ఘర్షణల కారణంగా విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. దాంతో యూఏఈ నుంచి స్వదేశానికి రావాల్సిన పలువురు భారతీయులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తనవంతు సహాయం చేయాలని అల్ మిజన్ గ్రూప్ ఛైర్మన్ యోగేశ్ దోషి భావించారు. ఇండియన్ పీపుల్స్ ఫోరమ్ యూఏఈ, దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా సమన్వయంతో తన అపార్ట్‌మెంట్‌లో తాత్కాలిక షెల్టర్‌ను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 125 మందికి ఉచితంగా వసతి కల్పించారు. వారికి ఆహారం వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.తాము ఇప్పటికే బుక్ చేసుకున్న హోటళ్లలో ఉండేందుకు గడువు ముగిసిందని, పొడిగింపు వీలుకాని క్లిష్ట సమయంలో తమకు ఈ సహాయం అందిందని పలువురు మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. "హోటల్ బస ముగియడంతో మేం ఖాళీ చేయాల్సివచ్చింది. స్వదేశానికి తిరిగి రావడానికి మార్గం లేదు. అలాంటి గందరగోళ పరిస్థితిలో ఈ అపార్ట్‌మెంట్ గురించి తెలిసింది. ఆ ఏర్పాటు మాకెంతో ఊరటనిచ్చింది" అని తెలిపారు.యోగేశ్‌తో పాటు ఆ దేశంలో



స్థిరపడిన పలువురు భారత సంతతి వ్యక్తులు ఈ ఉద్రిక్త సమయంలో తమ స్నేహహస్తం అందిస్తున్నారు. దుబాయ్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న అజ్మన్‌లో వ్యాపారవేత్త ధీరజ్‌జైన్ ఇలాంటి వసతులే ఏర్పాటుచేశారు. వెంటనే స్వదేశానికి వెళ్లలేనివారి కోసం తన ఫామ్‌హౌస్‌లో తాత్కాలిక వసతి కల్పించారు. ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న వారికి ఉచితంగా ఈ సౌకర్యం అందిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని ఈ షెల్టర్ వద్దకు తీసుకురావడానికి రోల్స్ రాయిస్ సహా 11 కార్లను నడుపుతుండటం విశేషం.

## దేశ ఆర్థిక ప్రగతికి మహిళా శక్తే ప్రాణం



**హైదరాబాద్:** 'మన దేశాన్ని సంపన్న దేశంగా మార్చేందుకు నిర్దేశించుకున్న గడువు (2047)కు మరో 21 ఏళ్ల వ్యవధి మాత్రమే ఉంది. సంతానోత్పత్తి రేటు వేగంగా పడిపోతున్న నేపథ్యంలో.. భారత్ వృద్ధాప్య దేశంగా మారకముందే ఈ లక్ష్యాన్ని సాధించాలి. వికసిత్ భారత్ కోసం దశాబ్దాల పాటు 7% ఆర్థిక వృద్ధి నమోదు చేయాలంటే, వేతనంతో కూడిన పనుల్లో మొత్తం ఉద్యోగుల భాగస్వామ్యం ప్రస్తుత 47% నుంచి 60 శాతానికి పెరగాలి. ఈ క్రమంలో మహిళా శ్రామిక శక్తి పెరగడం దేశానికి అత్యంత అవసరం' అని 'ది మిస్సింగ్ హాఫ్: వుమెన్ అండ్ ఇండియాస్ గ్రోత్ ఛాలెంజ్' పేరిట విడుదల చేసిన నివేదికలో యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది.జీ 20 దేశాలతో పోలిస్తే.. అట్టడుగున: జీ-20 దేశాలతో పోలిస్తే, మహిళల భాగస్వామ్యంలో భారత్ అట్టడుగున ఉందని నివేదిక తెలిపింది. ప్రస్తుతం పనిచేస్తున్న మహిళలల్లో సగానికి పైగా (61%) ఉత్పాదకత తక్కువగా ఉండే, వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. వేతనం పొందుతున్న మహిళల్లోనూ 60% మందికి సామాజిక భద్రత, కాంట్రాక్టులు లేని అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. ఎలాంటి ఆర్థిక గుర్తింపు లేని ఇంటి పనులు, సంరక్షణ బాధ్యతలకే భారతీయ మహిళలు రోజులో 20% సమయాన్ని కేటాయిస్తున్నారని నివేదిక వివరించింది.

చదువుకున్న వారూ ఉద్యోగాలకు దూరం: చదువుకున్న మహిళల్లో అత్యధికులు ఉద్యోగం చేయకపోవడం దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద లోటుగా నివేదిక పేర్కొంది. ప్రస్తుతం 12.5 కోట్లకు పైగా విద్యావంతులైన మహిళలు ఉద్యోగాలకు దూరంగా ఉన్నారు. వీరిలో 60% మంది డిగ్రీలు పూర్తి చేసుకున్నవారే. వివాహం తర్వాత ఉద్యోగాలు వదిలేస్తున్న వారి సంఖ్య 20%, పిల్లలు పుట్టిన తర్వాత ఉద్యోగాలకు దూరమవుతున్న వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోందని నివేదిక పేర్కొంది. భద్రత, ప్రయాణ సదుపాయాలు లేకపోవడం.. ఉద్యోగాల్లోకి మహిళలు రాకపోవడానికి ప్రధాన కారణాలని, సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 61% మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలా చేస్తేనే..: మహిళలకు పనివేళల్లో వెసులుబాట్లు కల్పిస్తే, ఉద్యోగాలు చేసే వారి సంఖ్య పెరుగుతుందని నివేదిక వివరించింది. కెరీర్ మధ్యలో అంతరాయం వచ్చిన వారు కూడా సులభంగా విధుల్లో చేరేందుకు వీలుగా నిబంధనలు సడలించాలని సూచించింది. మహిళల ఉద్యోగాలపై ఉన్న పాత చట్టపరమైన ఆంక్షలను (రాత్రి విధులు, ఫ్యాక్టరీ పనులు) పూర్తిగా తొలగించాలని నివేదిక వెల్లడించింది.

# రాయికల్ పట్టణంలో కలెక్టర్ పర్యటన

- పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి
- ఇటిక్యాలలో నిర్మాణ పనుల తనిఖీ



**రాయికల్, మార్చి 10 (జనంసాక్షి ) :** జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం రాయికల్ మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాలు, ప్రజా ప్రదేశాల్లో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని ఇటిక్యాల గ్రామాన్ని సందర్శించిన ఆయన అక్కడ నిర్మాణ దశలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్, అంగన్‌వాడి కేంద్రం, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల భవనాల పనులను పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు త్వరితగతిన ఆరోగ్య, విద్యా సేవలు అందుబాటు లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, పోషకాహార సేవలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమయపాలనతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె.రాము, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ చిరంజీవి, మున్సిపల్ చైర్మన్ కట్కం రవి, ఇటిక్యాల సర్పంచ్ నీరటి శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆచన్‌పల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీస్ కమిషనర్






**బోధన్, మార్చి 10 (జనంసాక్షి) :** బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లిలో అప్నా ఫంక్షన్ హాల్ లో మంగళవారం ముఫ్తి అతిక్ హైమద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మౌలానా సయ్యద్ అబ్దుల్ బాకీ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా, మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని, పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.

అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి బోధన్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎసిపి శ్రీనివాస్, సీఐలు వెంకటనారాయణ, విజయబాబు, ఎస్సైలు మచ్చేందర్ రెడ్డి, భాస్కరాచారి, మనోజ్, మహేష్, హబీబ్, మజీద్ కమిటీ సభ్యులు ఎంఐఎం ప్రెసిడెంట్ మీర్ ఇలియాస్ అలీ, కౌన్సిలర్ మునిషీర్ బాబా అడ్వకేట్ అబ్బీద్ సుఫి, కౌన్సిలర్ మీరు గౌస్, ఆసిఫ్ సుల్తాన్ మోల్ సాబ్, మహమ్మద్ ఇమ్రాన్ హుస్సేన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఐడిహెచ్ కాలనీలో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలి

- అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఆదేశం
- కాలనీలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



**హైదరాబాద్, మార్చి 10 :** ఐడిహెచ్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మంగళవారం సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఐడిహెచ్ డబుల్ బెడ్‌రూం కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హౌసింగ్ ఎండీ గౌతమ్ ఆయనతో కలిసి పర్యటించారు. పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకుల ఇళ్లను కమిషనర్ కలెక్టర్, హౌసింగ్ ఎండి తో కలిసి పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పిల్లల సంఖ్య ఎక్కువగా పెంచాలని, కేంద్రంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాత వస్తువులను తొలగించాలని అలాగే పిల్లలకు సమయానికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పరిశీలన చేసి రోజువారీ బయోమెడికల్ వ్యర్థాలను వేరుగా చేపట్టాలని, పాత సామగ్రిని సత్వరమే తొలగించి ఆసుపత్రితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మెడికల్ అధికారికి సూచించారు. కాలనీని కలియతిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నివాసముంటున్న ప్రజలకు సూచించారు. కాలనీలో ఉన్న రెండు ఖాళీ స్థలాల్లో పిల్లల పార్కులను అభివృద్ధి చేయాలని సికింద్రాబాద్ జోనల్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి , హౌసింగ్ ఎండి గౌతమ్ తో కలసి మారేడుపల్లి అంబేద్కర్ కాలనీలో పేదల ఇళ్లను పరిశీలించి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే నివాసం ఉంటున్న కుటుంబాలు అక్కడ సమస్యలను కలెక్టర్ వివరించారు. ఈ ప్రాంత అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే అవకాశాలపై పరిశీలిస్తుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆర్. పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ పాండు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ప్రధానిని కలిసిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, (జనంసాక్షి):** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రయ మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని మర్యాదపూర్వకంగా కలిశారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ గా పదవీ విరమణ చేసిన అనంతరం మొదటిసారి ప్రధాన మంత్రి ని కలిసిన దత్తాత్రేయ. ఈ సందర్భంగా తనకు మోదీ మొదటి క్యాబినెట్‌లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, అనంతరం హిమాచల్ ప్రదేశ్, హర్యానా రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం కల్పించిన ందుకు ప్రధాన మంత్రి మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ తన ఆత్మకథ "ప్రజల కథే నా ఆత్మకథ" పుస్తకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అందజేశారు. ఈ పుస్తకం ఎంతో మందికి ప్రేరణనిచ్చే విధంగా ఉందని మోదీ అభినందిం చారని దత్తాత్రేయ తెలిపారు. సమావేశం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దత్తాత్రేయని ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. స్పందించిన బండారు దత్తాత్రయ తాను ఆరోగ్యంగా ఉన్నానని, దాదాపు అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నానని తెలిపారు. ప్రధాన మంత్రి ప్రతిస్పందిస్తూ చాలా సంతోషమని, ఇదే ఉత్సాహంతో ప్రజా జీవితంలో కొనసాగాలని సూచించినట్లు దత్తాత్రేయ ప్రకటన ద్వారా తెలిపారు.

# ఓసిపి5లో 100% బొగ్గు ఉత్పత్తి

- 20 రోజుల ముందుగానే రికార్డు నెలకొల్పిన ఉద్యోగులు..
- సింగరేణి ఆర్‌జీ1 జీఎం లలిత్ కుమార్

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ1 ఏరియా ఓసి5 ప్రాజెక్ట్‌లో 2025-26 వార్షిక రవాణ లక్ష్య సాధనలో కేటాయించిన 32 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 32 లక్షల 7 వేల టన్నుల బొగ్గు రవాణా చేసి 100 శాతం బొగ్గు రవాణా సాధించి నారు. ఈ రికార్డును 20 రోజుల ముందుగానే నెలకొల్పిన సందర్భంగా అర్జీ.1 జియం డీ.లలిత్ కుమార్ జిడికే ఓసి.5 ప్రాజెక్ట్ ఉద్యోగులను, మహిళా ఉద్యోగులను, కాంట్రాక్టు కార్మికులను, సూపర్వైజర్లను, అధికారులను, యూనియన్ ప్రతినిధులను అభినందించి నారు. ఈ అద్భుత విజయాలు ఆర్‌జి.1 ఏరియాకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయ ని తెలిపారు. ఇదే విధంగా ఈ ఆర్థిక సంవత్సా రానికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను కూడా ఇదే స్ఫూర్తితో అధిగమించాలని జియం తెలిపారు.




# జీహెచ్ ఎంసీ కాంపౌండ్‌నే పునాదిగా కబ్జా

## చందానగర్‌లో 400ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, మార్చి 10:** శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురౌతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. ఆ ప్రహరీనే పునాదులుగా చేసి ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. జీహెచ్ ఎంసీ అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లేఔట్ ప్రకారం పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఈ మేరకు ఆక్రమణలు తొలగించి 400ల గజాల స్థలంచుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగాపేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటుచేసింది. దీని విలువ రూ. 2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కును కాపాడిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

# మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**యైటింక్లయిన్ కాలనీ మార్చి 10 (జనంసాక్షి):** నగర కార్పోరేషన్ పరిధిలోని 15వ డివిజన్ కుమారస్వామినగర్‌లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాస్ సింగ్ ప్రారంభించారు. 15వ డివిజన్ కుమారస్వామినగర్‌లో ప్రభుత్వం 50లక్షల రూపాయలతో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్‌ను రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ లతో కలిసి కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ప్రభుత్వ సంకల్పంలో భాగంగా 50 లక్షల రూపాయలు వెచ్చించి ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతవాసులకు ప్రతీ రోజు స్వచ్ఛమైన నీరు ప్రతీ ఇంట్లో వారు పట్టుకోవచ్చని ఇకపై నీళ్లకోసం ఎవరూ రోడ్డు ఎక్కాల్సిన పని లేదన్నారు. అంతే కాకుండా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఈ డివిజన్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా పూర్తి స్థాయిలో పరిష్కరించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు పూర్తి చేస్తామని, అదేవిదంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్లు మారెల్లి సుశీలరాజిరెడ్డి, బుర్రశశికళ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండేటి రాజేష్, మైనారిటీ మండల అధ్యక్షులు మాషూక్ రబ్బానీ, రంగు రవి, బొంత తిరుపతి, షాబీర్, కనుకుంట్ల రాజేష్, దువ్వ శ్రీనివాస్, నవీన్, సదానందం, షేక్, ఫెరోజ్, బూడిద సమ్మయ్య, మేకల సురేష్, అధికారులు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డిఆర్డిఓ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం

## మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్



**కరీంనగర్, మార్చి 10 (జనంసాక్షి ) :** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం రోజు కరీంనగర్ డిఆర్డిఓ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డిఆర్డిఓ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి నిపుణులైన వైద్యులు సేవలందించారు. సాధారణ ఆరోగ్య సమస్యలపై సమగ్రంగా పరిశీలించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి కీలక పరీక్షలు నిర్వహించి తక్షణ నిర్ధారణ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... డిఆర్డి ఓ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ అధికారులు శ్రీధర్, లింగమూర్తి, ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, జనరల్ సర్జన్ డాక్టర్ తాహా, గైనకాలజిస్ట్ డాక్టర్ నయన, డైటిసియన్ మమత, ఫిజియోథెరపిస్ట్ అనిల్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రైతాంగానికి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



**హుజురాబాద్, మార్చి 10 (జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్తూ అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందుతుందని రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. అన్నదాతల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14 ఐకాస, రైతు ప్రజా సంఘాల నాయకుడు ముచ్చా సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో హుజురాబాద్ అంబేద్కర్ కూడలి వద్ద చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్ష ను విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం హుజురాబాద్ లో జరిగిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ... రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని , ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని అన్నారు.రైతుల పంటలపై ప్రస్తుతం అమలు జరుగుతున్న గిట్టు బాటు ధరలు అన్న దాతలకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేనే లేవని రైతులు పండించిన పంటలకు రైతులే గిట్టుబాటు ధరలను నిర్ణయించుకునే అవకాశం కల్పించే విధంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకు రావాలని. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత పెరుగుతోందని, ఖర్చులు బాగా పెరిగి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల వ్యవసాయరంగానికి చేయూత నిచేందుకు, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడం తో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చెయ్యాలంటే జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని తక్షణమే అనుసంధానం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుమిత్ర ప్రజా సంఘాల అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డి, కార్యదర్శి పసుల స్వామి, ఓసి ఐకాస రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి, పోరెడ్డి కిషన్ రెడ్డి, కొనిశెట్టి మునీందర్, కంకణాల సరోజన జనార్ధన్ రెడ్డి, కొన్నే సమ్మిరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ సర్కిల్‌లో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

**బోడుప్పల్-జనంసాక్షి :** గ్రేటర్ హైదరాబాద్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారి ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఉన్న మజీద్ హీకుతాబ్ షాహీ అలంగీరి వద్ద మరియు చెంగిచర్ల మజీద్ ఈ బిల్లాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం సోదరులకు రంజాన్ "తోఫా" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబ్రుద్దీన్ బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ ప్రధాన కరదర్శి కొత్త కిషోర్ గౌడ్, అలియాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి,కొత్త ప్రభాకర్ గౌడ్,విశ్వం గుప్త,మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్,బింగి జంగయ్య యాదవ్,బొమ్మకు కళ్యాణ్, సీసా వెంకటేష్ గౌడ్,సింగిరెడ్డి పద్మారెడ్డి, చీరాల నరసింహ, సుమన్ పాల్గొన్నారు.

# భర్త మరణం తట్టుకోలేక.. భార్య ఆత్మహత్య

- ఒకే రోజు భార్య, భర్తల మృతి
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

**వీణవంక మార్చి 10 (జనం సాక్షి) :** వీణవంక యాభైఏండ్లుగా కలిసి జీవితాన్ని పంచుకున్న భార్య..భర్త మరణాన్ని తట్టుకోలేక కొద్ది సేపటికే ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో విషాదం నింపింది. ఎస్ఐ ఆవుల తిరుపతి,గ్రామస్థుల కథనం ప్రకారం మామిడాలపల్లి కి చెందిన కొమురవెల్లి పద్మ (68),శంకరయ్య (70) భార్యభర్తలు వీరికో కొడుకు సతీష్,కూతురు స్వప్న ఉండగా వీరిద్దరికీ వివాహాలై కరీంనగర్‌లో స్థిరపడ్డారు. శంకరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. గమనించిన పద్మ భర్త మరణాన్ని తట్టు కోలేక నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో నుండి పొగరావడం గమనించిన స్థానికులు వెళ్ళి చూసే సరికి పద్మ-శంకరయ్య దంపతులు మృతిచెంది ఉన్నారు. భార్యభర్తలు ఇద్దరు ఒకే రోజు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవగా, గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మంగళవారం కుటుంబ సభ్యుల అశ్రు నాయాల మధ్య పద్మ-శంకరయ్య అంత్యక్రియలు జరిగాయి కొడుకు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

# బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

## 57 ఆటోలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘి ంచే వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా ఆటోలపై దృష్టి సారించిన పోలీసులు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించారు. ఈ క్రమంలో, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, టాప్ నంబర్లు ప్రదర్శించకపోవడం, వాహన ధ్రువ పత్రాలు లేనివి, నెంబర్ ప్లేట్లు సరిగ్గా లేని 57 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు, డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అన్ని రకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రిజర్వు ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ఎస్సై ప్రమోద్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

- మండల స్థాయిలో ప్రభుత్వ భవన నిర్మాణ లక్ష్యాన్ని నిర్దేశించాలి
- ఎన్ఆర్ఈజీఎస్ పనులపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష





**కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమం ద్వారా మంజూరైన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై డిఆర్డిఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్‌ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమం ద్వారా మంజూరైన గ్రామపంచాయతీ, అంగన్వాడి, పాఠశాల, ఇతర భవనాల నిర్మాణంలో వేగం పెంచాలని అన్నారు. ఇంకా ప్రారంభం కానీ పనులపై ఎంపీడీవోలు, తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. స్థలం కొరత ఉన్న గ్రామాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సందర్శించి అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, ఏఈ, డిఈ, ఎంపీడీవోలు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణాల వేగవంతానికి, అక్కడ ఎదురయ్యే సమస్యల పరిష్కరించాలని తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్లాబ్, రూఫ్ లెవెల్ కు చేరుకున్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజాపాలన కార్యక్రమంలో ప్రారంభించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్డి ఓ శ్రీధర్, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, ఎంపీడీవోలు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే సత్యం, ఇంచార్జి ప్రణవ్ స్పష్టం
- అట్టహాసంగా మున్సిపల్ చైర్మెన్ పదవి స్వీకరణ
- దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ జెండా ఎగరవేత.. భారీ ర్యాలీ



**హుజూరాబాద్, మార్చి 10 (జనం సాక్షి):** హుజూరాబాద్ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఈ ప్రాంత అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ మున్సిపల్ చైర్మెన్ సుహాసిని పదవి బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమానికి మంత్రి పొన్నం, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా హుజూరాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మార్గ మధ్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు రాజేశ్వర్ రావు, జగ్ జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి హుజూరాబాద్ ప్రాంతంతో మంచి సంబంధాలు కలిగిన తాను ఈ ప్రాంతానికి పెద్దన్న పాత్ర పోషించాలని, ఎంపీగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని గుర్తుచేశారు. హుస్నాబాద్, హుజూరాబాద్‌లను రెండు కళ్లలా చూస్తూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. డిసీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హయంలో హుజూరాబాద్ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేశామని నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్‌లో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సొంతం చేసుకుంటుందని, నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.
మంత్రి పొన్నం మాట్లాడుతూ హుజూరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తారని తన మాటగా ప్రత్యేకంగా చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం 300 కోట్ల ప్రతిపాదనలు ఇచ్చామని, ఎంపీ సహకారంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం దోహదం చేస్తోందని, సీఎం రేవంత్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నామన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, పర్యావరణం పచ్చదనంగా ఉంటేనే మానవ మనుగడ బాగుంటుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలంతా అన్ని రకాల టెస్టులు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సయ్యద్, మున్సిపల్ అధికారులు, 30 వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

# చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకం

- రంగవల్లి విజ్ఞాన కేంద్రంలో మహిళా సామాజిక సదస్సు
- మహిళల పోరాట దినోత్సవం.. శ్రామిక మహిళల దీర్ఘకాలిక సంఘర్షణ గుర్తుచేసిన వక్తలు
- సమానత్వం, స్వేచ్ఛ కోసం నిరంతర పోరాటమే మార్గమని సందేశం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 10 (జనం సాక్షి):** సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా రంగవల్లి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం మహిళల సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం కోసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళా దినోత్సవం అంటే కేవలం ఒక రోజు కాదని, అది చారిత్రక పోరాట పథమని, శ్రామిక మహిళలు 8 గంటల పనిదినం కోసం క్లారా జెట్కిన్ తదితర మహిళా పోరాటకారుల ఆధ్వర్యంలో చికాగో, యూరప్‌లో ఎన్నో ఉద్యమాలు చేసి సాధించిన దీర్ఘకాలిక పోరాట ఫలితమని పేర్కొన్నారు. అందుకే మార్చి 8ని అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా గుర్తిస్తారన్నారు.
బానిసత్వం నుంచి అర్ధ బానిసత్వం, అర్ధ బానిసత్వం నుంచి కొన్ని ఉపశమన హక్కులు, వివక్ష, అసమానత్వం నుంచి సమానత్వం వైపు, అక్కడి నుంచి పూర్తి స్వేచ్ఛ వైపు పురోగమించే క్రమమంతా ఒక నిరంతర పోరాటమేనని వివరించారు. ఆధిపత్యం వివిధ రూపాల్లో మహిళలపై కొనసాగుతున్న వివిధ దశల్లో తామెక్కడున్నదో మహిళలు గుర్తించి, దాన్నుంచి బయటపడటం కోసం నిరంతర పోరాటం చేయాల్సిందేనన్నారు. యూరప్‌లో శతాబ్దాలుగా 16 గంటల వెట్టిచాకిరీ నుంచి 12 గంటలు, 10 గంటలు, చివరకు 8 గంటల పనిదినం సాధించిన చైతన్య దీప్తి విశ్రమించలేదని, మనం అనుభవిస్తున్న 8 గంటల పనిదినం శ్రామిక మహిళల భిక్షే అని వివరించారు. కార్మిక లోకానికి సుదీర్ఘ పనిగంటల నుంచి 8 గంటల పనిదినాన్ని ప్రసాదించిన విముక్తి ప్రదాతలు శ్రామిక మహిళామణులే కావడంతో మార్చి 8ని అంతర్జాతీయంగా మహిళలు, పురుషులకు సుదీర్ఘ పనిగంటల నుంచి ఉపశమనం కల్పించిన పోరాటానికి ప్రతీకగా గుర్తిస్తారన్నారు.
ఈ దేశంలో అవిశ్రాంత శ్రామికులు మహిళ తల్లులేనని, సమాజపు కుల చట్రంలో, కుటుంబ సంసారపు చట్రంలో వారిని అట్టడుగుకు నెట్టేశారని, మత నియమాలు, కుల కట్టుబాట్ల వల్ల కట్టుబానిసత్వం తమ జన్మహక్కుగా మానసికంగా నమ్మించుకునే స్థితికి మహిళలు అలవాటు పడ్డారన్నారు. ఆకాశంలో సకల అవకాశాల్లో సగం అందుకోవాల్సిన మహిళలు మత మౌఢ్యం, కులోన్మాదం, పితృస్వామిక, పురుషాధిపత్య భావజాలాల చట్రంలో చిక్కుకుని అణిచివేత యంత్రాంగానికి పనిముట్లవుతున్నారని వివరించారు. సాంప్రదాయక సంకెళ్లలో మగ్గుతూ, అణిచివేతకు గురవుతూ కూడా ఆడబ్రతుకును జీవన సాఫల్యంగా తలవడం జరుగుతోందన్నారు.
ఆర్థిక స్వావలంబనతో మహిళా సాధికారత సాధ్యమన్నది కొంత వరకు నిజమే కానీ, రకరకాల అహేతుక భావ దాస్యాలను వదులుకోవడం ద్వారానే నిజమైన మహిళా సాధికారత సాధ్యమని వక్తలు చెప్పారు. రాజేశ్వరి రంగవల్లి విజ్ఞాన కేంద్రం సభ్యురాలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలతో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాల మహిళల అభ్యున్నతి కోసం చదువు అవసరాన్ని గుర్తించి విద్య వ్యాప్తి కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పిడిఎస్‌యు విజృంభణ నాయకులు సావిత్రిబాయి పూలే అందించిన సేవలను కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చెన్నమనేని పురుషోత్తం రావు, పోకల సాయికుమార్, జర్నలిస్ట్ అల్లే రమేష్, రంగు ఆంజనేయులు గౌడ్, చెట్కూరి ఆంజనేయులు గౌడ్, స్వప్న, జ్యోతి, సరిత, లచ్చవ్వ, పిడిఎస్‌యు విజృంభణ నాయకులు బుట్టం అరవింద్ పటేల్, రామ్ సాయి, పాల్గొన్నారు.

# క్షణికావేశంలో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

**మేడిపల్లి (జనంసాక్షి):** కొండాపూర్ గ్రామానికి చెందిన తాలుక రాకేష్(29), మద్యానికి బానిసై, తేదీ 23.02.2026 తేదీన మద్యం మత్తులో తన ఇంటికి వెళ్ళి, మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తన తండ్రిని అడుగగా, తండ్రి డబ్బు లు ఇవ్వకపోవడంతో, క్షణికావేశంలో వారి ఇం ట్లో పొలానికి గట్లకు కొట్టడానికి తెచ్చి ఉంచిన గడ్డి మందును త్రాగగా, వెంటనే తండ్రి రవి, అతని భార్య లక్ష్మి కలిసి మృతుడిని అంబులెన్స్ లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అదే రోజు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చెపిస్తుండగా, వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక వైద్య ఖర్చులను భరించలేక, మృతుడిని తిరిగి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అదే రోజు రాత్రి డాక్టర్ మరణించినట్లు ప్రకటించారు. మృతుని తండ్రి రవి ఫిర్యాదు ఇవ్వగా హెడ్ కానిస్టేబుల్ సలీముద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనయినదని, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# ప్రజాపాలన, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

**సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష**



**కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ లకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలు చేయడంలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమని అన్నారు. నూతనంగా ఎన్నికైన వారు సహా, ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమాలపై అవగాహన ఉండాలని తెలిపారు. అందువల్ల ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజలకు లబ్ధి చేకూర్చే వివిధ పథకాలు, కార్యక్రమాలు, వాటి అమలు, లబ్ధి పొందే విధానంపై వివరించాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర, పై అవగాహన కల్పించాలని అన్నారు. 99 రోజుల ప్రజా పాలన కార్యాచరణ గురించి స్పష్టంగా తెలిపాలని, ఈ కార్యక్రమంలోని 10 అంశాలు వాటి ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. మహిళల, పిల్లల సంరక్షణ చట్టాలు, హెల్ప్ లైన్ నెంబర్లు, ఇందిరమ్మ ఇండ్లు, వాటి పురోగతి, గృహాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు, విద్య, వైద్య శాఖల్లో అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ డిడి నాగలేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్, హౌసింగ్ శాఖ పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యా కమిషన్‌లో అర్బన్ నక్సల్స్ ప్రభావం

- ఓయూ దూరవిద్యా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం
- వామపక్ష భావజాలం రుద్దే ప్రయత్నం జరుగుతోంది : రాంచందర్ రావు
- ప్రభుత్వ పాఠశాలలు దెబ్బతిన్నాయి.. మౌలిక సదుపాయాల కొరత

**సికింద్రాబాద్, మార్చి 10 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్‌లో అర్బన్ నక్సల్స్, మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు ఎక్కువగా ఉన్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. తెలంగాణ విద్యా విధానం-2026 అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రంలో మంగళవారం ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంచందర్ రావు మాట్లాడుతూ విద్యా కమిషన్‌లో మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తుల ప్రభావం ఆందోళనకరమన్నారు. విద్యార్థులపై వామపక్ష భావజాలాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని, విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేరని, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేరని, రెండూ ఉంటే మౌలిక వసతులు లేవని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, మిడ్‌డే మీల్స్ వంటి కనీస సదుపాయాలు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన బీఈడీ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారికి అవకాశాలు లభించడం లేదని, గురుకుల పాఠశాలల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. నూతన విద్యా విధానం రూపొందించేటప్పుడు మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు భారతీయ సంస్కృతి, విలువలను ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా వ్యవస్థ భవిష్యత్తు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయ వ్యవస్థలో మార్పులు, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ టి. పాపిరెడ్డి, ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ తిరుమల రావు, ప్రొఫెసర్ మురళీ మనోహర్, కప్పర ప్రసాదరావు, తాడూరి శ్రీనివాస్, వీరబాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### బొందల గడ్డగా మారిన రామగుండం పునర్నిర్మాణం చేసి

# అద్భుత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**



**గోదావరిఖని, జనంసాక్షి :** నగరాన్ని విద్య,వైద్య,వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నశీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసన సభ్యులు ఎం .ఎస్. రాజ్ ఠాకూర్ కోరారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళ వారం 19 వ డివిజన్ అల్లూరు, సంతోష్ నగర్ లో, 38 వ డివిజన్ సీతా నగర్ లో నిర్వహించిన కార్యక్రమాల్లో నగర మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ అరుణ శ్రీ తో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బొందల గడ్డగా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మాణం చేసి అద్భుత నగరంగా తీర్చి దిద్దడమే ధ్యేయంగా విమర్శలను లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రయత్నంలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. రామగుండం నగరానికి మరో రెండు కొత్త భారీ పరిశ్రమలు రానున్న నేపథ్యంలో ఐదు లక్షల జనాభాతో ఒక మహా నగర స్థాయికి చేరుకుంటుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వం, ప్రైవేటు రంగంలో లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించారని అన్నారు. రామగుండం నగరంలో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్వశక్తి మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించడానికి కోట్లాది రూపాయల సబ్సిడీ రుణాలు తమ ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు.
ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని హాజరైన వారితో నగర మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలలో చెత్త వేయడం వలన దోమలు పెరిగి అనేక వ్యాధుల బారిన పడుతున్న విషయం గ్రహించాలని అన్నారు. నగర పాలక సంస్థ స్వచ్ఛ వాహనాలకే చెత్త అందించి సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సహకరించాలని కోరారు. ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో 800 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. కాగా ఈ సంధర్భంగా మిషన్ భగీరథ విభాగం ఆద్వర్యంలో విలీన గ్రామం వెంకట్రావ్ పల్లి కుమార స్వామి నగర్ లో నిర్మించిన ఉపరిత వాటర్ ట్యాంక్ ను మేయర్ మహంకాళి స్వామితో కలిసి ఎం.ఎల్.ఎ. ఎం ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. అల్లూరు సంతోష్ నగర్‌లో కాలువలను పరిశీలించారు . సీతానగర్ లో చెత్త విభజన, సేకరణ పై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు మారెల్లి సుశీలా రాజి రెడ్డి, నెలకశీటి రాము, బుర్ర శశికళ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఇ గురువీర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి రామన్ ,మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్‌ను సందర్శించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్

**ఖైరతాబాద్, మార్చి 10 (జనం సాక్షి) :** పంజాగుట్ట లోని నిమ్స్ ఆసుపత్రిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్ అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నిమ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప ఇటీవల జరిగిన వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలు, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి న విధానాన్ని ఆధారాలతో క్లుప్తంగా వివరించారు. ఈ వివరాలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని సూచించారు. డైరెక్టర్ తీసుకుంటున్న చర్యలను ఛైర్మన్ వెంకటయ్య అభినందించారు. ఈ సమీక్ష సమావే శంలో కమిషన్ సభ్యులు చరణ్ రాజ్, కుశ్రం నీలా దేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, రేణుకుంట్ల ప్రవీణ్, నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, డీన్ ప్రో.లిజా రాజశేఖర్, అదనపు మెడికల్ సూపరిం టెండెంట్ డా. లక్ష్మీ భాస్కర్, ఆర్.ఎమ్.ఓలు, ఎస్సీ-ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు కేజియా, అసోసి యేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల పంపిణి

**శామీర్ పేట్, మార్చి 10 (జనం సాక్షి) :** ప్రజా పాలిన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళ వారం రోజు ఆలియాబాద్ రైతు వేదికలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రికరణ పని ముట్లు పంపిణి చేశారు. రోటవేటర్లు, స్ప్రెయర్లు, బెలర్సులను సబ్సిడీపై అందజేశారు. ఈ కార్య క్రమంలో డిఏఓ చంద్రకళ, ఏడిఎ వెంకట్రాంరెడ్డి, ఏఎంసి చైర్మన్ నర్సింలు యాదవ్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్ రెడ్డి, అలియా బాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరిష కృష్ణారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవ రెడ్డి,కౌన్సిలర్లు జశ్వంత్ రెడ్డి, దీపిక, హనుమాన్ దాస్, వనజ, మౌనిక, దీపా, యమున, వెంకటేష్, ఏఎంసి డైరెక్టర్ భిక్షపతి, ఏఓ రమేష్, ఏఈఓలు రవి, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలి

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**తాండూరు మార్చి 10 (జనంసాక్షి) :** అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాల కు (గృహ ప్రవేశం) ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటి వరకు గ్రౌండింగ్ కానీ లిస్ట్ తయారు చేయాలని సూచించారు. యంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని హౌసింగ్ ఏఈ, ఎంపీడీవో లను ఆదేశించారు. అధికారులు ప్రజల కు అందుబాటులో ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనిత, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈలు, అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

# నేతన్న ఘోషను ఆలకించారు మంత్రి

- ప్రభుత్వాలు మారిన మారని చేనేత కార్మికుల రాతలు
- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



**హయత్ నగర్, మార్చి 10 (జనం సాక్షి) :** తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు వర్కాల చంద్ర శేఖర్ లతో కూడిన ప్రతినిది బృందం హ్యాండ్ లూమ్ టెక్స్ టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ని వారి నివాసంలో కలిసి, చేనేత పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికుల ఋణమాఫీకి సంబందించిన 16.27 లక్షలు ప్రభుత్వం నుండి వచ్చాయని అందరికి అమలు అవుతాయని అన్నారు. చేనేతపై తీసుకున్న ఋణమాఫీ ఫైల్ బ్యాంకు వారు లేవంటున్నారని, అధికారులు వాటిని పరిశీలించి, బ్యాంకు వారు ఇచ్చిన లేఖ ఆధారంతో అధికారులు ఋణమాఫీ చేయాలని కోరారు. త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం రెండు నెలలు డిపాజిట్ చేసి నెలలు గడుస్తున్నా వెయ్యలేదని, చేనేత కార్మికులు నెల వారిగా డిపాజిట్ చేస్తున్నారు, చేనేత కార్మికుల బ్యాంకు అకౌంట్ లో వెంటనే త్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం జమ చేయాలని వారు తెలిపారు.
గతంలో ఉన్న యార్న్ సబ్సిడీ (చేనేత చేయూత) స్థానంలో నేతన్న భరోసా పథకం ప్రకటించి నేటి వరకు అమలు జరుపలేదు. చేనేత కార్మికునికి 2000/-, అనుబంధ కార్మికులకు ఇద్దరికీ 500/- జమ చేస్తూ నేతన్న భరోసా పథకం వెంటనే అమలు జరుపాలని కోరుతున్నాం. నేతన్న భీమా పథకంలో 59 సంవత్సరాల లోపల వారికి ఇన్సూరెన్స్ కంపెనీలు ఇస్తున్నారు. 59 పైబడిన చేనేత కార్మికులకు ఎక్స్ గ్రేషియో 5 లక్షలు టెస్కోలో డబ్బులు లేవని ఏడాదిన్నర నుండి ఇవ్వడం లేదు, షరతులు లేకుండా నేతన్న భీమా పథకం వెంటనే ఇవ్వాలని వారు విన్నవించారు. గతంలో ఉన్న ఐసీఐసీఐ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం చేనేత కార్మికులకు ఉపయోగకరంగా ఉండేది. అది కాస్తా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. దాని స్థానంలో చేనేత కార్మికులకు రాష్ట్ర పథకం హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని వారు కోరారు. వెనుక బడిన తరగతుల, షెడ్యూల్ కులాల, తెగల, సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ గురుకులాలకు టెస్కో నుండి చేనేత వస్త్రాలను ఇప్పటి వరకు కొనుగోలు చేస్తున్నట్లుగానే భవిష్యత్ లో కూడా కొనుగోలు చేయాలని, మంత్రి స్పందించి సంబందించిన అధికారులతో మాట్లాడుతామని వారు హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు మారినా గాని, చేనేత కార్మికుల రాతలు మారట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### చేనేత కార్మికుల సమస్యలు

చేనేత పారిశ్రామిక సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ ఋణం మాఫీ చేయాలని, చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కార్మికులకు హౌస్ కం వర్క్ షెడ్ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇవ్వాలని, ప్రతి చేనేత కార్మికుడికి పెట్టుబడి సాయం కింద వడ్డీ లేని ఋణం 5 లక్షలు రూపాయలు ఇవ్వాలని, జియో టాగ్ వేసిన చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పథకం అమలు చేయాలని, అర్హులైన చేనేత కార్మికులకు వేస్తున్న జియో టాగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, చేనేత వస్త్రాలకు డూప్లికేట్ ను అరికట్టాలని, వస్త్ర నిల్వలను టెస్కో ఖరీదు చేయాలని, చేనేతకు 11రకాల వస్త్రాలను రిజర్వ్ చేసిన చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఖచ్చితంగా పూర్తి స్థాయిలో అమలు చేయాలని, గద్వాల జిల్లా రాజోలి, నల్లగొండ జిల్లా చండూర్, నకిరేకల్ లలో వర్షాకాలంలో మగ్గం గుంటలోనికి ఊటనీరు చేరిన చేనేత కార్మికులకు స్టాండ్ మగ్గాలు ఇవ్వాలని, హౌస్ కం వర్క్ షెడ్ ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేయాలని, రద్దయిన కేంద్ర పథకాలను తిరిగి పునరుద్దరణ జరిగేటట్లు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు మంత్రిని కోరారు.

# నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలి

- ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి
- రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం స్వచ్ఛత .. పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై తనిఖీ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ లోని నీటి పారుదల శాఖ, ఈఈ పీ ఆర్, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమ శాఖ, డీటీ సీపీఓ, కార్మిక శాఖ, భూగర్భ శాఖ, డీఆర్ డీఓ, మైనింగ్, సీపీఓ, వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, సహకార శాఖ, ఎక్సైజ్, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీ ఆఫీస్, ట్రెజరీ శాఖ, ఏవో ఆఫీస్, డీపీఆర్ఓ, సంక్షేమ శాఖ తదితర కార్యాలయాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని వివిధ గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫైల్స్, రికార్డులు, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా శాఖ కార్యాలయం, మండలాల్లోని కార్యాలయాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు స్టోర్ రూమ్ లా సిద్ధం చేయాలని, నిబంధనల ప్రకారం భద్రపరచాలని స్పష్టం చేశారు. అనవసరమైనవి తొలగించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలోని నిరుపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తొలగించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న కుండీల్లో మొక్కలు పెట్టించాలని కలెక్టర్ తెలిపారు. ఇట్టి పరిశీలనలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
11 మార్చి 2026

# గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ (జనంసాక్షి) : గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను భక్తులకు సౌకర్యవంతంగా, భద్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పుష్కర ఘాట్ల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలు మరియు ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ఆయా శాఖల సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. సమావేశంలో కొండా సురేఖ మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలను ఆధ్యాత్మిక వైభవంతో, భక్తి భావంతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. దేవాదాయ శాఖ పరంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న పలు ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కందకుర్తి నుంచి భద్రాచలం వరకు గోదావరి నది పరివాహక ప్రాంతంలో బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం వంటి అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దేవాలయాల వద్ద భక్తులకు అవసరమైన సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీరు, భక్తుల రాకపోకల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గోదావరి నదిని తెలంగాణ గంగా గా భావించే ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాన్ని గౌరవిస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## భద్రతా విభాగం కార్యదర్శిగా ఉదయ్ కుమార్ రెడ్డి

- నియమించిన డిజిపి శివధర్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : పోలీస్ భద్రత, ఆరోగ్య భద్రత విభాగం నూతన కార్యదర్శిగా రిటైర్డ్ ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, భద్రత విభాగం మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ బి. శివధర్ రెడ్డి నియమించారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం నాడు భద్రత మరియు ఆరోగ్య భద్రత మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మరియు డిజిపి అధ్యక్షతన సమావేశం జరిగింది. మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యదర్శి పదవికి వచ్చిన పలు ప్రతిపాదనలను పరిశీలించిన కమిటీ చైర్మన్ ఉదయ్ కుమార్ రెడ్డి నియామకానికి ఆమోదం తెలిపారు. ఉదయ్ కుమార్ రెడ్డి గతంలో ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఎస్పీగా విధులు నిర్వహించారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. గత 20 ఏళ్లుగా భద్రత, ఆరోగ్య భద్రత కార్యదర్శిగా పనిచేసిన ఎ. గోపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. సమావేశం ప్రారంభంలో ఆయన మృతికి సంతాప సూచకంగా అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అంకితభావంతో ఆయన చేసిన సేవలను డిజిపి ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం విభాగం బలోపేతం, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం. భగవత్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, టీజీఎస్పీ అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్, పి అండ్ ఎల్ ఐ జి పి గజరావు భూపాల్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, ఏఐజీ ఎం. రమణ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు వై. గోపిరెడ్డి, లైసెన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ హైవేపై ప్రమాదంలో ప్రమాదం

- ఆగివున్న వాహనాలను ఢీకొన్న లారీ
- ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం.. క్లీనర్‌కు గాయాలు



నల్గొండ, మార్చి10 (జనంసాక్షి) : నార్కట్‌పల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో బస్సు, లారీ ఢీకొన్నాయి. దీంతో రోడ్డు పక్కన వాహనాలను ఆపి మాట్లాడుకుంటుండగా.. మరో లారీ వచ్చి ఆగివున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బస్సు డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందగా.. బస్సు క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో కాకినాడ వైపు వెళ్తున్న మోజో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, రాజమండ్రి వైపు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఒకదానికొకటి స్వల్పంగా తగిలాయి. దీంతో రెండు వాహనాల డ్రైవర్లు పక్కన ఆపి మాట్లాడుకుంటున్నారు. అది గమనించిన మరో ట్రావెల్ బస్సు కూడా అక్కడ ఆపారు. ఆ బస్సు డ్రైవర్లు శ్రీనివాస్, బంగారయ్య వచ్చి గొడవ గురించి చర్చించారు. ఇంతలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వస్తున్న లారీ.. అతివేగంతో దూసుకొచ్చి ఆపివున్న లారీని ఢీకొట్టింది. దీంతో నలుగురు వ్యక్తులు రెండు లారీల మధ్య నలిగిపోయారు. ఈ ఘటనలో రెండో బస్సు డ్రైవర్లు శ్రీనివాస్, బంగారయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మొదటి బస్సు క్లీనర్ సురేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు డ్రైవర్ల మృతదేహాలను నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం తరలించారు. ఇక మూడు వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించి, రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## రామగుండం 'ఎన్టీపీసీ'ని వేగవంతం చేయాలి

- సీఎంకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : రామగుండం ఎన్టీపీసీ రెండో దశ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. మొదటి ఫేజ్‌ను గతంలో పూర్తి చేయగా, రెండో ఫేజ్‌లో భాగంగా 2,400 మెగావాట్ల సామర్థ్యంతో మిగిలిన మూడు పవర్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎన్టీపీసీ చర్యలు చేపట్టినట్టు వివరించా రు. మొదటి ఫేజ్‌లో మాదిరిగానే రెండో ఫేజ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్తులో 85 శాతాన్ని తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో అత్యంత ఆధునికమైన 'అల్ట్రా సూపర్ క్రిటికల్' సాంకేతికతతో తక్కువ ఖర్చుకే విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న ఎన్టీపీసీ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పందించాలని కోరారు.

## డబ్బుల కోసం అమ్మకానికి మగ శిశువు

- ఐదుగురిని అరెస్ట్ చేసిన హావేలీఘనపూర్ పోలీసులు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మెదక్ డియస్పి ప్రసన్న కుమార్



మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక నెల మగ శిశువును అమ్మిన ఘటన హావేలీఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ ఘటనలో శిశువు తల్లిదండ్రులు, మధ్యవర్తులు, కొనుగోలు చేసిన దంపతులు సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. హావేలీఘనపూర్ మండలం లింగసాన్ పల్లి తాండకు చెందిన కేతావత్ మంజుల (25), ఆమె భర్త మహేష్‌లు ఒక నెల క్రితం మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మగ శిశువుకు జన్మనిచ్చారు. అయితే గత వారం రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో లభించే అనుబంధ పోషకాహారం కోసం మంజుల రాకపోవడంతో అంగన్వాడీ టీచర్ ఆమె ఇంటికి వెళ్లి విచారించగా ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని ఐసిడిఎస్ సెక్టార్ ఇంచార్జ్ పర్ల విజయలక్ష్మికి తెలియజేశారు. ఈ క్రమంలో విచారణ జరపగా తేది 4న మెదక్ పట్టణంలోని ఒక టాకీస్ వద్ద మంజుల, మహేష్‌లు హావేలీఘనపూర్‌కు చెందిన కుమ్మరి నాగరాజు, అతని భార్య స్వప్నతో కలిసి తమ మగ శిశువును మొదట రూ.5 లక్షలకు అమ్మాలని నిర్ణయించుకుని, తరువాత రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అనంతరం హావేలీఘనపూర్ మండలం శాలిపేట గ్రామ శివారులో స్టాంప్ పేపర్‌పై రాతపూర్వకంగా ఒప్పందం చేసుకుని శిశువును వారికి అప్పగించారు. తేది 9న చేగుంట బస్ స్టాప్ వద్ద మంజుల, మహేష్‌లను ఐసిడిఎస్ సెక్టార్ ఇంచార్జ్ పర్ల విజయలక్ష్మి గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసుల విచారణలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిశువును అమ్మినట్లు వారు తెలిపారు. మధ్యవర్తులైన కుమ్మరి నాగరాజు, భార్య స్వప్నను విచారించగా, కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన తమ బంధువులు నరసొల్ల రాజు, అతని భార్య నరసొల్ల రజిత పిల్లలు లేని కారణంగా రూ.1.50 లక్షలకు శిశువును అప్పగించినట్లు వెల్లడైంది. దీంతో ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి భిక్నూర్ మండలం కంచర్ల గ్రామానికి వెళ్లి నరసొల్ల రాజు వద్ద నుంచి మగ శిశువును స్వాధీనం చేసుకుని సఖి కేంద్రంలో శిశువు తల్లి మంజులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం రిమాండ్ కు తరలిస్తామని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు.

## అవయవ మార్పిడి చికిత్సలో ఆదర్శంగా నిలవాలి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ (జనంసాక్షి) : అవయవ మార్పిడి చికిత్సలో ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో అవయవ మార్పిడి చికిత్స లపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఆర్గాన్ డొనేషన్స్ యాక్ట్ సమర్థవంతంగా అమలు అయ్యేలా అవసరమైన సమగ్ర పాలసీ రూపకల్పనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ప్రైవేటు ఆసుపత్రులలో అవయవ మార్పిడి చికిత్స ల ధరల పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని మంత్రి ప్రైవేట్ యాజమాన్యాల కు సూచించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చేసిన సూచనలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. దాతలు ఇచ్చిన అవయవాలు వృధా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం - వైద్య ఆరోగ్యశాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్స కోసం 4 ఆసుపత్రులు అనుమతులు ఇచ్చామన్నారు. అలాగే, రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై మంత్రి ప్రవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారుల ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులలో సామాన్యులకు వైద్య ఖర్చులు భారం కాకుండా ఉండాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో అన్ని ప్రవేట్ ఆసుపత్రులలో చికిత్స లకు అయ్యే టారిఫ్ పై నియంత్రణ ఉండేలా కార్యాచరణ కు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. శ్రీ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## డీమాన్ పవన్‌కు పితృవియోగం



హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 కంటెస్టెంట్, ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ డీమాన్ పవన్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. కొంత కాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన తండ్రి మంగళవారం కన్నుమూశారు. ఈ వార్త విన్న అభిమానులు, బిగ్ బాస్ సహచర కంటెస్టెంట్లు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సామాన్యుల కోటాలో బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టిన డిమాన్ పవన్, తన ఆటతీరుతో అనతికాలంలో లక్షల మంది హృదయాలను గెలుచుకున్నాడు. షోలో ఉన్న సమయంలో తన తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి పవన్ పలుమార్లు ఎమోషనల్ అయ్యారు. బిగ్ బాస్ షోకి పవన్ తండ్రి కూడా వచ్చాడు. ఒకానొక దశలో తన తండ్రి కోలుకుంటున్నారని, క్యాన్సర్‌ను జయించారని అంతా భావించిన తరుణంలో ఈ విషాదం చోటు చేసుకోవడం అందరినీ కలచివేస్తోంది. తన తండ్రి మరణవార్తను పవన్ స్వయంగా తన సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ 'నాన్న.. మీ ఆశీస్సులు ఎప్పుడూ నాతో ఉంటాయి' అని ఎమోషనల్ పోస్ట్ చేశారు.

## ఆపరేషన్ క్రాక్‌డౌన్ శిక్షణ

- వివరాలను వెల్లడించిన టిజిసి ఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సహకరిస్తూ, అద్దె ఖాతాలను నిర్వహిస్తున్న నెట్‌వర్క్‌లనే లక్ష్యంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో భారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఫిబ్రవరి 25న రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించిన ఈ దాడుల వివరాలను ఆమె వెల్లడిస్తూ, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ నుంచి సేకరించిన డేటాను విశ్లేషించి, తెలంగాణలో ప్రారంభమైన అనుమానాస్పద బ్యాంక్ ఖాతాలను గుర్తించామని చెప్పారు. మొత్తం 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీసు బృందాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 137 బ్యాంక్ శాఖల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయని, ఈ తనిఖీల్లో దేశవ్యాప్తంగా సుమారు 9,451 నేరాలతో సంబంధం ఉండి, దాదాపు రూ.100 కోట్ల నష్టానికి కారణమైన 1,888 మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ధృవీకరించినట్లు ఆమె వివరించారు. ఈ ఆపరేషన్ ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 549 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 626 మంది అనుమానితులను గుర్తించగా, అందులో 208 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

అరెస్టయిన వారిలో సామాన్యులే కాకుండా 15 మంది మహిళలు, ఏడుగురు విద్యార్థులు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగితో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా ఉండటం గమనార్హమని శిఖా గోయల్ వెల్లడించారు. వీరంతా తమ బ్యాంక్ ఖాతాలను సైబర్ మోసగాళ్లకు అద్దెకు ఇచ్చి, ప్రతి లావాదేవీపై 5 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నట్లు విచారణలో తేలిందని, వీరి నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంక్ పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల వయస్సు 19 నుంచి 45 ఏళ్ల మధ్య ఉందని, సమాజంలోని వివిధ వర్గాల వారు ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లకు చెందిన ఇద్దరు ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా ఖాతాలు తెరవడంలో సహకరించినందుకు వారిని కూడా అరెస్టు చేశామని, వరంగల్‌లో ఒక నిందితుడు తన కుటుంబ సభ్యుల ఖాతాలనే మోసాలకు వేదికగా మార్చుకున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు.

ఈ ఆపరేషన్ ద్వారా దేశవ్యాప్త సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని, బాధితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ మన రాష్ట్ర బ్యాంకింగ్ వ్యవస్థ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డైరెక్టర్ స్పష్టం చేశారు. వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు వీలు కల్పించే సెక్షన్ 112 బిఎన్ఎస్ ను ఈ కేసుల్లో ప్రయోగించామని, దేశంలోనే ఈ సెక్షన్‌ను ఇంత పెద్ద ఎత్తున వినియోగించడం ఇదే మొదటిసారి అని ఆమె వివరించారు. ఖాతాలు తెరవడానికి సహకరించే ఫెసిలిటేటర్లు, సిమ్ కార్డులు సమకూర్చేవారు, ఏటీఎం వివరాలు సేకరించేవారిని గుర్తించి వారిపై కూడా నిఘా పెంచామని, సైబర్ నేరగాళ్ల మౌలిక సదుపాయాలను నిర్వీర్యం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలెవరూ తమ బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, ఓటీపీ వంటి వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, కమీషన్ల కోసం ఖాతాలను అద్దెకు ఇవ్వడం నేరమని, దీనివల్ల కఠినమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని శిఖా గోయల్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## చేనేత కార్మికుడు ఆత్మహత్య




రామన్నపేట, మార్చి 10 (జనంసాక్షి) : అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామన్న పేట మండలంలోని వెల్లంకి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు (39) చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య అంజలి, ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. చేనేత పని కోసం ఐదేండ్ల క్రితం భువనగిరిలోని ఫయ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. గత రెండు నెలలుగా చేనేత పనులు లేకపోవడంతో డబ్బులు లేక ఈఎంఐ కట్టలేదు. దీంతో మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న పిఠాధిశ్వరులు

బాసర, మార్చ్ 10( జనం సాక్షి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసరలోని చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని మంగళవారం గురు మదనానంద సరస్వతీ పీఠం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారు దర్శించుకొని పత్యేక పూజలు నిర్వహించారు. ఈయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు, వైదిక బృందం స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం స్వామివారు భక్తులకు అనుగ్రహించారు.



## వ్యవసాయ అధికారిణి వేధింపులు తాళలేక అటెండర్ ఆత్మహత్య యత్నం



మంచిర్యాల ప్రతినిధి మార్చి 10 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో వ్యవసాయ శాఖలో జిల్లా అధికారిని వేధింపులు తాళలేక కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ తమను వేధింపులకు గురిచేస్తుందని అటెండర్ బొల్లి శ్రీనివాస్ కార్యాలయ ప్రాంగణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో తోటి సిబ్బంది వెంటనే అతనిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. బాధితుడు శ్రీనివాస్ భార్య మాట్లాడుతూ.. ప్రతిరోజు వ్యవసాయ అధికారిని సురేఖ తన మా భర్త పై వేధింపులకు పాల్పడేదని నోటికి వచ్చినట్లు దూషించేదని పేర్కొన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ఆఫీసులో జరిగిన సంఘటనను తమతో చెబుతూ బాధపడేవాడని తెలిపారు. రోజురోజుకు వేధింపులు ఎక్కువ కావడంతో ఇవాళ మానసికంగా కృంగిపోయి తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బాధితుడి భార్య కన్నీటి పర్యంతమయ్యారు . కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. జిల్లా జడ్జి కూడా ఆసుపత్రిలో బాధితుడి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370